www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 3-7-2025 | పేజీలు: 20 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 117 | శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్లపక్షం, తిథి: అష్టమి మ.2:07 తదుపరి నవమి, నక్షత్రం: హస్త మ.1:51 తదుపరి చిత్త, వర్జ్యం: రా.10:50-12:38, దుర్ముహూర్తం: ఉ.10:09-11:01, మ.3:21-4:13, అమృతఘడియలు: ఉ.7:10-8:56, రాహుకాలం: మ.1:30-3:00, సూర్యోదయం: 5:48, సూర్యాస్తమయం: 6:50 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

చురుకుగా రుతుపవనాలు

నేడు కోస్తా, రాయలసీమల్లో వర్షాలు

తుంగభద్ర నుంచి నీటి విడుదల

ఆరు గేట్లు ఎత్తిన అధికారులు 20

డ్యాంలో ప్రస్తుతం 77 టీఎంసీల నీరు

శ్రీశైలానికి కొనసాగుతున్న వరద

నిత్యావసర వస్తువులపై జీఎస్టీ తగ్గుదల?

12 నుంచి 5 శాతానికి తగ్గించే యోచనలో కేంద్రం

పూర్తిగా ఎత్తేసే ప్రతిపాదన కూడా పరిశీలన 2

రాబోయే జీఎస్టీ మండలి సమావేశంలో నిర్ణయం

టూత్‌పేస్ట్, నెయ్యి, సబ్బులు, పాదరక్షలు, దుస్తులు, వాషింగ్ మెషిన్లు తదితర వస్తువులు ఇక చౌక!



అంగన్‌వాడీ స్కూల్‌లో చిన్నారితో చంద్రబాబు

మాది అభివృద్ధి యజ్ఞం

ఎవరెన్ని ఆటంకాలు సృష్టించినా అది ఆగదు: చంద్రబాబు

ఐదేళ్లలో వ్యవస్థలన్నీ పడకేశాయ్.. కేంద్ర నిధులూ తేలేదు

జగన్ ప్రభుత్వం లక్ష కోట్ల అప్పులు చేసి పోయింది

కారు కింద పడిన కార్యకర్తను కుక్కపిల్లలా లాగేశారు

అంబులెన్స్‌లో చనిపోయాడని ఆయన భార్యతో చెప్పించారు

పేదరిక నిర్మూలనకే పీ-4.. 15 లక్షల బంగారు కుటుంబాలే లక్ష్యం

పిల్లలందరికీ తల్లికి వందనం ఇచ్చాం.. మాట నిలబెట్టుకున్నాం

రైతులకు 20 వేలు ఇవ్వబోతున్నాం.. వైసీపీ కంటే రెట్టింపు సంక్షేమం

కుప్పంలోని శాంతిపురం ప్రజావేదికలో ముఖ్యమంత్రి వెల్లడి

శాంతిపురం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): 'నేను అభివృద్ధి, సేవా రాజకీయాలు నేర్చుకున్నా. హత్యా రాజకీయాలు నాకు తెలియవు' అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టంచేశారు. అభివృద్ధి, సంక్షేమ యజ్ఞం చేస్తున్నానని.. ఎవరు ఎన్ని ఆటంకాలు సృష్టించినా అది ఆగదని తేల్చిచెప్పారు. చిత్తూరు జిల్లాలో తన సొంత నియోజకవర్గం కుప్పం పర్యటనకు వచ్చిన ఆయన.. బుధవారం సాయంత్రం శాంతిపురంలో నిర్వహించిన

మిగతా 19వ పేజీలో...

తిమ్మరాజుపల్లెలో ఇంటింటికీ సీఎం

'సుపరిపాలనలో తొలి అడుగు'లో చంద్రబాబు

నేడు కూడా నియోజకవర్గంలో పర్యటన

250 కోట్లు తరలించారు

అవన్నీ మద్యం ముడుపులే

చెవిరెడ్డి ఆదేశాలతోనే నగదు రవాణా 20

బాలాజీ, నవీన్ రిమాండ్ రిపోర్టులో సిట్

'తుడా' కార్లలో హైదరాబాద్‌కు.. డబ్బుతో ఏపీకి

తాడేపల్లిలో డంప్.. ఒంగోలు, తిరుపతికి తరలింపు

సాంకేతిక ఆధారాలతో వారిద్దరినీ విచారించాలి

కస్టడీకి ఇవ్వాలని ఏసీబీ కోర్టును కోరిన సిట్

ఆగస్టులో 'అక్షరాంధ్ర'!

ఏటా 25 లక్షల మందిని అక్షరాస్యులుగా మార్చే లక్ష్యం

వయోజనులకు 100 గంటల పాటు శిక్షణ

ప్రతి సంవత్సరం సెప్టెంబరు, మార్చిలో పరీక్షలు

కేంద్ర పథకం 'ఉల్లాస్'తో నిర్వహణకు ప్రణాళిక

రాష్ట్రంలో 1.2 కోట్ల మంది నిరక్షరాస్యులు

వీరిలో 15-59 ఏళ్ల మధ్యవారు 81.14 లక్షలు



3

రూ.2వేల కోట్ల ఆస్తులను కాజేయడానికి
సోనియా, రాహుల్ కుట్ర

» ఢిల్లీ ప్రత్యేక కోర్టులో ఈడీ వాదన.. నేడూ విచారణ

న్యూఢిల్లీ, జూలై 2: తొంభై కోట్ల రూపాయల అప్పును సాకుగా చూపి.. అసోసియేటెడ్ జర్నల్స్ లిమిటెడ్ (ఏజేఎల్)కు చెందిన రూ.2 వేల కోట్ల ఆస్తులను కాజేసేందుకు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ కుట్రపన్నారని ఈడీ ఆరోపించింది. ఇందుకోసమే 'యంగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్' సంస్థను ఏర్పాటు చేశారని.. అందులో సోనియా, రాహుల్‌కు 76 శాతం షేర్లున్నాయని పేర్కొంది. నేషనల్ హెరాల్డ్ కేసుకు సంబంధించి.. ఢిల్లీ ప్రత్యేక కోర్టులో బుధవారం విచారణ జరిగింది. ఈడీ తరఫున వాదనలు వినిపించిన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు.. ప్రత్యేక న్యాయమూర్తి విశాల్ గోగ్నే దృష్టికి పలు కీలక విషయాలను తీసుకొచ్చారు. ఏజేఎల్ సంస్థ ఆలిండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) నుంచి రూ.90 కోట్లు అప్పుగా తీసుకుందని.. రూ.2000 కోట్ల ఆస్తులున్న ఆ సంస్థకు ఆ అప్పును తీర్చడం చిన్నపిల్లల ఆటతో సమానమని ఆయన పేర్కొన్నారు. కానీ, ఈ కేసులో ఆ రూ.90 కోట్లకు బదులుగా ఏజేఎల్ ఆస్తులు మొత్తాన్నీ స్వాధీనం చేసుకోవడానికి సోనియా, రాహుల్ 'యంగ్ ఇండియన్' అనే సంస్థను ఏర్పాటు చేశారని వివరించారు. దాని ఎండీగా రాహుల్ నియమితులైన ఆరురోజుల్లోనే.. 'అప్పు తీర్చండి లేదా దాన్ని ఈక్విటీ రూపంలోకి మార్చండి' అనే ప్రతిపాదనను ఏజేఎల్‌కు పంపారని రాజు కోర్టుకు తెలిపారు. తర్వాత ఏజేఎల్ తన ఆస్తులన్నింటినీ యంగ్ ఇండియన్ సంస్థకు ఇచ్చేసిందని పేర్కొన్నారు. ఈ ఆస్తులన్నీ ఏజేఎల్‌కు 1947 తర్వాత కేంద్ర ప్రభుత్వం, పలు రాష్ట్రాల ప్రభుత్వాలు ఇచ్చినవేనని చెప్పారు. ఈ వ్యవహారంలో ప్రత్యక్ష లావాదేవీలకు తాను దూరంగా ఉండడానికే.. 'యంగ్ ఇండియన్' సంస్థను ఏఐసీసీ సృష్టించిందని చెప్పారు. రూ.90 కోట్ల రుణానికి బదులుగా మొత్తం ఆస్తులను ఎలా స్వాధీనం చేసుకుంటారన్నదే ప్రశ్న అని ఎస్వీ రాజు వాదించారు. ఈ వ్యవహారంలో షేర్ల అమ్మకాలు, కొనుగోళ్లు.. అన్నీ బోగస్ లావాదేవీలేనని కోర్టుకు తెలిపారు. ఈ కేసు విచారణ గురువారం కొనసాగనుంది.

ఐదేళ్లూ నేనే ముఖ్యమంత్రి: సిద్దరామయ్య

» ఆయనకు మద్దతివ్వడం తప్ప మరో దారి లేదు: డీకే

బెంగళూరు, జూలై 2(ఆంధ్రజ్యోతి): నాయకత్వ మార్పుపై ఊహాగానాలు జోరందుకున్న నేపథ్యంలో కర్ణాటక సీఎం సిద్దరామయ్య స్పందించారు. చిక్కబళ్లాపురలో ఆయన బుధవారం మీడియాతో మాట్లాడారు. ఐదేళ్లు తానే సీఎంగా కొనసాగుతానని, ఈ విషయంలో ఎలాంటి అనుమానం అవసరం లేదని స్పష్టంచేశారు. బీజేపీ నేతలు అబద్ధాలు చెప్పడంలో దిట్టలని, నిజాలు చెప్పడం వారికి తెలియదని విమర్శించారు. తన నాయకత్వంపై పార్టీలో ఎలాంటి అసంతృప్తి లేదని చెప్పారు. పార్టీ కోసం శ్రమించిన డీకే శివకుమార్‌ను గుర్తించి, ఆయనను సీఎం చేయాలని ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తున్నారు కదా అని మీడియా ప్రశ్నించగా.. అందరూ ఎంతో కష్టపడ్డారని, తాను ఒంటరివాడిని కాదని సిద్దరామయ్య పేర్కొన్నారు. మరోవైపు, సిద్దరామయ్యకు మద్దతు ఇవ్వడం తప్ప తనకు మరో మార్గం లేదని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పష్టంచేశారు. చిక్కబళ్లాపుర జిల్లా నందిహిల్స్‌పై జరుగుతున్న క్యాబినెట్ మీటింగ్‌కు హాజరయ్యే సమయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తాను సిద్దరామయ్యకు అండగా ఉండి సహకరిస్తానని తెలిపారు. కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి ఉంటానని తెలిపారు. ఓవైపు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి రణదీప్‌సింగ్ సుర్జేవాలా బెంగళూరులో ఎమ్మెల్యేలతో చర్చలు కొనసాగిస్తుండగానే డీకే శివకుమార్ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశమైంది.

చావు తప్పదని విమానంలోనే వీలునామాలు

» కుటుంబాలకు బ్యాంకు పిన్‌లు, ఇన్సూరెన్స్ వివరాలు

» విమానం కూలిపోతుందన్న భయంతో 'చివరి సందేశాలు' పంపిన ప్రయాణికులు.. సురక్షితంగా ల్యాండ్ చేసిన పైలట్

న్యూఢిల్లీ, జూలై 2: చైనాలోని షాంఘై నుంచి జపాన్‌లోని టోక్యోకు బయల్దేరిన జపాన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన బోయింగ్-737 విమానంలో సాంకేతిక లోపం తలెత్తడంతో అది నిమిషాల వ్యవధిలోనే 26వేల అడుగులు కిందకు దిగజారిపోయింది. 36వేల అడుగుల ఎత్తులో వెళ్తున్న విమానం కేవలం 10నిమిషాల్లోనే 10,500అడుగులకు పడిపోయింది. జూన్ 30న సాయంత్రం 6.53గంటలకు ఈ ఘటన జరిగింది. ఆ సమయంలో విమానంలో సిబ్బందితో సహా 191 మంది ఉన్నారు. విమానం కుదుపునకు నిద్రలో ఉన్న ప్రయాణికులు ఉలిక్కిపడి లేచారు. విమానం కిందికి పడిపోతున్న క్రమంలో ఆక్సిజన్ మాస్కులు బయటకు వచ్చాయి. దీంతో, విమానం తప్పక కూలిపోతుందని, తాము చనిపోవడం ఖాయమని భయపడ్డ చాలా మంది ప్రయాణికులు వీలునామాలు రాశారు. ప్రియమైన వారికి సందేశాలు పంపించారు. బ్యాంకు పిన్ నంబర్లు, ఇన్సూరెన్స్ లాంటి వివరాలను కుటుంబసభ్యులకు షేర్ చేశారు. అయితే, విమానం పైలట్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెనుప్రమాదం తప్పింది. విమానం పడిపోతున్న క్రమంలో ఎమర్జెన్సీ ప్రకటించిన పైలట్ దాన్ని టోక్యోకు బదులుగా దగ్గర్లో ఒసాకాకు మళ్లించి కాన్సాయ్ ఎయిర్‌పోర్టులో సురక్షితంగా ల్యాండింగ్ చేశాడు.

12వ తరగతి బాలుడితో టీచరమ్మ బలవంతపు శృంగారం!

ముంబై, జూలై 2: విద్యార్థిని బలవంతంగా ఒప్పించి, అతడితో పలుమార్లు శృంగారంలో పాల్గొన్న ఉపాధ్యాయురాలిని పోలీసులు అరెస్టు చేశారు. బాధితుడు అదే పాఠశాలలో 12వ తరగతి చదువుతున్న విద్యార్థి. దేశంలోని ఐదు అత్యున్నత పాఠశాలల్లో ఒకటిగా గుర్తింపు పొందిన ముంబైలోని స్కూల్లో ఈ ఘటన వెలుగుచూసింది. బాధిత బాలుడిని సదరు ఉపాధ్యాయురాలు తన వెంట బెట్టుకొని ఫైవ్ స్టార్ హోటళ్లు, ఇతర చోట్లకు తీసుకెళ్లి అతడితో శృంగారంలో పాల్గొన్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఆ ఉపాధ్యాయురాలి వేధింపులు తాళలేక బాధిత బాలుడు ఎట్టకేలకు ఘోరాన్ని బయటపెట్టాడు. 12వ తరగతి పరీక్షలు పూర్తయ్యాక ఒకానొక రోజు.. బాలుడిని వెంటబెట్టుకొని తీసుకురావాలంటూ అతడి ఇంటికి ఆ ఉపాధ్యాయురాలు తన పనివాణ్ని పంపింది. వెళ్లడం ఇష్టంలేని బాధితుడు, మహిళా టీచర్ వేధింపుల గురించి తన తల్లిదండ్రులకు చెప్పుకొన్నాడు. ఈ ఘటనపై దాదర్ పోలీసులకు బాధితుడి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. బాలుడి స్టేట్‌మెంట్‌ను పోలీసులు నమోదు చేశారు. ఉపాధ్యాయురాలి ప్రతిపాదనకు బాలుడు అంగీకరించకపోతే, మరో మహిళ ఆ బాలుడిని ఒప్పించిందని.. వయసులో తమకన్నా పెద్దవారైన మహిళలతో టీనేజర్లు లైంగిక సంబంధం పెట్టుకోవడం మామూలేనంటూ సదరు మహిళ బాధితుడితో అన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి సదరు ఉపాధ్యాయురాలిని పోలీసులు అరెస్టు చేశారు. ఆమెపై పోక్సో, కౌమార న్యాయ చట్టాల కింద కేసు నమోదు చేశారు. మహిళా టీచర్ చెప్పినట్లుగా వినాలని బాలుడిని ఒప్పించిన సదరు మహిళపైనా ఎఫ్ఐఆర్ నమోదైంది.

గాజాలో కాల్పుల విరమణకు ఇజ్రాయెల్ ఓకే: ట్రంప్

టెహ్రాన్/వాషింగ్టన్, జూలై 2: హమాస్ నాయకులు, క్యాడర్ లక్ష్యంగా గాజాపై విరుచుకుపడుతున్న ఇజ్రాయెల్.. 60 రోజుల పాటు కాల్పుల విరమణకు అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఈ మేరకు తన సామాజిక మాధ్యమ సంస్థ 'ట్రూత్ సోషల్'లో ఓ పోస్టు చేశారు. "కాల్పుల విరమణకు ఇజ్రాయెల్ అంగీకరించింది. అన్ని వైపుల నుంచి సంప్రదింపులు జరుపుతున్నాం. ఈ యుద్ధాన్ని ముగించడమే మా లక్ష్యం" అని పేర్కొన్నారు. అయితే.. కాల్పుల విరమణ ఎప్పటి నుంచి అమల్లోకి వస్తుందనే విషయాన్ని చెప్పలేదు. శాంతి చర్చలకు సహకరించిన ఖతార్, ఈజిప్ట్ వర్గాలను ఆయన అభినందించారు. కాగా.. ఇజ్రాయెల్ ఈ అంశంపై స్పందించలేదని బీబీసీ న్యూస్ పేర్కొనగా.. యుద్ధాన్ని పూర్తిస్థాయిలో ముగిస్తామంటేనే కాల్పుల విరమణకు అంగీకరిస్తామని హమాస్ ప్రకటించింది. ఇదిలా ఉండగా, అంతర్జాతీయ అణు శక్తి సంస్థ(ఐఏఈఏ) నుంచి ఇరాన్ అధికారికంగా వైదొలగింది. ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధంలో భాగంగా.. అమెరికా తన బీ2 బాంబర్లతో ఫోర్డో, నటాంజ్, ఇస్ఫహాన్ అణు కేంద్రాలపై దాడులు చేసిన విషయం తెలిసిందే..! ఈ చర్యను నిరసిస్తూ ఐఏఈఏ నుంచి వైదొలగుతామని ప్రకటించిన ఇరాన్.. గత వారం పార్లమెంట్‌లో ఆ మేరకు బిల్లును ప్రవేశపెట్టింది. తాజాగా ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ఆ బిల్లును ఆమోదించారు.

నిత్యావసర వస్తువులపై
జీఎస్టీ తగ్గింపు?

12 నుంచి 5 శాతానికి.. లేదా పూర్తిగా ఎత్తివేత.. మధ్యతరగతికి ఊరట!

» రాబోయే జీఎస్టీ మండలి భేటీలో నిర్ణయం



న్యూఢిల్లీ, జూలై 2: మధ్యతరగతి ప్రజలకు శుభవార్త. ఈ ఏడాది ఆదాయ పన్ను రాయితీలతో ఊరట కల్పించిన కేంద్ర ప్రభుత్వం.. ఆయా వర్గాలకు మరింత ఉపశమనం కల్పించేందుకు సిద్ధమవుతోంది. మధ్యతరగతి, అల్పాదాయ కుటుంబాలకు వస్తు సేవల పన్ను (జీఎస్టీ)ని తగ్గించడం ద్వారా ఊరట కల్పించనుందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం 12 శాతం జీఎస్టీ పరిధిలో ఉన్న నిత్యావసర వస్తువులపై పూర్తిగా పన్నును తొలగించడం లేదా చాలా వస్తువులను 5శాతం జీఎస్టీ పరిధిలోకి తీసుకొచ్చే అంశాన్ని పరిశీలిస్తోందని వెల్లడించాయి. టూత్‌పేస్ట్, టూత్ పౌడర్, గొడుగులు, కుట్టు మిషన్లు, ప్రెషర్ కుక్కర్లు, వంట పాత్రలు, నెయ్యి, సబ్బులు, చిరుతిళ్లు, ఎలక్ట్రిక్ ఇస్త్రీ పెట్టెలు, గీజర్లు, తక్కువ సామర్థ్యం కలిగిన వాషింగ్ మెషీన్లు, సైకిళ్లు, రూ.1000 కంటే ఎక్కువ ధర కలిగిన రెడీమేడ్ దుస్తులు, రూ.500-1000 ధర కలిగిన పాదరక్షలు, తదితర వస్తువులపై జీఎస్టీని తగ్గించనున్నట్లు సమాచారం. ఈ తగ్గింపు అమల్లోకి వస్తే చాలా వస్తువులు చౌకగా దొరుకుతాయి. సామాన్యులు వాడే ఈ నిత్యావసర వస్తువులపై జీఎస్టీని తగ్గించడం వల్ల ప్రభుత్వంపై రూ.40-50వేల కోట్ల భారం పడనుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆ భారాన్ని మోసేందుకు సర్కారు సిద్ధమవుతోందనీ పేర్కొన్నాయి. ప్రజల వినియోగ సామర్థ్యాన్ని పెంచేందుకే జీఎస్టీ తగ్గింపు నిర్ణయం తీసుకుంటున్నట్లు వెల్లడించాయి. వస్తువుల ధరలు తగ్గితే విక్రయాలు పెరుగుతాయని, ఫలితంగా జీఎస్టీ వసూళ్లు కూడా పెరుగుతాయని కేంద్ర ప్రభుత్వం విశ్వసిస్తోంది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో జీఎస్టీ రేట్లలో మార్పులు చేస్తామన్న సంకేతాలు ఇచ్చారు. నిత్యావసర వస్తువులపై పన్నులను హేతుబద్ధీకరిస్తామని, మధ్యతరగతి ప్రజలకు ఊరట కల్పించే దిశగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కాగా, జీఎస్టీ తగ్గింపుపై త్వరలో జరగబోయే 56వ జీఎస్టీ కౌన్సిల్ భేటీలో నిర్ణయం తీసుకుంటారని భావిస్తున్నారు.

రాష్ట్రాలూ అంగీకరించాలి..


జీఎస్టీ తగ్గింపుపై కేంద్ర ప్రభుత్వం మాత్రమే ముందుకు వస్తే సరిపోదు. ఆయా ప్రతిపాదనలపై రాష్ట్రాల మధ్య కూడా ఏకాభిప్రాయం కుదరాల్సి ఉంటుంది. పన్ను తగ్గింపునకు జీఎస్టీ కౌన్సిల్ ఆమోదం తప్పనిసరి. కౌన్సిల్‌లో ప్రతి రాష్ట్రానికీ ఓటు హక్కు ఉంటుంది. ప్రస్తుతం పంజాబ్, కేరళ, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్ నుంచి కొంత వ్యతిరేకత ఉన్నట్లు తెలుస్తోంది. అయితే జీఎస్టీ కౌన్సిల్ చరిత్రలో ఇప్పటి వరకూ ఒక్కసారి మాత్రమే ఓటింగ్ జరిగింది. మిగిలిన అన్ని నిర్ణయాలూ ఏకగ్రీవంగానే తీసుకోవడం విశేషం.

12% జీఎస్టీ పరిధిలోని వస్తువులు ఇవే..

టూత్‌పౌడర్, హెయిర్ ఆయిల్, సబ్బులు (కొన్ని విభాగాలపై 18% ఉంది), నెయ్యి, టూత్‌పేస్ట్ (కొన్ని బ్రాండెడ్ రకాలపై 12%, ఇతర పేస్ట్‌లపై 18%), గొడుగులు, కుట్టు మిషన్లు, వాటర్ ఫిల్టర్లు, ప్యూరిఫయర్లు (నాన్ ఎలక్ట్రిక్), ప్రెషర్ కుక్కర్లు, అల్యూమినియం, స్టీల్‌తో చేసిన వంట పాత్రలు, ఎలక్ట్రిక్ ఇస్త్రీ పెట్టెలు, గీజర్లు, వ్యాక్యూమ్ క్లీనర్లు (తక్కువ సామర్థ్యం, వాణిజ్యేతర), వాషింగ్ మెషీన్లు (తక్కువ సామర్థ్యం), సైకిళ్లు, దివ్యాంగుల వాహనాలు, రెడీమేడ్ దుస్తులు (రూ.1000పైన ధర కలిగినవి), పాదరక్షలు (రూ.500-1000), టీకాలు, హెచ్ఐవీ, హెపటైటిస్, టీబీ డయాగ్నస్టిక్ కిట్లు, కొన్ని ఆయుర్వేద, యునానీ మందులు, డ్రాయింగ్, కలరింగ్ పుస్తకాలు, రెడీ మిక్స్ కాంక్రీట్, ప్రి-ఫ్యాబ్రికేటెడ్ భవనాలు, వ్యవసాయ పనిముట్లు, ప్యాకేజ్డ్ ఆహారం, సోలార్ వాటర్ హీటర్లు. కాగా, సిగరెట్లు, విలాసవంతమైన కార్లు, కార్బొనేటెడ్ డ్రింక్స్ తదితర వస్తువులపై జీఎస్టీని భారీగా పెంచనున్నట్లు తెలుస్తోంది.

రద్దీ వేళల్లో రెండింతల చార్జీ

» ఉబర్, ఓలా, ర్యాపిడో వంటి క్యాబ్ సేవల సంస్థలకు కేంద్రం అనుమతి



న్యూఢిల్లీ, జూలై 2: ఉబర్, ఓలా, ర్యాపిడో వంటి క్యాబ్ సేవల (అగ్రిగేటర్) సంస్థలు రద్దీ వేళల్లో రెట్టింపు చార్జీలు వసూలు చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. అదే సమయంలో రద్దీ ఉండని సాధారణ వేళల్లో కనీస మొత్తం (బేస్ ఫేర్)లో 50శాతం కంటే తక్కువ చార్జీ తీసుకోవద్దని స్పష్టం చేసింది. దీనితోపాటు పలు కీలక అంశాలపై స్పష్టత ఇస్తూ కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంగళవారం 'మోటారు వాహన సేవా సంస్థల (అగ్రిగేటర్) మార్గదర్శకాలు-2025'ను విడుదల చేసింది. ఆ మార్గదర్శకాల ప్రకారం..

- క్యాబ్ సంస్థలు కనీస చార్జీల్లో సగం (50శాతం తక్కువ) నుంచి గరిష్ఠంగా రెండింతల వరకు వసూలు చేసుకోవచ్చు. ఉదాహరణకు ఏదైనా నిర్ధారిత దూరం ప్రయాణానికి (రైడ్‌కు) రూ.100 బేస్ ఫేర్ అనుకుంటే.. డిమాండ్ ఉండని సమయాల్లో కనీసం రూ.50 కంటే తక్కువ చార్జీ చేయవద్దు. ఎక్కువ రద్దీ ఉండే సమయాల్లో గరిష్ఠంగా రూ.200కు మించి వసూలు చేయవద్దు. (ఇంతకు ముందు గరిష్ఠ చార్జీ ఒకటిన్నర రెట్ల వరకే ఉండేది).
- క్యాబ్ బుక్ అయిన తర్వాత డ్రైవర్ సరైన కారణం చెప్పకుండా ప్రయాణాన్ని రద్దు చేసుకుంటే.. ఆ రైడ్ చార్జీల్లో 10% (రూ.100కు మించకుండా) జరిమానాగా చెల్లించాలి. ప్రయాణికులు రద్దు చేసుకున్నా ఇదే రూల్ వర్తిస్తుంది.
- బుక్ చేసుకున్న తర్వాత ప్రయాణికుడిని పికప్ చేసుకునేందుకు క్యాబ్ ప్రయాణించే దూరం 3 కిలోమీటర్లలోపు ఉన్నప్పుడు దానికి ఎలాంటి చార్జీ విధించకూడదు.
- క్యాబ్ డ్రైవర్లు సంబంధిత సంస్థ యాప్‌లో సూచించిన మార్గంలో మాత్రమే ప్రయాణించేలా చర్యలు చేపట్టాలి. ఒకవేళ మార్గం మార్చితే వెంటనే ఆటోమేటిగ్గా కంట్రోల్ రూమ్‌ను అప్రమత్తం చేసే ఏర్పాట్లు ఉండాలి.
- క్యాబ్ సంస్థలు ప్రయాణికుల కోసం కనీసం రూ.5 లక్షలకు బీమా తీసుకోవాలి. డ్రైవర్లకు రూ.5 లక్షల ఆరోగ్య బీమా, రూ.10 లక్షల టెర్మ్ ఇన్సూరెన్స్ తీసుకోవాలి.
- క్యాబ్ సంస్థలు ఎనిమిదేళ్లు దాటిన (రిజిస్ట్రేషన్ నాటి నుంచి) వాహనాలను సర్వీసులో ఉంచకూడదు. ప్రతి వాహనంలో లోకేషన్ ట్రాకింగ్ పరికరాలు తప్పనిసరిగా అమర్చాలి.
- వ్యక్తిగత ద్విచక్ర వాహనాలను క్యాబ్/ట్యాక్సీ సేవల కోసం వినియోగించేందుకు కేంద్రం అవకాశం ఇచ్చింది. దీనిపై రాష్ట్రాలు మార్గదర్శకాలు ఇవ్వాలని, ఆ సేవలు అందించే సంస్థల నుంచి చార్జీలు వసూలు చేసుకోవచ్చని సూచించింది.
- రాష్ట్రాలు 3నెలల్లోగా తమ మార్గదర్శకాలను అమలుపై ఉత్తర్వులు ఇవ్వాలని కోరింది.

రష్యా చమురు కొంటే
500% సుంకం

» అమెరికాలో బిల్లు.. భారత్‌పై తీవ్ర ప్రభావం

వాషింగ్టన్, జూలై 2 : ఉక్రెయిన్‌తో యుద్ధం తర్వాత రష్యాకు మిగిలిన అతి పెద్ద ఆదాయ వనరు చమురు. రష్యాపై ఆర్థిక ఆంక్షలు మరింత కఠినతరం చేయాలంటే ఆ దేశం నుంచి చమురు కొంటున్న దేశాలపై భారీగా సుంకాలు విధించాలంటూ అమెరికా సెనేటర్ లిండ్సీ గ్రహమ్ ఒక బిల్లు తయారుచేశారు. అధ్యక్షుడు ట్రంప్ సూచనతోనే ఈ బిల్లు తయారైందని వార్తలు వెలువడుతున్నాయి. రష్యా చమురులో 70 శాతం భారత్, చైనాలే కొంటున్నాయి. అంటే గ్రహమ్ బిల్లు ప్రధానంగా ఈ రెండు దేశాలనే లక్ష్యంగా చేసుకున్నట్టు స్పష్టమవుతోంది. ఇటువంటి దేశాలు అమెరికాకు ఎగుమతి చేసే సరుకులపై 500 శాతం సుంకం విధించాలని తన బిల్లులో ఆయన ప్రతిపాదించారు. రష్యా దగ్గర చమురు కొనడం అంటే ఉక్రెయిన్‌కు మద్దతు నిరాకరించినట్టే భావించాల్సి ఉంటుందని ఆ బిల్లులో పేర్కొన్నారు. తన బిల్లుకు ట్రంప్ మద్దతు ఇచ్చారని, దీనిపై ముందుకెళ్లడానికి ఇదే సరైన సమయమని ఆయన సూచించారని గ్రహమ్ తెలిపారు. తన బిల్లు సెనేట్‌కు ఆగస్టులో రావచ్చునని తెలిపారు. నిజానికి, 2022లో ఉక్రెయిన్‌తో రష్యా యుద్ధం మొదలవగానే ప్రపంచ మార్కెట్‌లో చమురు ధరలు భగ్గుమన్నాయి. భారత్‌కు చౌకగా చమురు ఇవ్వడానికి ఈ సమయంలో రష్యా ముందుకొచ్చింది. యుద్ధానికి ముందు భారత్‌కు ప్రపంచ దేశాల నుంచి దిగుమతి అయిన చమురు ఉత్పత్తుల్లో ఒక శాతం కంటే తక్కువగానే రష్యా నుంచి అందేవి. ఇప్పుడు ఆ పరిమాణం 40-45 శాతానికి పెరిగిపోయింది.

డోజ్ ఓ రాకాసి.. మస్క్‌ను తినేస్తుంది: ట్రంప్

వాషింగ్టన్, జూలై 2: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోమారు బెదిరింపు ధోరణిని ప్రదర్శించారు. మస్క్ ఇంత కాలం సేవలందించిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ(డోజ్)ను ఆయనపైనే ప్రయోగిస్తామని ట్రంప్ తన ఫ్లోరిడా పర్యటనలో హెచ్చరించారు. "ప్రపంచంలో ఎవరికీ దక్కనన్ని సబ్సిడీలు మస్క్‌కు అందుతున్నాయి. ఈ సబ్సిడీలు లేకపోతే.. ఆయన దుకాణం మూసుకుని, వెళ్లిపోవాల్సిందే" అని ఇటీవల వ్యాఖ్యానించిన ట్రంప్.. తాజాగా డోజ్ అనే రాకాసి ఇప్పుడు మస్క్‌ను తినేసేలా చేస్తామని పేర్కొన్నారు. "రాకెట్ ప్రయోగాలు, శాటిలైట్లు, విద్యుత్తు కార్ల ఉత్పత్తి విషయంలో ఎన్నో సబ్సిడీలు ఇస్తున్నాం. ఈ సబ్సిడీలను ఆపేస్తే.. దేశానికి ఎంతో మిగులుతుంది. దీనిపై చర్యలకు డోజ్ సిద్ధంగా ఉంది. డోజ్ మస్క్ వైపు చూస్తే.. మనం చాలా డబ్బును ఆదా చేసుకోవచ్చు. మస్క్‌పై డోజ్‌ను ప్రయోగించాల్సి రావొచ్చు. డోజ్ అంటే ఏంటో తెలుసా? ఓ రాకాసి. ఎంతో భయంకరమైనది. మస్క్‌ను తినేస్తుంది" అని ఫ్లోరిడాలో మీడియాతో అన్నారు. కాగా.. 'బిగ్ బ్యూటిఫుల్' బిల్లును మస్క్ వ్యతిరేకించినప్పటి నుంచి ట్రంప్‌తో విభేదాలు పెరిగిన విషయం తెలిసిందే..! తాజాగా ఈ బిల్లు సెనేట్‌లో ఆమోదం పొందడంతో.. మస్క్ వరుస ట్వీట్లు చేశారు. ఆ బిల్లుకు మద్దతిచ్చేవారిని వచ్చే ఎన్నికల్లో ఓడించడమే ధ్యేయంగా తాను పనిచేస్తానని హెచ్చరించారు.

విద్యార్థి, హెల్త్‌కేర్ వీసాలకు బ్రేక్

» ఆంక్షలకు అమెరికా, యూకే సన్నద్ధం

» భారతీయ విద్యార్థులు, నిపుణులపై తీవ్ర ప్రభావం

» ఇంగ్లండ్‌లో 22 నుంచి విదేశీ ఆరోగ్య సిబ్బంది నియామకం నిలిపివేత

వాషింగ్టన్/లండన్, జూలై 2: విదేశీ విద్యార్థులు, ఆరోగ్య సంరక్షణ సిబ్బంది తమ దేశాల్లోకి అధిక సంఖ్యలో రాకుండా అడ్డుకోవాలని అమెరికా, యూకే భావిస్తున్నాయి. వారి సంఖ్యపై ఆంక్షలు విధించాలని నిర్ణయించాయి. అక్రమ వలసలపై కొరడా ఝుళిపిస్తున్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం.. తాజాగా ఎఫ్-1, జే-1 వీసాలపై వచ్చిన విదేశీ విద్యార్థులపై ఆంక్షలు విధించాలని, వారు అమెరికాలో నివసించే సమయాన్ని కుదించాలని భావిస్తోంది. దీనివల్ల ఆయా వీసాలపై అక్కడకు వెళ్లిన 3.3 లక్షల మంది భారతీయ విద్యార్థులు ఇబ్బందులు పాలయ్యే అవకాశముంది. ప్రస్తుతం ఈ వీసాలతో వెళ్లేవారిపై కఠినమైన ఆంక్షలు లేవు. తామొచ్చిన కార్యక్రమాలు పూర్తయ్యేవరకు వారు అమెరికాలో ఉండే అవకాశం ఉంది. అయితే ఎక్స్ఛేంజ్ విజిటర్లుగా వచ్చేవారు ఉండేందుకు కాలవ్యవధి నిర్ధారించాలని ట్రంప్ మొదటిసారి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు 2020లోనే ప్రతిపాదించారు. ఇప్పుడు అమెరికా హోంల్యాండ్ భద్రత విభాగం తాజాగా ఈ ప్రతిపాదన తెచ్చింది. ట్రంప్ యంత్రాంగం ప్రజాభిప్రాయం కోరకుండానే దీన్ని అమలు చేసే అవకాశం ఉంది. భారత్‌లోని అమెరికా ఎంబసీ ఇటీవల విదేశీ విద్యార్థులకు మే 14న ఓహెచ్చరిక చేసింది. నిర్ణీత గడువును మించి అమెరికాలో అక్రమంగా నివసించేవారు తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదని స్పష్టంచేసింది. ఆ తర్వాత ట్రంప్ యంత్రాంగం ఎఫ్-1, జే-1, ఎం-1 వీసాలను రద్దుచేయడమే గాక,, స్టూడెంట్ అండ్ ఎక్స్ఛేంజ్ విజిటర్ ఇన్ఫర్మేషన్ వ్యవస్థ (సెవిస్) రికార్డులను కూడా క్యాన్సిల్ చేయడంతో లక్షల సంఖ్యలో విదేశీ విద్యార్థులు అమెరికాను వీడాల్సి వచ్చింది. కాగా, జే-1 వీసా అంటే నాన్-ఇమిగ్రెంట్ వీసా. విద్య, సైన్స్, కళలు తదితర రంగాల్లో సాంస్కృతిక, మేధో సంబంధ మార్పిడిలో భాగంగా చేపట్టే విద్య, అధ్యయనం, పరిశోధన, ప్రత్యేక నైపుణ్యం, శిక్షణ కార్యక్రమాల్లో పాలుపంచుకునేందుకు అమెరికా వచ్చేవారికి ఈ వీసాలిస్తారు. ఎఫ్-1 వీసా.. అమెరికాలో ప్రముఖ విద్యాసంస్థల్లో చదువుకునేందుకు వచ్చే విదేశీ విద్యార్థులకు ఇస్తారు. ఎం-1 వీసా.. గుర్తింపు పొందిన విద్యాసంస్థలు..జూనియర్ కాలేజీలు, పోస్ట్-సెకండరీ వొకేషనల్ స్కూళ్లు, పోస్ట్-సెకండరీ బిజినెస్‌స్కూళ్లలోవొకేషనల్ లేదా సాంకేతిక శిక్షణ కోసం వచ్చేవారికి ఇస్తారు.

యూకేలో ఆంక్షలు కఠినతరం

కొత్త వీసా విధానంలో భాగంగా యూకేలో ఈ నెల 22 నుంచి విదేశాలకు చెందిన ఆరోగ్య సంరక్షణ సిబ్బంది నియామకాలను నిలిపివేయనున్నారు. అలాగే ఉద్యోగాల కోసం రాదలచుకున్నవారి వేతన పరిమితులను బాగా పెంచారు. ఈ మేరకు కఠినతర వీసా నిబంధనలను పార్లమెంటులో మూడ్రోజుల కిందట ప్రవేశపెట్టారు.

అంతరిక్షానికి మరో భారత సంతతి వ్యోమగామి


» నాసా ఐఎస్ఎస్ మిషన్‌కు ఎంపికైన అనిల్ మీనన్

» 2026లో ఎస్ఎస్‌కు.. 8 నెలలపాటు అక్కడే పరిశోధన



న్యూఢిల్లీ, జూలై 2: భారత సంతతికి చెందిన నాసా వ్యోమగామి అనిల్ మీనన్ ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) యాత్రకు ఎంపికయ్యారు. ఈ క్రమంలో సునీతా విలియమ్స్ తర్వాత ఐఎస్ఎస్‌లో అడుగుపెట్టనున్న మరో ఇండో-అమెరికన్ వ్యోమగామిగా ఆయన రికార్డు సృష్టించనున్నారు. 2026 జూన్‌లో నాసా చేపట్టనున్న మిషన్‌లో భాగంగా అనిల్ మీనన్.. 'రోస్కోస్మోస్ సోయజ్ ఎంఎస్-29' అనే అంతరిక్ష నౌకలో ఫ్లైట్ ఇంజనీర్‌గా, ఎక్స్‌పెడిషన్ 75 సభ్యుడిగా ఐఎస్ఎస్‌కు వెళ్లనున్నారు. మీనన్‌ను వచ్చే ఏడాది తన మొదటి మిషన్ కోసం ఐఎస్ఎస్‌కు పంపుతున్నామని నాసా తెలిపింది. మీనన్‌తోపాటు రష్యాకు చెందిన ప్యోటర్ డుబ్రోవ్, అనా కికినా కూడా రోస్కోస్మోస్ సోయజ్ ఎంఎస్-29లో ప్రయాణించనున్నారని పేర్కొంది. ఈ ముగ్గురూ దాదాపు ఎనిమిది నెలలపాటు ఐఎస్ఎస్‌లో శాస్త్రీయ పరిశోధనలు చేపట్టనున్నారు. ఈ ప్రయోగం కజకిస్థాన్ నుంచి చేపట్టనున్నారు. అమెరికాలో స్థిరపడిన భారత్-ఉక్రెయిన్‌కు చెందిన శంకరన్ మీనన్, లీసా సమోలెంకో దంపతులకు అనిల్ మీనన్ జన్మించారు. హార్వర్డ్ యూనివర్సిటీ నుంచి న్యూరోబయాలజీ డిగ్రీ సాధించారు. మసాచుసెట్స్ నుంచి మెకానికల్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీ, స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ నుంచి ఎమర్జెన్సీ మెడిసిన్, ఏరోస్పేస్ మెడిసిన్ పూర్తిచేశారు. 2014లో ఫ్లైట్ సర్జన్‌గా నాసాలో చేరిన మీనన్.. 2021లో వ్యోమగామి కార్యక్రమానికి ఎంపికయ్యారు. మూడేళ్ల కఠిన శిక్షణ అనంతరం 2024లో వ్యోమగామిగా పట్టభద్రుడయ్యారు. స్పేస్ ఎక్స్‌లో పనిచేసే అనా మీనన్‌ను ఆయన వివాహం చేసుకున్నారు.

లోకం తీరు



ఫోన్ ట్యాపింగ్ వ్యక్తి గోప్యతా హక్కు ఉల్లంఘనే

» మద్రాసు హైకోర్టు స్పష్టీకరణ

చెన్నై, జూలై 2(ఆంధ్రజ్యోతి): ప్రజా అత్యవసర పరిస్థితి లేదా ప్రజా ప్రయోజనాల విషయంలో తప్ప ఇతరత్రా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడడం వ్యక్తి ప్రాథమిక గోప్యతా హక్కు ఉల్లంఘనేనని మద్రాస్ హైకోర్టు తేల్చి చెప్పింది. నేరాలు గుర్తించడానికి ఒక వ్యక్తి లేదా వ్యక్తుల ఫోన్ సంభాషణలు రహస్యంగా వినేందుకు అనుమతి లేదని స్పష్టం చేసింది. దేశ సార్వభౌమాధికారం, సమగ్రత, రాష్ట్ర భద్రత, విదేశాలతో స్నేహపూర్వక సంబంధాలు, తీవ్ర నేర ప్రేరేపణ వంటి వాటిని నిరోధించడం కోసం అథారిటీ సంతృప్తి చెందిన తర్వాతే ట్యాపింగ్ ఉత్తర్వులను జారీ చేయాల్సివుంటుందని స్పష్టం చేసింది. టెలిగ్రాఫ్ చట్టంలోని సెక్షన్ 5(2), టెలిగ్రాఫ్ రూల్స్ 1951లోని రూల్ 419-ఏ కింద ఒక అవినీతి కేసుకు సంబంధించి తన ఫోన్ ట్యాపింగ్‌కు అనుమతి ఇస్తూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఓ ప్రైవేటు కంపెనీ ఎండీ పి.కిశోర్ హైకోర్టులో వేశారు. దాని విచారణ సందర్భంగా బుధవారం న్యాయమూర్తి జస్టిస్ ఆనంద్ వెంకటేశ్ నేతృత్వంలోని హైకోర్టు ధర్మాసనం ఈ మేరకు స్పష్టం చేసింది. చట్టంలోని సెక్షన్ 5(2) పరిధిని విస్తరించాలన్న కేంద్రం వాదనను కూడా ధర్మాసనం తిరస్కరించింది. అంతేగాక చట్టంలోని సెక్షన్ 5(2) కింద నిర్దేశించిన లక్ష్మణ రేఖను దాటలేరని తేల్చిచెప్పింది. ప్రస్తుత కేసులో అధికారులు ట్యాపింగ్ విషయాన్ని సమీక్ష కమిటీ ముందు ఉంచలేదని, అందువల్ల నిబంధనల ఉల్లంఘన జరిగిందని పేర్కొంది. చట్టంలోని సెక్షన్ 5(2), నిబంధనలలోని నిబంధన 419-ఎ(17)ని ఉల్లంఘించి ఈ విషయాన్ని సేకరించినందున, ఆ విషయాన్ని ఏ ఉద్దేశానికైనా ఉపయోగించరాదని ఆదేశించిన ధర్మాసనం.. పిటిషనర్ ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి కేంద్రం గతంలో జారీ చేసిన ఉత్తర్వులను కొట్టివేసింది.

21 నుంచి పార్లమెంట్ సమావేశాలు

న్యూఢిల్లీ, జూలై 2 : పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈ నెల 21వ తేదీన మొదలై ఆగస్టు 21వ తేదీ దాకా కొనసాగుతాయని పార్లమెంట్ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు బుధవారం ప్రకటించారు. అయితే, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నేపథ్యంలో ఆగస్టు 13, 14 తేదీల్లో సమావేశాలు జరగవని వెల్లడించారు. గతంలో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఆగస్టు 12తో ముగిసేవి. కానీ, ఈ సారి సమావేశాలను వారం పొడిగించారు.

పాక్ ఛానెళ్లపై నిషేధం ఎత్తివేత

న్యూఢిల్లీ, జూలై 2: పాకిస్థాన్ న్యూస్ ఛానెళ్లు, యూట్యూబ్ ఛానెళ్లు, సోషల్ మీడియా అకౌంట్లపై విధించిన నిషేధాన్ని భారత్ ఎత్తేసింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో తప్పుడు సమాచారం ప్రసారం చేయడంతో పాటు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారంటూ వీటిని నిషేధించింది. ప్రస్తుతం రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గిపోవడంతో నిషేధం తొలగిస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే కేంద్రం నుంచి అధికారికంగా ప్రకటన వెలువడలేదు.

అమర్‌నాథ్ యాత్ర ప్రారంభం

న్యూఢిల్లీ, జులై 2: పవిత్ర అమర్‌నాథ్ యాత్ర ప్రారంభమైంది. పటిష్ఠ భద్రత నడుమ మొదటి బ్యాచ్ ప్రయాణికులు బుధవారం ఉదయం తమ యాత్రను ప్రారంభించారు. భగవతీనగర్‌లోని యాత్రి నివాస్ బేస్ క్యాంపు నుంచి జమ్మూకశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా జెండా ఊపి యాత్రను ప్రారంభించారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఈ ఏడాది అమర్‌నాథ్ యాత్ర కోసం కేంద్రం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. అందుకోసం 581 పైగా సాయుధ పోలీసు దళాలను రంగంలోకి దించింది. అమర్‌నాథ్ యాత్ర 38 రోజుల పాటు కొనసాగి ఆగస్టు 9న ముగుస్తుంది. ఈ ఏడాది యాత్ర కోసం ఇప్పటివరకు 3.31 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

కొవిడ్ టీకాలు పూర్తి సురక్షితం

» ఆకస్మిక మరణాలతో వాటికి సంబంధం లేదు: కేంద్రం

న్యూఢిల్లీ, జూలై 2: వయసుతో సంబంధం లేకుండా ఉన్నట్టుండి గుండెపోటుతో పలువురు మృత్యువాత పడుతున్న ఘటనలు ఇటీవల తరచూ జరుగుతున్నాయి. క్రికెట్ ఆడుతూ, పెళ్లి ఊరేగింపులో నృత్యం చేస్తూ, వేదికపై పాట పాడుతూ... ఇలా ఎక్కడి వాళ్లు అక్కడే కుప్పకూలిపోయి క్షణాల్లోనే ప్రాణాలు వదిలేస్తున్నారు. కరోనా తర్వాతే ఈ తరహా మరణాలు ఎక్కువ కావడంతో వారు తీసుకున్న కొవిడ్ టీకాలే దీనికి కారణమని ప్రచారం సాగుతోంది. మరోవైపు కర్ణాటకలోని హాసన్ జిల్లాలో గత 40 రోజుల్లోనే 24 మంది గుండె సంబంధిత సమస్యలతో హఠాత్తుగా మృతిచెందడంతో వ్యాక్సిన్ ప్రభావంపై ఆ రాష్ట్ర సీఎం సిద్దరామయ్య అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కేంద్రం కీలక ప్రకటన చేసింది. దేశంలో సంభవిస్తున్న ఆకస్మిక మరణాలకు, కొవిడ్-19 టీకాలకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసింది. పలు జాతీయ వైద్య సంస్థలు నిర్వహించిన పరిశోధనల్లో సైతం ఇదే విషయం నిర్ధారణ అయిందని తెలిపింది. 'కొవిడ్ అనంతరం ప్రత్యేకించి 18 నుంచి 45 ఏళ్ల వయసున్న వారిలో ఆకస్మిక మరణాలకు గల కారణాలపై ఐసీఎంఆర్, ఎన్‌సీడీసీ పరిశోధనలు చేశాయి. కొవిడ్ టీకాకు, ఈ మరణాలకు ఎలాంటి ప్రత్యక్ష సంబంధం లేదని ఈ అధ్యయనాల్లో తేలింది. భారత్‌లోని కొవిడ్ టీకాలు సురక్షితమైనవని పరిశోధనలు ధ్రువీకరించాయి. కొవిడ్ తదనంతర ఇబ్బందులతో పాటు జన్యుపరమైన సమస్యలు, జీవనశైలి, గతంలో ఉన్న అనారోగ్యం వంటివి కూడా కార్డియాక్ అరెస్టుకు దారితీసి ఉండొచ్చని అధ్యయనాల్లో వెల్లడైంది' అని కేంద్రం వివరించింది. కాగా, 2021 అక్టోబరు నుంచి 2023 మార్చి మధ్య కాలంలో ఆరోగ్యంగా ఉన్నట్లు కనిపించినప్పటికీ ఆకస్మికంగా మరణించిన వ్యక్తులకు సంబంధించిన డేటాను ఐసీఎంఆర్ విశ్లేషించి ఈ నివేదికను రూపొందించింది.



మొదటి ప్రయాణికుడికి టికెట్ అందజేస్తున్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యే

విజయవాడ-కర్నూలు విమాన సర్వీసు ప్రారంభం

- వర్చువల్‌గా ప్రారంభించిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

ఓర్వకల్లు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్ల నుంచి కర్నూలు జిల్లా ప్రజలు ఎదురుచూస్తున్న విజయవాడ విమాన సర్వీసు కల ఎట్టకేలకు నెరవేరింది. విజయవాడ-కర్నూలు-విజయవాడ విమాన సర్వీసును ప్రజాప్రతినిధులు బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో కర్నూలు నుంచి విజయవాడకు విమాన సర్వీసులను పౌర విమాన యాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఢిల్లీ నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. కర్నూలు ఎయిర్‌పోర్టు నుంచి పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి, ఎంపీలు బైరెడ్డి శబరి, బస్తిపాటి నాగరాజు, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, ఇన్‌చార్జి కలెక్టర్ బి.నవ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ కర్నూలు-విజయవాడ కనెక్టివిటీ ఎంతో ఆనందాన్ని ఇస్తోందన్నారు. ఇప్పుడు ఈ విమాన సౌకర్యం అనంతపురం జిల్లా ప్రజలకు కూడా ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొత్త ఎయిర్‌పోర్టులను అభివృద్ధి చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టారని తెలిపారు. విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి, ఇప్పుడు కర్నూలు, అలాగే కడపలో ఈ సంవత్సర కాలంలో అదనంగా విమాన సర్వీసులు ప్రారంభించామని చెప్పారు. సుమారు 15 శాతం అదనపు సామర్థ్యాన్ని మన రాష్ట్రం నుంచి పెంచామన్నారు. ప్రస్తుతం కర్నూలు నుంచి మూడు రోజులు విమాన సర్వీసు అందుబాటులో ఉంటుందని, త్వరలో ఏడు రోజులకు పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మంత్రి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ కర్నూలు- విజయవాడ ఫ్లైట్‌ను ప్రారంభించిన ఇండిగో సంస్థకు ధన్యవాదాలు తెలిపారు. మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు కృషి వల్ల ఇది సాధ్యమైందన్నారు. పారిశ్రామికవేత్తలు తరుచుగా ప్రయాణించాల్సిన అవసరం ఉంటుందని, అందువల్ల ఓర్వకల్లు ఎయిర్‌పోర్టులో నైట్ ల్యాండింగ్‌కు కూడా కృషి చేయాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు.

రాజమహేంద్రవరంలో హైడ్రోజన్ పెరాక్సైడ్ లీక్

- రెండు గంటల్లో అదుపులోకి తెచ్చిన అగ్నిమాపక సిబ్బంది

రాజమహేంద్రవరం సిటీ, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని ఆంధ్రప్రదేశ్ పేపరు మిల్లు సమీపంలో నిలిపి ఉంచిన లారీ నుంచి హైడ్రోజన్ పెరాక్సైడ్ లీకవడంతో ఆ ప్రాంతమంతా వాయువు వ్యాపించింది. వివరాలు.. పేపరు మిల్లుకు గుజరాత్ నుంచి రసాయనాలు సరఫరా అవుతుంటాయి. మల్లయ్యపేట సమీపంలోని పాత ఊటలంక రోడ్డులో ఈ లారీలను నిలిపి ఉంచుతారు. ఈ నేపథ్యంలోనే గుజరాత్ నుంచి హైడ్రోజన్ పెరాక్సైడ్ లోడుతో వచ్చిన లారీ నిలిపి ఉంచినప్పుడు బుధవారం ఉదయం 9 గంటల సమయంలో రసాయనాలు లీకయ్యాయి. దీంతో తెల్లటి పొగ ఆ ప్రాంతంలో వ్యాపించింది. వెంటనే మిల్లు అధికారులు.. జిల్లా అధికారులకు సమాచారం ఇవ్వడంతో కలెక్టర్ ప్రశాంతి వెంటనే.. ఆర్డీవో కృష్ణనాయక్, అగ్నిమాపక, పరిశ్రమల శాఖ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ కె.కృష్ణమూర్తిని అప్రమత్తం చేశారు. అధికారుల ఆదేశాలతో ప్రాంతీయ అగ్నిమాపకశాఖ అధికారి మార్టిన్ లూథర్ కింగ్, జిల్లా పరిశ్రమల అధికారి వాణీధర్ రామన్ చేరుకుని... మూడు అగ్నిమాపక వాహనాలు రప్పించారు. అగ్నిమాపక సిబ్బంది రెండు గంటలపాటు శ్రమించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

ఆగస్టులో 'అక్షరాంధ్ర'!

ఏటా 25 లక్షల మందిని అక్షరాస్యులుగా మార్చే లక్ష్యం.. వయోజనులకు 100 గంటల పాటు శిక్షణ

- ప్రతి సంవత్సరం సెప్టెంబరు, మార్చిలో పరీక్షలు
- కేంద్ర పథకం 'ఉల్లాస్'తో పాటు నిర్వహణకు ప్రణాళిక
- అక్షరాస్యతలో అట్టడుగున ఆంధ్రప్రదేశ్
- రాష్ట్రంలో 1.2 కోట్ల మంది నిరక్షరాస్యులు
- వీరిలో 15-59 ఏళ్ల మధ్య వారు 81.14 లక్షలు
- 59 ఏళ్లు పైబడిన వారు 39.54 లక్షల మంది
- 2024-25లో 3.95 లక్షల మందికి శిక్షణ
- వైసీపీ ఐదేళ్ల పాలనలో 3 లక్షల మందికే...

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

అక్షరాస్యతలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అట్టడుగు స్థానంలో నిలిచింది. వెనుకబడిన రాష్ట్రాలుగా భావించే బిహార్, ఒడిశా, ఉత్తరప్రదేశ్ కూడా ఏపీ కంటే ముందున్నాయి. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా 2024 ఫిబ్రవరిలో నిర్వహించిన సర్వే ప్రకారం రాష్ట్రంలో ఏకంగా 1,20,68,709 మంది నిరక్షరాస్యులు ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వం వయోజన విద్యను పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వీరి సంఖ్య పెరగడానికి ఓ కారణమైంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రజలంతా మాతృభాషలో చదవడం, రాయడం లక్ష్యంగా కేంద్ర పథకం 'ఉల్లాస్'తో కలిసి 'అక్షరాంధ్ర' అనే కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా 2025-26లో 25లక్షల మందిని అక్షరాస్యులుగా మార్చాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. స్వయం సహాయక బృందాలు, విద్యార్థులు, ఇతర వలంటీర్ల సహకారంతో వయోజనులకు 100 గంటల పాటు శిక్షణ ఇస్తారు. ప్రతి సంవత్సరం సెప్టెంబరు, మార్చిలో పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు. ఇందుకోసం పుస్తకాల ముద్రణకు వయోజన విద్యా విభాగం టెండర్లు పిలిచింది. ఎక్కువ మందిని అక్షరాస్యులుగా మార్చినవారికి ప్రోత్సాహకాలు ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆగస్టులో ప్రారంభం కానున్న ఈ కార్యక్రమానికి సంబంధించి త్వరలో ఉత్తర్వులు జారీ కానున్నాయి.

ఏం నేర్పుతారు?

వయోజన విద్యలో చదవడం (వర్ణమాల, సరళమైన పదాలు, వాక్యాలు, చిత్రాలను చూసి పదాలు గుర్తించడం), రాయడం (తెలుగు అచ్చులు, హల్లులు, ఒత్తులు, గుణింతాలు, చిన్న వాక్యాలు), న్యూమరసీ (న్యూమరసీ-వెయ్యి వరకు అంకెలు, కూడికలు, తీసివేతలు, గుణకారాలు, భాగాహారాలతో పాటు కిలోలు, లీటర్లు, మీటర్ల లాంటి కొలతలపై అవగాహన కల్పిస్తారు), డిజిటల్ అండ్ ఫైనాన్షియల్ లిటరసీలో భాగంగా గడియారం, క్యాలెండర్‌ను చూసి అర్థం చేసుకోవడం, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లలో డిజిటల్ అంకెలను గుర్తించడం, ఏటీఎంలను వినియోగించడం తదితర అంశాలు నేర్పిస్తారు.

అక్షరాస్యత 77 శాతమే

రాష్ట్రంలో 5.25 కోట్ల మంది ప్రజలు ఉండగా వీరిలో అక్షరాస్యులు 4.04 కోట్ల మంది (77%). మరో 1.2 కోట్ల మందికి మాతృభాషలో చదవడం, రాయడం రాదు. వీరిలో 15 నుంచి 59 ఏళ్ల మధ్య 81.14 లక్షల మంది ఉంటే, 59ఏళ్లు దాటిన వారు 39.54 లక్షల మంది ఉన్నారు. అత్యధికంగా కర్నూలు జిల్లాలో 7.38 లక్షల మంది, అనంతపురంలో 6.09 లక్షల మంది, పల్నాడులో 6.09 లక్షల మంది నిరక్షరాస్యులు ఉన్నారు. అత్యల్పంగా పార్వతీపురం మన్యంలో 2.90 లక్షల మంది, అంబేడ్కర్ కోనసీమలో 2.97 లక్షల మంది నిరక్షరాస్యులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇక గ్రామీణ ప్రాంతాల్లో 96.71 లక్షల మంది నిరక్షరాస్యులుంటే, పట్టణ ప్రాంతాల్లో 23.97 లక్షల మంది ఉన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 58.01 లక్షల మంది మహిళలు, పురుషులు 38.69 లక్షల మంది, పట్టణాల్లో 15.32 లక్షల మంది మహిళలు, 8.64 లక్షల మంది పురుషులు నిరక్షరాస్యులుగా ఉన్నారు.

జగన్ సర్కారు నిర్లక్ష్యం

వయోజనుల్లో అక్షరాస్యతను పెంచే కార్యక్రమాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. గత ఐదేళ్లలో కేవలం 3లక్షల మందిని మాత్రమే అక్షరాస్యులుగా మార్చారు. ఫలితంగా అక్షరాస్యతలో దేశంలోనే ఏపీ చివరి స్థానంలో నిలిచింది. 2023-24లో నిర్వహించిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేలో ఈ విషయం తేలింది. అప్పటికి మిజోరం అత్యధికంగా 98.2 శాతంతో అగ్రస్థానంలో నిలిస్తే, 72.6 శాతంతో ఏపీ చివరన ఉండిపోయింది. బిహార్ (74.3%), మధ్యప్రదేశ్ (75.2%), రాజస్థాన్ (75.8%) ఏపీ కంటే ముందున్నాయి. 2024-25లో కూటమి ప్రభుత్వం 3.95 లక్షల మంది వయోజనులకు శిక్షణ ఇచ్చి, 3.53 లక్షల మందిని అక్షరాస్యులుగా మార్చింది.

దశల వారీగా మార్చడమే లక్ష్యం

15 నుంచి 59 ఏళ్ల మధ్య వయసున్న 81,14,598 మందిని దశల వారీగా అక్షరాస్యులుగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యం. 2025-26లో 25 లక్షల మందిని అక్షరాస్యులుగా మార్చేందుకు ప్రణాళిక రూపొందించాం. ఆగస్టు నుంచి అక్షరాంధ్ర కార్యక్రమం ప్రారంభమవుతుంది.

- కృతికా శుక్లా, వయోజన విద్యాశాఖ, డైరెక్టర్

షైనింగ్ టీచర్!

- కర్నూలు జిల్లా ఉపాధ్యాయురాలు కల్యాణికి అరుదైన గౌరవం
- ఆమె కృషిని ప్రశంసించిన మంత్రి లోకేశ్
- నివాసానికి ఆహ్వానించి సన్మానం
- ప్రభుత్వ విద్య బలోపేతం బాధ్యత టీచర్లదేనని వ్యాఖ్య

అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసే పవిత్ర బాధ్యత టీచర్లపైనే ఉందని మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి లోకేశ్ చెప్పారు. మొదటి ఏడాదిలో సంస్కరణలు పూర్తిచేశామని, అభ్యసన ఫలితాలు సాధించడమే ఇక ఏకైక లక్ష్యమన్నారు. ప్రాథమిక విద్యలో అద్భుత ఫలితాలు సాధిస్తున్న కర్నూలు జిల్లా పత్తికొండ మండలం జేఎం తండాలోని ఏకోపాధ్యాయ పాఠశాల ఉపాధ్యాయురాలు ఎం.కల్యాణిని బుధవారం ఉండవల్లిలోని నివాసంలో ఆయన సన్మానించారు. వృత్తిపట్ల అంకితభావంతో పనిచేస్తున్న ఆమెను మంత్రి స్వయంగా తన నివాసానికి ఆహ్వానించారు. పట్టుదలతో పాఠశాలను అద్భుతంగా తీర్చిదిద్దారని కొనియాడారు. 'షైనింగ్ టీచర్' పేరుతో అభినందించారు. ఆమె నుంచి పలు సలహాలు, సూచనలు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో 9,600 ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక టీచర్‌ను కేటాయించామని చెప్పారు. విద్యార్థులకు హోంవర్క్ ఇచ్చే అంశాన్ని కూడా పరిశీలిస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన టీచర్లున్నారని, ప్రైవేటు కంటే నాణ్యమైన విద్య లభిస్తోందని, సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం కలిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, వాటి బలోపేతానికి సీరియస్‌గా పనిచేస్తోందని చెప్పారు.



కర్నూలు జిల్లా పత్తికొండ మండలం జేఎం తండాలో ఏకోపాధ్యాయ పాఠశాలలో అంకితభావంతో పని చేస్తున్న 'షైనింగ్ టీచర్' ఎం.కల్యాణీ కుమారిని సత్కరిస్తున్న మంత్రి లోకేశ్

నాలుగు రెట్లు పెరిగిన విద్యార్థుల సంఖ్య

జేఎం తండాలోని ఏకోపాధ్యాయ పాఠశాలకు 2017లో కల్యాణి బదిలీపై వెళ్లారు. ఆ సమయంలో 1 నుంచి 5 తరగతుల వరకు 14 మంది విద్యార్థులు మాత్రమే ఆ పాఠశాలలో ఉన్నారు. వారిలోనూ రోజూ బడికి వచ్చేది ఇద్దరే. ఒక దశలో బడిని మూసేయాలని భావించారు. అయితే, కల్యాణి సొంత డబ్బుతో విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించి, మౌలిక సదుపాయాల కల్పన చేపట్టారు. ఇంటింటికీ తిరిగి ఆ పాఠశాలపై నమ్మకం కలిగించారు. ఫలితంగా 2020-21 నాటికి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 53కి పెరిగింది. పొరుగు గ్రామాల నుంచి కూడా విద్యార్థులు రావడం ప్రారంభమైంది. అక్కడ చదివినవారిలో 23 మంది గురుకులాల్లో, ఒకరు నవోదయ పాఠశాలలో అడ్మిషన్ పొందారు.

ఆశయంతోనే పనిచేశా: కల్యాణి

విద్యార్థులు ఉన్నతంగా రాణించాలనే ఆశయంతో పనిచేశానని ఈ సందర్భంగా కల్యాణి చెప్పారు. హోంవర్క్, హాజరు, క్రమశిక్షణ, ప్రేయర్, చేతి రాత, వ్యక్తిగత శుభ్రత, యూనిఫాంలో ఉత్తమంగా నిలిచిన విద్యార్థులకు స్టార్ ఆఫ్ ది వీక్ పేరుతో ప్రతి సోమవారం బహుమతులు అందజేస్తున్నానన్నారు. పేద విద్యార్థులకు చదువు దూరం కాకుండా 'మా తొలి అడుగు' పేరుతో పలక, బలపం, పెన్ను, నోట్ పుస్తకాలు ఇస్తున్నామని చెప్పారు. తన కృషిని గుర్తించి అభినందించిన మంత్రి లోకేశ్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

క్యాడర్‌ను కదిలించని జగన్ పిలుపు!

- జాడ లేని 'గుర్తుచేస్తూ..' కార్యక్రమం
- కడప జిల్లాలోనూ కనిపించని ప్రభావం
- 1 నుంచి నాలుగు దశల్లో జరపాలన్న జగన్
- రెండురోజులుగా స్పందన అంతంతే

అమరావతి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): జనం దగ్గరకు వెళితే ఎక్కడ పాత హామీలు గుర్తు చేస్తారేమోనని భయం! తాము అమలు చేయలేకపోయిన మద్యనిషేధం, జాబ్ క్యాలెండర్ వంటి హామీలపై నిలదీస్తే ఏం చెప్పాలని బెదురు! ఎన్నికలకు ఇంకా నాలుగేళ్ల ఉండగా, ఇప్పటినుంచే రాజకీయ కార్యక్రమాలంటే కష్టమన్న భావన! ప్రభుత్వ వ్యతిరేక ప్రచారం వికటించి వైసీపీ హయాం నిర్వాకాలు జనాలకు గుర్తొస్తే మొత్తంగానే కథ అడ్డం తిరుగుతుందేమోననే ఆందోళన! వెరసి.. 'చంద్రబాబు హామీలను గుర్తుచేద్దాం' అంటూ జగన్ ఇచ్చిన పిలుపును వైసీపీ క్యాడర్ ఎక్కడా పట్టించుకోలేదు. ఈ నెల ఒకటో తేదీ నుంచి నాలుగు దశల్లో ఈ కార్యక్రమం చేపట్టాలనుకున్నారు. అధికారంలోకి రాకముందు చంద్రబాబు, కూటమి నేతలు ఇచ్చిన హామీల్లో అమలు కాని వాటిని జనాలకు గుర్తుచేస్తూ గడప గడపకు వెళ్లాలని జగన్ ఆదేశించారు. అయితే, మెజారిటీ వైసీపీ నేతలు కనీసం తమ ఇంటి గడప దాటి రోడ్డెక్కలేదు. తొలి దశ కార్యక్రమాన్ని నాలుగు రోజులు నిర్వహించాల్సి ఉంది. అయితే, తొలి రెండు రోజులు ఎక్కడా పెద్దగా స్పందన కనిపించలేదు. జిల్లా పార్టీ అధ్యక్షుల స్థాయిలో మొదటి దశను నిర్వహించాలన్న జగన్ ఆదేశం ఆయన సొంత జిల్లా కడపలోనే అమలు కాకపోవడం గమనార్హం. దీంతో గురువారం నాటికి ఈ కార్యక్రమం కోసం సమాయత్తం కావాలని తాజాగా అధిష్ఠానం ఆదేశాలు జారీచేసింది. అంతకుముందు.. ఈ కార్యక్రమాన్ని ఈ నెల ఎనిమిదో తేదీ నుంచి (వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి) ప్రారంభించి, ఐదు దశల్లో నిర్వహించాలని అనుకున్నారు. కానీ, ఆ తర్వాత షెడ్యూల్‌లో మార్పు చేశారు.

'జగన్ సినిమా' పడలేదు..

కార్యక్రమం ప్రారంభంలో భారీగా స్ర్కీన్‌లు పెట్టి జగన్ ప్రసంగాన్ని 35 నిమిషాలపాటు చూపించాలని వైసీపీ అధిష్ఠానం ఆదేశించింది. అయితే, మెజారిటీ జిల్లాల్లోని వైసీపీ నేతలు 'జగన్ సినిమా'ను వేయలేదు. జనంలోనికి వెళ్లి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక కార్యక్రమాలపై నిలదీయాలంటూ జగన్ పిలుపునిచ్చారు. చంద్రబాబు విధానాలను ఎండగడుతూ ఇంటింటికి వెళ్లాలని ఆదేశించారు. కానీ, వైసీపీ నేతలు ఆ సాహసం చేయలేకపోతున్నారు. ఇదే సమయంలో .. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు సహా మంత్రులు, ఎమ్మెల్యేలు కూటమి అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేసిన హామీలను ప్రజలకు వివరిస్తున్నారు. కాగా, జగన్ కార్యక్రమం రెండో దశ ఈ నెల నాలుగో తేదీ నుంచి 12వ తేదీ దాకా నియోజకవర్గ స్థాయిలో జరగాలి. మూడో దశ ఈ నెల 13వ తేదీ నుంచి 20వ తేదీ దాకా మండలస్థాయిలో నిర్వహించాలి. నాలుగో దశ ఈ నెల 21 నుంచి ఆగస్టు నాలుగో తేదీ దాకా గ్రామ స్థాయిలో తలపెట్టారు.

కాలు నరికి.. ఊరంతా తిరిగి..

- కర్నూలు జిల్లాలో వృద్ధుడి దారుణ హత్య
- వివాహేతర సంబంధం అనుమానంతో నలుగురు అన్నదమ్ముల కిరాతకం

కర్నూలు క్రైం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో దారుణ హత్య జరిగింది. వివాహేతర సంబంధం నెపంతో ఓ వృద్ధుడిపై నలుగురు వ్యక్తులు అతి కిరాతకంగా దాడి చేశారు. ఆపై ఆ వృద్ధుడి ఓ కాలిని నరికి తీసుకెళ్లి గ్రామంలో హల్‌చల్ చేశారు. కర్నూలు రూరల్ మండలం సూదిరెడ్డిపల్లె గ్రామంలో మంగళవారం రాత్రి జరిగిన హత్య ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం గద్వాలకు చెందిన కురువ శేషన్న(63) ఇరవై ఏళ్ల క్రితం కుటుంబంతో సహా వచ్చి సూదిరెడ్డిపల్లెలో స్థిరపడ్డాడు. ఇదే గ్రామంలో అన్నదమ్ములైన కురువ పరుశురాముడు, కురువ గోవిందు, కురువ కుమార్, బీసన్న నివసిస్తున్నారు. వీరి కుటుంబంలోని ఓ మహిళతో శేషన్నకు వివాహేతర సంబంధం ఉందని వారి అనుమానం. ఈ క్రమంలో సోమవారం రాత్రి నలుగురు అన్నదమ్ములు కలిసి శేషన్న ఇంటికి వెళ్లి అతనిపై రాళ్లతో దాడి చేశారు. ఈ ఘటనలో శేషన్న భార్య వెంకటేశ్వరమ్మకు కూడా గాయాలయ్యాయి. వెంటనే వీరు కర్నూలు రూరల్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా.. ముందు ఆస్పత్రికి వెళ్లాలని పోలీసులు సలహా ఇచ్చారు. ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందిన బాధితులు మంగళవారం ఉదయం ఇంటికి వెళ్లిపోయారు. అయితే ఆ రాత్రి శేషన్నపై అన్నదమ్ములు నలుగురు మరోసారి దాడికి దిగారు. ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న శేషన్నపై విచక్షణా రహితంగా దాడి చేసి కుడి కాలిని కత్తితో నరికి వెంట తీసుకెళ్లారు. దీంతో తీవ్ర రక్తస్రావంతో శేషన్న మృతి చెందాడు. శేషన్న కాలు తీసుకెళ్లిన నిందితులు గ్రామంలో హల్‌చల్ చేశారు. ముగ్గురు ఆ కాలిని పట్టుకుని బైక్‌పై గ్రామం మొత్తం తిరుగుతుండగా.. మరో నిందితుడు దానిని వీడియో తీశాడు. తమ జోలికి వస్తే అందరికీ ఇదే గతి పడుతుందంటూ ఈసందర్భంగా హెచ్చరించారు. ఆ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ తర్వాత శేషన్న కాలిని పడేసిన నిందితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయారు. హత్య ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు ముందే స్పందించి ఉండే ఈ హత్య జరిగి ఉండేది కాదని శేషన్న కుటుంబసభ్యులు, స్థానికులు ఆరోపిస్తున్నారు.



శేషన్న కాలిని తీసుకెళ్తున్న నిందితులు

తిరుమలలో నృత్యప్రదర్శనల పేరుతో రూ.35 లక్షల వసూలు

- ఖాజీపేటవాసి అరెస్ట్

తిరుమల, జూలై 2 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో నృత్య ప్రదర్శనలు ఇప్పిస్తానని కళాకారుల నుంచి రూ.35 లక్షలు వసూలు చేసిన వ్యక్తిని తిరుమల పోలీసులు అరెస్ట్ చేశారు. తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లాలోని ఖాజీపేటకు చెందిన సూత్రపు అభిషేక్(28) తిరుమలలోని ఆస్థాన మండపంలో 'శ్రీనివాస కళార్చన' పేరుతో రెండు రోజుల నృత్య కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నానని ప్రకటించాడు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 93 కళాబృందాల్లోని 2,900 మంది కళాకారుల నుంచి రూ.35 లక్షలు వసూలు చేశాడు. కళాకారులందరికీ వసతి, భోజనం, శ్రీవారి దర్శనం, ప్రసాదం, మెమెంటోలు, శాలువా ఇప్పిస్తానని హామీ ఇచ్చాడు. కాగా, కొందరు కళాకారులు ఫిర్యాదు చేయడంతో ప్రదర్శనలకు ఇచ్చిన అనుమతిని టీటీడీ హిందూ ధార్మిక ప్రచార పరిషత్ రద్దు చేసింది. అయితే హైకోర్టు ఆదేశాలతో అభిషేక్ ప్రదర్శనలకు జూన్ 27, 28వ తేదీల్లో అనుమతిచ్చారు. పరిమితికి మించి తిరుమలకు చేరుకున్న కళాకారులు తమ ప్రదర్శనకు అవకాశం ఇవ్వలేదంటూ నిరసనకు దిగడంతో ఈ అంశం రచ్చకెక్కింది. దీనిపై విజిలెన్స్, తిరుమల వన్‌టౌన్ పోలీసుల విచారణలో అభిషేక్ అక్రమాలకు పాల్పడినట్టు నిర్ధారణ అయింది. ఈ క్రమంలో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి మంగళవారం అభిషేక్‌ను అరెస్ట్ చేసి, అతని నుంచి రూ.14 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం తిరుపతి కోర్టులో హాజరుపరచగా 15 రోజుల రిమాండ్‌కు ఆదేశించారు.



సూత్రపు అభిషేక్





విహార నౌక 'ఎంవీ ఎంప్రెస్'.. షిప్‌పై మంత్రి దుర్గేశ్, ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ అజయ్‌జైన్

విహార నౌకలతో పర్యాటకాభివృద్ధి

- 'ఎంవీ ఎంప్రెస్' ప్రారంభోత్సవంలో శర్బానంద సోనోవాల్
- విశాఖ నుంచి రెగ్యులర్‌గా విహార నౌకలు: మంత్రి దుర్గేశ్

విశాఖపట్నం, జూలై 2(ఆంధ్రజ్యోతి): విహార నౌకలతో పర్యాటక రంగం వేగంగా అభివృద్ధి చెందుతుందని, ఆర్థిక ప్రగతి సాధ్యమవుతుందని కేంద్ర జల రవాణా శాఖా మంత్రి శర్బానంద సోనోవాల్ అన్నారు. విశాఖపట్నం పోర్టులోని అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్‌కు వచ్చిన తొలి విహారనౌక ఎంవీ ఎంప్రెస్ (కార్డిలియా క్రూయిజ్ లైన్స్‌కు చెందినది)ను బుధవారం సాయంత్రం ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ క్రూయిజ్ టూరిజం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జల రవాణా శాఖ సహాయ మంత్రి శంతన్ ఠాకూర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా క్రూయిజ్ టూరిజం అభివృద్ధి చేస్తామన్నారు. విశాఖపట్నం నుంచి త్వరలో రెగ్యులర్‌గా విహార నౌకలు (క్రూయిజర్లు) నడిపేలా చర్యలు చేపడుతున్నామని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. విహార నౌకల ద్వారా అంతర్జాతీయ పర్యాటకులను విశాఖపట్నం తీసుకువస్తామన్నారు. రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాలను ఒక సర్క్యూట్ కిందికి తీసుకువస్తామన్నారు. 'హబ్ అండ్ స్పోక్స్' విధానంలో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలనేది సీఎం చంద్రబాబునాయుడు ఆలోచన అని వివరించారు. విహార నౌకల ద్వారా అనేక మందికి ఉపాధి లభిస్తుందని, రాష్ట్రానికి ఆదాయం కూడా సమకూరుతుందని దుర్గేశ్ తెలిపారు. పోర్టు చైర్మన్ అంగముత్తు మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు నాయుడు సూచన మేరకు తీరం వెంబడి ప్రతి 50 కిలోమీటర్లకు ఒక సముద్ర సంబంధిత కార్యకలాపం జరిగేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఏటా క్రూయిజ్ ఆధారిత నైపుణ్యాలపై ఐదు వేల మంది యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలకు సిద్ధం చేస్తామన్నారు. ప్రత్యేక క్రూయిజ్‌లను నడిపే ప్రణాళిక ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, విశాఖ దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, పర్యాటక శాఖ స్పెషల్ సీఎస్ అజయ్‌జైన్, కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ వేదికపై విశాఖ నుంచి విహార నౌకలో ప్రయాణించడానికి టికెట్లు కొనుగోలు చేసిన వారికి బోర్డింగ్ పాస్‌లు అందజేశారు. ఎంవీ ఎంప్రెస్ నౌక చెన్నైలో బయలుదేరి బుధవారం ఉదయం విశాఖపట్నం అంతర్జాతీయ టెర్మినల్‌కు చేరుకుంది. ఇక్కడి నుంచి పాండిచ్చేరి, అక్కడి నుంచి తిరిగి చెన్నైకు చేరుతుంది.

శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం

నూజివీడు టౌన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో గల శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ అడ్మిషన్ల ప్రక్రియ ఏలూరు జిల్లా నూజివీడు క్యాంపస్‌లో బుధవారం ప్రారంభమైంది. సోమ, మంగళ వారాల్లో నూజివీడు ఆర్కే వ్యాలీ అడ్మిషన్లు పూర్తి చేయగా, బుధవారం నుంచి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌కు సంబంధించి అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించారు. తొలి రోజు 516 మంది విద్యార్థులకు కాల్ లెటర్లు పంపగా 444 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యారు. హాజరైన వారిలో బాలురు 127 మంది, బాలికలు 310 మంది అడ్మిషన్లు పొందినట్లు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ బాలాజీ తెలిపారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఎవరు బాధ్యులు?

హైదరాబాద్‌కు కూతవేటుదూరంలో ఉన్న పాశమైలారంలోని సిగాచీ ఫార్మస్యూటికల్ పరిశ్రమలో సంభవించిన ప్రమాదం ఊహకు అందనిది. మృతుల సంఖ్య అతివేగంగా పెరగడం, గాయపడినవారు అధికంగా ఉండటం, ఆచూకీ తెలియనివారు అనేకులు మిగిలిపోవడం ఈ ప్రమాదం తీవ్రతకు నిదర్శనాలు. పేలుడు ధాటికి మూడంతస్థుల భవనం పేకమేడలా కూలిపోవడంతో శిథిలాల కింద కన్నుమూసినవారే అధికం. పేలుడు సంభవించిన సమయంలో ఎక్కువమంది కార్మికులు ఫ్యాక్టరీలో ఉన్నందున మరణాలు గణనీయంగా ఉన్నాయి. శరీరాలు ఛిద్రమై అక్కడికక్కడే మరణించినవారు, మంటల్లో కాలిపోయినవారితో మృతదేహాలు గుర్తుపట్టలేని విధంగా మారిపోయాయి. ఖాకీబట్టలేసుకొని, లంచ్ బాక్సుతో ఫ్యాక్టరీకి వెళ్ళిన కార్మికుడు డీఎన్ఏ పరీక్షతో తప్ప పోల్చలేని విధంగా క్షణాల్లో మాంసపు ముద్ద అయిపోవడం అత్యంత విషాదం.


ప్రమాదం జరిగినవెంటనే ఉలకని కంపెనీ యాజమాన్యం ఇప్పుడు స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు రాసిన లేఖలో, మీడియా ప్రచారం చేస్తున్నట్టుగా రియాక్టర్ పేలలేదని, మృతులు నలభైమందేనని అంటోంది. ప్రమాద కారణాలేమిటన్నది దర్యాప్తులో తేలుతుందని అంటున్న సిగాచీ యజమాన్యానికి తమ లోభత్వమో, పేరాశో ఈ ప్రమాదానికి కారణమని తెలియకపోదు. నాలుగుదశాబ్దాల నాటి ఫ్యాక్టరీలో మిషనరీని ఆధునికీకరించడం కానీ, కనీస ప్రమాణాలు పాటించడం కానీ జరగనప్పుడు పట్టెడన్నం కోసం వచ్చే కార్మికుడు ఇలా ప్రాణాలు వదిలేయవలసి వస్తుంది. ఈ ప్రమాదం ఎందుకు జరిగింది, అన్ని భద్రతాప్రమాణాలకు, నిబంధనలకు లోబడి ఈ ఫ్యాక్టరీ నడుస్తున్నదా అన్న విషయాలు నిర్ధారించడానికి నలుగురు నిపుణులతో తెలంగాణ రాష్ట్రప్రభుత్వం ఒక కమిటీని ఏర్పాటుచేసి, నెలరోజుల్లో నివేదిక ఇవ్వమన్నది. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో కూడా ఈ నిపుణుల కమిటీ ప్రభుత్వానికి చెబుతుందట. కమిటీలో ఉన్నవారంతా ప్రతిభగల శాస్త్రవేత్తలు, భద్రతానిపుణులు. రాబోయే కాలంలో ఈ కమిటీ నివేదిక ఆధారంగా సిగాచీని ప్రభుత్వం ఎంత గట్టిగా శిక్షించగలదో చూడాలి. అలాగే, ఆ నివేదిక ఆధారంగా పాలకులు తీసుకొనే చర్యల దెబ్బకు ఇకపై ఏ ఒక్క ఫ్యాక్టరీలోనూ ఏ ప్రమాదమూ జరగకూడదు మరి. చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం అన్న సామెత ఇటువంటి సందర్భాల్లో గుర్తుకు వస్తుంది కానీ, చేతులు కాలుతూనే ఉంటాయి, పసరు మందు మాత్రం పనిచేయదు.

పాత మిషనరీతో పనిచేస్తున్న ఈ ఫ్యాక్టరీ నిబంధనలను పాటించే అవకాశం సహజంగానే తక్కువ. సంబంధిత అధికారులు ఈ ఫ్యాక్టరీని ఎప్పుడు సందర్శించారు, ఏ లోపాలు గుర్తించారు, వారు ఆదేశాలను అమలు చేయనిపక్షంలో యాజమాన్యానికి ఏ శిక్షలు వేశారన్నది ప్రధానం. అధికారులు ఏమాత్రం బాధ్యతగా ఉన్నా ఈ ప్రమాదం జరిగివుండేదికాదు. యాజమాన్యం పాత మిషనరీని మార్చకపోగా, దాని నిర్వహణలో సైతం రాజీపడింది.

ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరిట పరిశ్రమలకు రాయితీలు, ప్రోత్సాహాలతో ఎర్రతివాచీ పరవటాన్ని ఎవరూ కాదనడం లేదు. కానీ, ఆ పరిశ్రమలు భద్రతాప్రమాణాలు పాటించకపోయినా పట్టించుకోని, ప్రశ్నించని వ్యవస్థ ఉండటమే ఆందోళన కలిగిస్తున్నది. పరిశ్రమల యజమానుల మాదిరిగానే ప్రభుత్వాలు కూడా అధికారుల పర్యవేక్షణను పెత్తనంగా చూడటంతో చట్టాలు బలహీనపడుతున్నాయి, నిబంధనలు సడలిపోతున్నాయి, నియంత్రణలు తొలగి, తనిఖీలు తగ్గుతున్నాయి. ఫ్యాక్టరీలోకి ఇనస్పెక్టర్ కాలూనకుండా, అంతసవ్యంగా ఉన్నదని యజమాని ఆన్‌లైన్‌లో ధృవీకరిస్తే చాలనే పాడుకాలం దాపురించింది. అత్యంత ప్రమాదకరమైన పరిశ్రమల్లో సైతం నైపుణ్యం లేని కార్మికులతో యజమానులు నెట్టుకు రాగలుగుతున్నారంటే ప్రభుత్వాల అలసత్వం, చేతగానితనమే కారణం. యాజమాన్యాలను కార్మికులు నిలదీసే కాలం గతించి, తమ ప్రాణాలకు కాస్తంత భద్రతనివ్వమని ప్రాధేయపడినా ఫలితం లేని రోజులు వచ్చాయి. ఎంతటి ఘోరప్రమాదం జరిగినా కాస్తంత పరిహారం విదిలిస్తే చాలనుకొనే దుస్థితికి దిగజారిపోయాం తప్ప, యాజమాన్యాలను న్యాయస్థానాలకు ఈడ్చి, జైళ్ళలోకి నెట్టే దృశ్యాలే లేకపోయాయి.

ఆత్మహత్యల్లో హంతకులెవరు?

ఆత్మహత్యలు చర్చనీయాంశంగా మారాయి అంటే, మన సమాజంలో ఆత్మహత్యల రేటు పెరిగిందని అర్థం. హతుడే హంతకుడైనప్పుడు దాన్ని ఆత్మహత్య అంటారు. హంతకుడు మరొకడైనప్పుడు దాన్ని హత్య అంటారు. మన కుటుంబ, దాంపత్య వ్యవస్థల్లో చెలరేగుతున్న సంక్షోభాలకు ఇవి సంకేతాలు. సమాజంలో ఏదైనా సరే, పాతది పోయి కొత్తది రాకతప్పదు. అయితే, మనం మరచిపోకూడని అంశం ఏమంటే– పాత దానితోపాటు పాత నిబంధనలు పోయినట్టే... కొత్త దానితోపాటు కొత్త నిబంధనలు వస్తాయి. వాటిని పాటించక తప్పదు. వివాహిత స్త్రీతో వివాహేతర సంబంధాన్ని కొనసాగించే పురుషుల్ని గతంలో నేరస్తులుగా భావించి శిక్షించేవారు. ఇప్పుడు వాటిని న్యాయస్థానాలు శిక్షార్హమైన నేరంగా పరిగణించడం లేదు; కేవలం సామాజిక తప్పిదంగా మాత్రమే భావిస్తున్నాయి. వివాహేతర సంబంధంలోకి ప్రవేశించిన– వివాహిత స్త్రీకి ఆమె భర్త, వివాహిత పురుషుడికి అతని భార్య విడాకులు ఇవ్వవచ్చు. అయితే విడాకులు ఇవ్వడం కూడా అంత సులువుకాదు. దానికి అనేక ఆర్థిక పరిమితులుంటాయి.



ఆత్మహత్యల్లో ఒక అమూర్త(కనిపించని) హంతకురాలు ఉంటుంది; అది సమాజం. కటువుగా అనిపించవచ్చుగానీ, అదే నిజం. సామాజిక అనుబంధాలు, నియమాల కారణంగానే ఆత్మహత్యలు జరుగుతాయని 19వ శతాబ్దపు సమాజ శాస్త్రవేత్త డేవిడ్ ఎమిల్ డ్యూర్ఖైమ్ (David Émile Durkheim) తెలిపాడు. ఆయన 1897లో 'లా సూసైడ్' పేరిట ఆత్మహత్యలపై ఒక విస్తార సిద్ధాంత గ్రంథాన్ని రాశాడు. ఆ సిద్ధాంతాన్నే సమాజ విశ్లేషకులు, పరిశోధకులు ఇప్పటికీ ప్రామాణికంగా భావిస్తుంటారు.

డ్యూర్ఖైమ్ సిద్ధాంతం ప్రకారం ఆత్మహత్యలు నాలుగు రకాలు. మనుషులతో అనుబంధాలు ఎక్కువైనవారు వారికోసం చనిపోవడానికి సిద్ధమవుతారు. ప్రజల్ని విపరీతంగా ప్రేమించే విప్లవకారులు ప్రజలకోసం ప్రాణ త్యాగానికి సిద్ధపడడాన్ని మనం ఇప్పటికీ చూడవచ్చు. ఇది బలిదానాల ఆత్మహత్య (Altruistic suicide). మనుషులను అతిగా ద్వేషించేవారు కూడా అనుబంధాలు పూర్తిగా లోపించి, ఒంటరివారైపోయి ఆత్మహత్యలు చేసుకుంటారు. ఇది అహంభావ ఆత్మహత్య (Egoistic Suicide). అధిక నియంత్రణ, నిర్బంధాలను తట్టుకోలేక కొందరు ఆత్మహత్యలకు పాల్పడతారు. ఇది బలవన్మరణం (Fatalistic Suicide). నియమ నిబంధనల్ని బంధనాలుగా భావించేవారు కూడా ఆత్మహత్యలు చేసుకుంటారు. ఇది నిబంధనోల్లంఘన ఆత్మహత్య (Anomic Suicide). నిబంధనల్ని ఉల్లంఘిస్తున్నప్పుడు మనకు అభ్యుదయకరంగా, విప్లవకరంగా అనిపిస్తుంటుంది. ఉల్లంఘించలేకపోతే.. ఓ సాలెగూడు బంధించేస్తున్నట్టు అనిపిస్తుంటుంది. పాత నిబంధనల్ని ఉల్లంఘించినప్పటికీ కొత్త నిబంధనల్ని రూపొందించుకుని పాటించేవారు బహు అరుదుగా ఉంటారు. వాళ్లు మార్గదర్శకులు అవుతారు.

'ప్రేమ భావోద్వేగ అంశం' అన్నంతవరకు పేచీ లేదుగానీ, వివాహాన్ని భావోద్వేగానికి పరిమితం చేయడం కుదరదు. వివాహం ఒక వ్యవస్థ. వివాహ బంధంలోకి ప్రవేశించాలన్నా, అందులో నుంచి బయటికి రావాలన్నా కొన్ని నియమాలను పాటించాల్సి ఉంటుంది.

ఆత్మహత్యల రేటు కొన్ని దేశాల్లో ఎక్కువగానూ, కొన్ని దేశాల్లో తక్కువగానూ ఉంటుంది. దానికి కారణం ఆయా సమాజాల్లోని సంఘీభావ స్థాయిల్లో వ్యక్తమయ్యే హెచ్చుతగ్గులే. మనం కల్లోల దేశాలుగా భావించే ఆఫ్ఘనిస్థాన్, ఇరాక్‌లలో ఆత్మహత్యల రేటు చాలా తక్కువ. అభివృద్ధి చెందుతున్న, చెందిన దేశాల్లో ఆత్మహత్యల రేటు చాలా ఎక్కువ. సంఖ్యాపరంగా చూస్తే అత్యధిక ఆత్మహత్యలు మనదేశంలోనే జరుగుతున్నాయి. చారిత్రక దశలను బట్టి ఆత్మహత్యల రేటు మారుతూ ఉంటుంది. ఉద్యమాలు, విప్లవ పోరాటాలు, పొరుగుదేశాలతో యుద్ధాలు కొనసాగుతున్న కాలంలో మనుషుల మధ్య అనుబంధాలు, సంఘీభావం చాలా ఉన్నతస్థాయిల్లో ఉంటాయి. ఆ ఉద్యమాలు, యుద్ధాలు, పోరాటాలు ముగిశాక ఫలాల కోసం పోటీ పెరిగి సంఘీభావం అంతరించిపోతుంది. సామాజిక నైతికతను, న్యాయ నియమాలనూ ఉల్లంఘించే ఒక అరాచక సంస్కృతి విజృంభిస్తుంది. అలాంటి దశల్లోనే ఆత్మహత్యల రేటు పెరుగుతుంది. ప్రేమైక సంఘీభావ సమాజాల్లో (Altruistic Society) ఆత్మహత్యల రేటు తక్కువగా ఉంటుందని, విద్వేష సమాజాల్లో ఆత్మహత్యల రేటు ఎక్కువగా ఉంటుందని పదేళ్లక్రితం సోషల్ మీడియాలో నేనొక పోస్టు పెట్టాను. ఉత్తరాంధ్రకు చెందిన ఓ మహిళా లెక్చరర్ నా వాదనను గట్టిగా వ్యతిరేకించారు. ఆందోళన, ఒత్తిడి, కుంగుబాటు తదితర మానసిక దౌర్బల్యాల కారణంగానే ప్రజలు ఆత్మహత్యలు చేసుకుంటారని ఆమె వాదించారు. కొన్ని రోజుల పాటు మా మధ్య వాదన కొనసాగింది. నేను సమాజశాస్త్ర విద్యార్థిని, ఆమె మనస్తత్వశాస్త్ర ఉపన్యాసకురాలు. మా మధ్య ఎక్కడా రాజీ కుదరలేదు. విషాదకర విషయం ఏమిటంటే... సదరు అధ్యాపకురాలు ఓ మూడు నాలుగేళ్ల తర్వాత ఆత్మహత్య చేసుకున్నారు. ఆమెకు పెళ్లయింది; భర్త ఉన్నాడు. విడాకులు తీసుకోకుండా మరో వ్యక్తితో సహజీవనం ఆరంభించారట. అతనూ వివాహితుడు, భార్యా, పిల్లలు ఉన్నారు. అతను కూడా విడాకులు తీసుకోలేదు. కనీసం భార్య నుంచి నిరభ్యంతర పత్రం (NOC) కూడా తీసుకోలేదు.

విడాకులు తీసుకోని వివాహిత స్త్రీ పురుషులు సహజీవనాన్ని కొనసాగించడం సామాజిక తప్పిదం. వాళ్ల శాసనోల్లంఘనం అక్కడితో ఆగలేదు. ప్రభుత్వ పత్రాలు వేటిల్లోనూ తాము సహజీవనం చేస్తున్నట్టు నమోదు చేసుకోలేదు. పెన్షన్ పత్రాల్లో నామినీగా చేర్చుకోలేదు. సదరు సహజీవన పురుషుని సమీప బంధువు పేరిట ఉన్న స్థలంలో ఈమె ఒక ఇల్లు కట్టారు. ఇంటి డాక్యుమెంట్స్‌ను తన పేరిట మార్పించుకోలేదు. భావోద్వేగాల ప్రేమ ఉన్నప్పుడు ఇవన్నీ అక్కరలేదు అనుకుని ఉండవచ్చు. కొన్నాళ్లకు ఆ సహజీవన పురుషుడు చనిపోయాడు. శవాన్ని అతని భార్యా పిల్లలు తీసుకునిపోయారు. శవాన్ని స్వాధీనం చేసుకోవడం అంటే.. ఆస్తిని స్వాధీనం చేసుకున్నట్టే (మళ్ళీ మార్క్స్ గుర్తుకు వస్తున్నాడు). మరికొన్నాళ్లకు ఆ స్థల యజమాని వచ్చి ఇంటిని స్వాధీనం చేసుకున్నాడు. ఆ లేడీ లెక్చరర్ అన్నింటినీ కోల్పోయారు. విషాదం ఏమంటే ఆమె క్లెయిమ్ చేసుకోవడానికి కూడా ఏ ఒక్కటీ మిగలలేదు. నిబంధనోల్లంఘనల ఫలితం ఆమె ఆత్మహత్య.

సామాజిక అంశాలను మాత్రమే పట్టించుకుని వ్యక్తిత్వ, మనస్తత్వ అంశాలను నిర్లక్ష్యం చేశాడని డ్యూర్ఖైమ్ మీద ఒక విమర్శ ఉంది. తరచి చూస్తే.. ఒత్తిడి, ఆందోళన, కుంగుబాటు, నైతికత మొదలైన వ్యక్తిత్వ, మనస్తత్వ అంశాలు కూడా ఆధునిక సమాజ ఉత్పత్తులే. భర్త వివాహేతర సంబంధాన్ని కొనసాగిస్తున్నాడని తెలిసిన ఏ భార్య అయినా ముందుగా భావోద్వేగంతో తీవ్ర అభ్యంతరం చెప్తుంది. ఆ వెనుక ఆమెకు తన భయానికి అసలు కారణం తెలుస్తుంది. తనదీ, తన పిల్లలది అనుకుంటున్న ఆస్తికి మరొకరు వాటాదారులుగా వస్తుంటే తాము నిరాశ్రయులమైపోతామనేది ఏ భార్యకయినా సమంజసమైన ఆందోళనే. భావోద్వేగాలకు మాత్రమే పరిమితమయ్యేవారు అక్కడే ఆగిపోతారు. కొంచెం లౌక్యం తెలిసినవారు దానికో ఆర్థిక పరిష్కారాన్ని వెతుకుతారు.

వివాహేతర సంబంధాల్లో పురుషులకు ఉన్నంత అనుకూలత స్త్రీలకు లేదు. అయితే, స్త్రీలు కొంచెం తెలివిని ఉపయోగించి పరిస్థితిని తమకు అనుకూలంగా కాకపోయినా, ఇబ్బంది లేకుండా చేసుకోవచ్చు. 'కొత్తగా వచ్చే ఆమెకు భర్త ఆస్తిలో వాటా ఇవ్వరాదు, కొత్తామెతో పిల్లల్ని కనరాదు' వంటి కొన్ని షరతులు పెట్టి రెండు కుటుంబాలు అన్యోన్యంగానే కొనసాగిన సెలబ్రిటీల ఉదాహరణలు మన ముందు కొన్ని ఉన్నాయి. ఒక వివాహిత పురుషునితో సహజీవనం చేయాలనుకున్న స్త్రీ ముందుగా మొదటి భార్య నుంచి అతను విడాకులో, కనీసం నిరభ్యంతర పత్రమో పొందేలా జాగ్రత్తపడాలి. ఈ సంప్రదాయం కూడా ఇప్పుడు మన సమాజంలో ఉంది. విడాకులో, నిరభ్యంతర పత్రమో పొందడం వేరు; పొందుతామనే నమ్మకంతో ముందుగానే సహజీవనం మొదలుపెట్టేయడం వేరు. ఇలాంటి తప్పులు ఒక్కోసారి మరణానికి కూడా దారితీయవచ్చు.

ఆర్థిక నియమాల ఆధారంగా ఇప్పుడు సమాజంలో సంక్లిష్ట కుటుంబాలు, మిశ్రమ కుటుంబాలు, సవతి కుటుంబాల (complex family, blended family and step family) పేరిట కొత్త దాంపత్య బంధాలు ఏర్పడుతున్నాయి. ఈ ధోరణి పెరుగుతోంది కూడా. ఇప్పటికీ చాలామంది దాంపత్యానికి ఉన్న ఆర్థిక పునాదిని గుర్తించక, నివారించదగ్గ ఇబ్బందుల్ని కూడా విస్మరించి కొత్త చిక్కులు కొని తెచ్చుకుంటున్నారు. 'ప్రేమ భావోద్వేగ అంశం' అన్నంత వరకు పేచీ లేదుగానీ, వివాహాన్ని భావోద్వేగానికి పరిమితం చేయడం కుదరదు. వివాహం ఒక వ్యవస్థ. వివాహ బంధంలోకి ప్రవేశించాలన్నా, అందులో నుంచి బయటికి రావాలన్నా కొన్ని నియమాలను పాటించాల్సి ఉంటుంది.




■ డానీ
సమాజ విశ్లేషకుడు

భారత్ పాక్‌లను ఒకే గాటన కడతారా!?

'ఉగ్రవాదం ఒక మతాన్ని మించినది' అంటూ జూన్ 17న సిహెచ్.ఎస్.ఎన్.మూర్తి రాసిన వ్యాసం అసంబద్ధంగా ఉంది. ఆయన హిందూ వ్యతిరేకత, ముస్లిం సంతుష్టీకరణ ఈ వ్యాసంలో స్పష్టంగా కనపడింది. భారత్ ఉగ్రవాద పీడిత దేశం కాదని, ఇది ఒక తప్పుడు ప్రచారం అని, ఉగ్రవాద నిర్మూలన పేరుతో ఈ దేశంలో ప్రభుత్వాలు ముస్లింలను టార్గెట్ చేసి, చంపి వేస్తున్నాయని వ్యాసంలో చెప్పడం సంభ్రమాశ్చర్యాలకు గురిచేసింది.

బెలూచిస్థాన్ ప్రాంతంలోని ముస్లిం ఉగ్రవాదుల వల్ల పాకిస్థాన్ ప్రభుత్వం చాలా ఇబ్బందుల్ని ఎదుర్కొంటుందని, అందువల్లనే భారతదేశం కంటే పాకిస్థాన్‌లో ఎక్కువమంది ముస్లింలు చనిపోతున్నారని రచయిత వాపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. కశ్మీర్ వేర్పాటువాదులకు వంతపాడి, బెలూచిస్థాన్ వేర్పాటువాదులను దెప్పిపొడవడం ఎందుకు? కశ్మీర్ 370 ఆర్టికల్‌ను అడ్డుపెట్టుకొని కశ్మీర్ వేర్పాటువాదులు జరిపిన నరమేధాన్ని ప్రజా పోరాటం అంటారా? ఈ వేర్పాటువాదుల దుశ్చర్యల వల్ల మూడు లక్షల మంది హిందువులు సర్వస్వాన్ని వదులుకొని, లోయ నుంచి పారిపోయి వచ్చారు. మైనారిటీలకు భయపడి మెజారిటీ మతస్థులు పారిపోయి రావడం ఈ భూమండలంపై ఎక్కడా జరగదు.



పాకిస్థాన్, భారతదేశాల్లోని పాలకులు ఉగ్రవాదాన్ని మతాన్ని మేళవించి పాలన చేస్తున్నారని చెప్పడం అత్యంత వివాదాస్పదం. భారత్ పార్లమెంటరీ ప్రజాస్వామ్య పంథాను ఎన్నుకున్నది. పాకిస్థాన్‌లో మతవాదులు, సైన్యం కలిసి ప్రజలను పీక్కు తింటున్నారు. ఇస్లామిక్ తీవ్రవాదానికి ఆ దేశం అడ్డాగా ఉంది. ఈ దేశం నాది అని భావించే వారెవరూ భారత్‌ను పాకిస్థాన్‌ను ఒకే గాటన కట్టి ఇలాంటి విశ్లేషణలు చేయరు.

భారతదేశంలో 562 సంస్థానాలు విలీనమైనట్లే కశ్మీరు సంస్థానం కూడా విలీనమైంది. ఆనాటి కశ్మీర్ సంస్థానం రాజు రాజా హరిసింగ్‌ను ఒప్పందానికి ఒప్పించిన ఆరెస్సెస్ రెండవ అధ్యక్షులు గురూజీ ఇదే విషయాన్ని స్పష్టీకరించారు. ఒక ప్రాంతంలో ముస్లింలు ఎక్కువగా ఉన్నంత మాత్రాన ప్రత్యేక హక్కులు ఇవ్వబడతాయా? మరి హిందువులు మెజారిటీగా ఉన్న ప్రాంతాల్లో ఇలాంటి వాదనలు తలెత్తవా? కశ్మీర్ వేర్పాటు ఉద్యమాన్ని సమర్థించే వాళ్ళందరూ కూడా ఈ దేశానికి వ్యతిరేకులే. కశ్మీరీల స్వయం నిర్ణయాధికారం కోసం నడిపిన ఉద్యమంలో కశ్మీరీ పండిట్లు పాల్గొన్నారని చెప్పడం పచ్చి అబద్ధం!

ఇక దేశ విభజన మతం ఆధారంగా ఎందుకు జరిగింది? విభజనను కోరింది ఎవరు? ఇందుకు పునాది ఏమిటి? ఈ విషయంలో హిందువుల పాత్ర ఎంత? ఇత్యాది విషయాలను కూలంకషంగా చర్చిస్తే వాస్తవాలు బోధపడతాయి. కాంగ్రెస్ ఆధ్వర్యంలో నడిచే స్వాతంత్ర్య ఉద్యమాన్ని అడ్డుకోవడానికి 1906లో బ్రిటిష్ నాయకుల సలహా మేరకు ముస్లిం లీగ్ సంస్థ ఏర్పాటు చేయబడిందనే విషయం అర్థమైతే వాస్తవ విషయాలు స్ఫురణకు వస్తాయి. ఇస్లాం సమాజంలో సంస్కరణలు కావాలని కోరిన సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ ఈ దేశంలో ద్విజాతి సిద్ధాంతాన్ని ముస్లిం సమాజం ముందు ఉంచిన విషయంపై వ్యాసకర్తకు అవగాహన లేదనిపిస్తుంది. 1946లో రాజ్యాంగ సభకు జరిగిన ఎన్నికలలో 80 సీట్లకు పోటీ చేసిన ముస్లిం లీగ్ ముస్లింలు మెజారిటీగా ఉండే ప్రాంతాల్లో 73 సీట్లు గెలిచింది. అఖండ భారత్ నిర్మాణమే లక్ష్యంగా జాతీయ కాంగ్రెస్ 1585 సీట్లకు పోటీ చేస్తే కేవలం 925 సీట్లు మాత్రమే గెలిచింది. హిందువులు ముస్లింలు కలిసి ఉండాలనే భావనకు మద్దతు లభించలేదనే విషయం స్పష్టమైంది. మతం ఆధారంగా దేశ విభజన జరగాలని ఈ దేశంలో ముస్లిమందరూ కోరుకున్నారు. అందుకు అనుకూలంగా ఓటు వేశారు. ఈ ఎన్నికల విజయంతో చెలరేగిపోయిన ముస్లిం లీగ్ నాయకులు 1946 ఆగస్టులో డైరెక్ట్ యాక్షన్‌కు పిలుపునిచ్చి, హిందువులపై నరమేధానికి కారణమయ్యారు. ఈ నరమేధాన్ని కళ్ళారా చూసిన కాంగ్రెస్ నాయకులు భయపడి దేశ విభజనకు ఒప్పుకున్నారనేది వాస్తవం. ఈ చారిత్రక సత్యాన్ని దేశ ప్రజలకు తెలియనీయకుండా లౌకికవాద ముసుగు వేసుకున్న హిందూ వ్యతిరేక హిందువులు, స్వయం ప్రకటిత మేధావులు తమకు తోచిన రీతిలో ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు.

అమెరికా, రష్యా మధ్య ఏర్పడిన ప్రచ్ఛన్న యుద్ధ పరిస్థితులు బంగ్లాదేశ్ ఏర్పాటుకు, భారత్ పాకిస్థాన్ యుద్ధానికి కారణమని వ్యాస రచయిత చెప్పడం చారిత్రక అవగాహన లేకపోవడమే! 1970లో షేక్ ముజిబుర్ రహ్మాన్ ఆధ్వర్యంలో నేషనల్ అవామీ లీగ్ పార్టీ బంగ్లాదేశ్ ఎన్నికల్లో విజయం సాధించడంతో ఉర్దూ మాట్లాడే పశ్చిమ పాకిస్థాన్ నాయకులకు ఒళ్ళు మండింది. సైన్యాన్ని ఉసిగొలిపి, బెంగాలీ ముస్లింలను ఊచకోత కోయించారు. అనేక లక్షలమంది హిందువులు, ముస్లింలు భారతదేశంలోకి పారిపోయి వచ్చారు. ఈ భయంకర పరిస్థితుల్లో తూర్పు పాకిస్థాన్‌లోని ప్రజల రక్షణార్థం భారత సైన్యం జోక్యం చేసుకోవలసి వచ్చింది. దీన్ని విస్తరణవాదం అని ఎలా సూత్రీకరిస్తారు.

పాకిస్థాన్, భారతదేశాల్లోని పాలకులు ఉగ్రవాదాన్ని మతాన్ని మేళవించి పాలన చేస్తున్నారని చెప్పడం అత్యంత వివాదాస్పదం. భారత్ పార్లమెంటరీ ప్రజాస్వామ్య పంథాను ఎన్నుకున్నది. ఇక్కడ రాజ్యాంగబద్ధంగా ప్రభుత్వాలు ఎన్నుకోబడుతున్నాయి. ప్రజాస్వామ్యయుతంగా పాలన సాగుతుంది. ఇక పాకిస్థాన్‌లో మతవాదులు, సైన్యం కలిసి ప్రజలను పీక్కు తింటున్నారు. ఎన్నుకున్న ప్రభుత్వాలు ఎంత కాలం పరిపాలనలో ఉంటాయో తెలియదు. ఇస్లామిక్ తీవ్రవాదానికి ఆ దేశం అడ్డాగా ఉంది.

నాగాలాండ్, అస్సాం, మణిపూర్, పంజాబ్, తమిళనాడు రాష్ట్రాలలో తీవ్రవాద కార్యక్రమాలకు హిందువులు కారణమని చెప్పడంలో రచయిత హిందూ వ్యతిరేకత పరాకాష్ఠకు చేరింది. నాగాలాండ్, అస్సాం మణిపూర్‌లలో తీవ్రవాదం పెరగడానికి దేశ వ్యతిరేక అంతర్జాతీయ శక్తులు కారణం. తమిళ ప్రత్యేక రాజ్యం కోసం ఎల్‌టీటీఈ, సిక్కుల ప్రత్యేక రాజ్యం కోసం ఖలిస్థాన్ ఉగ్రవాదుల చర్యలకు ఈ దేశ ప్రజలు మద్దతు ఇవ్వలేదన్న విషయం వాస్తవమే కదా? వాస్తవంగా తీవ్రవాదం ఏ రూపంలో ఉన్నా హిందూ సమాజం అంగీకరించదు. హిందూమత పెద్దలు, మతాచార్యులు, పీఠాధిపతులు, స్వామీజీలు ఆధ్యాత్మిక విషయాలు మాత్రమే బోధిస్తారు. మత విషయాలు ఎన్నటికీ బోధించరు. ఈ కారణం వల్లనే హిందువులు మెజారిటీగా ఉండే భారతదేశంలో అన్ని మతాలవాళ్ళు శాంతియుత సహజీవనం చేస్తున్నారు. ఈ దేశం నాది, ఈ దేశానికి నేను వారసుడ్ని, ఈ దేశానికి గొప్ప సాంస్కృతిక, చారిత్రిక, ఆధ్యాత్మిక నేపథ్యం ఉంది అని భావించే వారెవరూ భారత్‌ను పాకిస్థాన్‌ను ఒకే గాటన కట్టి ఇలాంటి విశ్లేషణలు చేయరు.

○ ఉల్లి బాలరంగయ్య
సామాజిక, రాజకీయ విశ్లేషకులు

వృద్ధులందరికీ ఒకే పింఛన్ అవసరం

మలి వయసులో జీవితం సాఫీగా గడవాలంటే పింఛన్ చాలా ముఖ్యం. మన దేశ పింఛన్ ఆస్తులు చాలా స్వల్పంగా ఉన్నాయని 2025–26 ఆర్థిక సర్వే పేర్కొంది. అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల్లో ఆయా దేశాల జీడీపీల్లో 80 శాతంగా పింఛన్ ఆస్తులు ఉన్నాయి. కానీ మన దేశ జీడీపీలో 17 శాతం మాత్రమే ఉన్నాయని తాజా ఆర్థిక సర్వే తెలిపింది. నేడు 12 శాతం ఉద్యోగులకు మాత్రమే ఫార్మల్ పింఛన్ కవరేజీ ఉంది, అది కూడా అసమతుల్యంగా. ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేట్ సంఘటిత రంగ ఉద్యోగులకు పలు రకాల పింఛన్ స్కీంలు అందుబాటులో ఉన్నాయి. అసంఘటిత రంగానికి వస్తే జాతీయ పింఛన్ విధానం, అటల్ పెన్షన్ యోజనలు మాత్రమే ఉన్నాయి. వీటిలో కూడా స్వచ్ఛందంగా చేరే వారికే పింఛన్ లభిస్తుంది. ఈ రెండు స్కీంల ద్వారా దేశ జనాభాలోని కేవలం 5.3 శాతం మందే లబ్ధి పొందుతున్నారు.

అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థల్లో పింఛన్ సార్వత్రికంగా అమలవుతున్నది. జపాన్‌లో 20–59 మధ్య వయసు పౌరులందరూ పింఛన్ కోసం ఫ్లాట్ రేట్ కంట్రిబ్యూషన్ స్కీములో తప్పనిసరిగా చేరాలి. ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు, వారిపై ఆధారపడ్డవారికి ఒకటే స్కీం అమలు పరుస్తున్నారు. న్యూజిలాండ్‌లో కూడా పింఛన్ సార్వత్రికం. స్వీడన్, నార్వే, నెదర్లాండ్ దేశాలు సార్వత్రిక పెన్షన్ అమలు చేస్తున్నాయి. ఇండియాలో అసంఘటిత ప్రజల కోసం అమలులో ఉన్న పెన్షన్ స్కీంలు పూర్తిగా స్వచ్ఛందం. అర్హులందరికీ పింఛన్ అందకపోవడానికి ఇదొక అవరోధం. జనసామాన్యంలో పింఛన్ పట్ల సరైన అవగాహన లేదు. ప్రభుత్వం, మీడియా, స్వచ్ఛంద సంస్థలు, సెలబ్రిటీలు, విద్యాధికులు... ప్రజలకు పింఛన్ ప్రయోజనాలపై అవగాహన కల్పించాలి. పింఛన్‌దారులకు సులువుగా డబ్బులు పొందే వీలు కల్పించటం, పింఛన్ వ్యవహారాలు చూసే సంస్థ ఆర్థిక ఆరోగ్యం కాపాడటం చాలా ముఖ్యం. పింఛన్ సంస్థ ఈ రెండు పనులు సమర్థవంతంగా నిర్వహిస్తే, ఆ సంస్థపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుంది. మెర్కర్ గ్లోబల్ పెన్షన్ ఇండెక్స్ ప్రపంచ దేశాల పింఛన్ తీరుతెన్నులు గమనిస్తుంది. ర్యాంకింగ్ ఇస్తుంది. పెన్షన్ ఇండెక్స్ 2024లో 48 దేశాలలో పింఛన్ అమలుపై అధ్యయనం చేసింది. ఇందులో భారత్‌కు 44వ స్థానం దక్కింది. చైనాది 31వ స్థానం. అయినా పబ్లిక్ పెన్షన్ విధానంలో సవాళ్లు ఎదుర్కొంటోంది. ప్రైవేట్ నిధుల సాయం తీసుకోకుంటే పబ్లిక్ పింఛన్ సేవలు కుంటుపడవచ్చు అంటోంది. కనుక బలమైన మార్కెట్ అభివృద్ధికి ప్రైవేట్ నిధుల మద్దతు అవసరం. నెదర్లాండ్స్, డెన్మార్క్, ఆస్ట్రేలియాలు ప్రజా పెన్షన్ సక్రమ నిర్వహణకు ప్రైవేట్ నిధులు స్వీకరిస్తున్నాయి. నమ్మకమైన రాబడి కోసం అమెరికా పెన్షన్ నిధులను ఎంపిక చేసిన ఋణ నిధులలో పెట్టుబడులు పెడుతోంది.

దేశంలో పలురకాల పెన్షన్ స్కీములు ఉన్నాయి. స్థూలంగా వీటిని ప్రభుత్వ స్కీములు, ప్రైవేటువి, వార్షిక ప్లానులుగా వర్గీకరించవచ్చు. వీటిలోనే జాతీయ పింఛన్ పథకం, ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్, ప్రభుత్వ ప్రావిడెంట్, మరెన్నో ఉన్నాయి. ముక్కలు ముక్కలుగా వున్న పెన్షన్ స్కీములను సమన్వయపరచి, ఆదర్శవంతమైన మూడు అంచెల పెన్షన్ స్కీంగా రూపొందించాలని ఆర్థికవేత్తలు సూచిస్తున్నారు. పని, హోదాలతో నిమిత్తం లేకుండా అర్హులందరికీ ఒకే ఫ్లాట్ రేట్ కాంట్రిబ్యూషన్ తప్పనిసరి చేసి, కనీస పింఛన్ గ్యారంటీ చేయాలి. ఉద్యోగుల కోసం కంపెనీ చెల్లించే ఆక్యుపేషనల్ పెన్షన్‌ను క్రమబద్ధీకరించాలి. పరిశ్రమలు, వ్యాపార సంస్థలు కనీస చందా నియమానికి కట్టుబడి ఈ స్కీముని నిర్వహించాలి. స్వచ్ఛంద పెన్షన్ సేవింగ్స్ ప్రోత్సహించాలి. రిటైర్మెంట్ కాలానికి మంచి రిటర్న్ రావాలంటే ఈ రకమైన పొదుపులకు పన్ను రాయితీ ఇవ్వాలి. స్త్రీ, పురుష, పని భేదం లేకుండా వృద్ధులందరికీ పింఛన్ అందితే వారి జీవిత చివరి మజిలీకి కనీస ఆర్థిక భద్రత లభిస్తుంది.

– వి. వరదరాజు

నిరంతర కార్యాచరణతోనే రైతు సంక్షేమం

మన దేశంలో 'కరోనా' కారణంగా నాలుగేళ్ల క్రితం దాదాపు అన్ని కీలక రంగాల్లోనూ ఉత్పత్తి నిలిచిపోయిన సమయంలో 140 కోట్ల దేశ ప్రజల ఆకలిని తీర్చింది వ్యవసాయ రంగమే. దేశానికి స్వాతంత్ర్యం లభించిన కాలంలో 25కోట్ల దేశ జనాభాకు రెండు పూటలా తినగలిగే ఆహార ధాన్యాలు పండించే పరిస్థితి లేదు. 'పిఎల్–480' అగ్రిమెంట్ ద్వారా ఇతర దేశాల నుంచి ఆహార ధాన్యాలను దిగుమతి చేసుకునేవాళ్లం. దానిని 'షిప్ టు మౌత్' ఎకానమీ అనేవారు. అంటే, విదేశాల నుంచి ఓడల్లో ఆహార ధాన్యాలు వస్తేనే ప్రజలకు తిండి లభించేది. అటువంటి దుర్భర పరిస్థితులను అధిగమించడానికి ప్రభుత్వాలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు కృషి చేశారు. ఫలితంగా, తొలుత హరితవిప్లవం, ఆ తర్వాత క్షీర విప్లవం చోటుచేసుకున్నాయి. నేడు పుష్కలంగా ప్రజానీకానికి తిండిగింజలు అందుబాటులోకి రావడమేకాక ఎగుమతులు చేసే అవకాశం ఏర్పడింది. అయితే, ఇదంతా నాణేనికి ఒకవైపు మాత్రమే. ఆహార ధాన్యాలు పుష్కలంగా ఉత్పత్తి అవుతున్నప్పటికీ రైతుల పరిస్థితి మాత్రం నానాటికీ తీసికట్టుగానే ఉంటున్నది.

సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ డెవలపింగ్ సొసైటీ (సీఎస్‌డీసీ) నివేదిక ప్రకారం వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడంతో 76 శాతం మంది రైతులు వ్యవసాయాన్ని మానుకొని ఇతర ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాల్లోకి మళ్లాలని భావిస్తున్నారు. ఇందుకు పలు కారణాలు ఉన్నాయి. అందులో ముఖ్యంగా వ్యవసాయం ద్వారా ఆదాయం లభించకపోగా అప్పు మిగలడం; ఇంకా వ్యవసాయంలోనే కొనసాగితే తమ భవిష్యత్తు మరింత దుర్భరంగా మారుతుందేమోనన్న భయాందోళనలు; తరచుగా కరువు, వరదలు, చీడపీడల రూపంలో కలుగుతున్న అపార నష్టాలు; ప్రభుత్వాల నుంచి పంట నష్టపరిహారం అందించడంలో గానీ, కనీస మద్దతు ధరలు కల్పించడంలో గానీ ఆశించిన మేర సహాయ సహకారాలు లేకపోవడం; అప్పులు, ఇతరత్రా సమస్యల వల్ల కుటుంబంలో పెరుగుతున్న ఆర్థిక ఒత్తిడులు, అశాంతి. వీటితోపాటు వ్యవసాయానికి అవసరమైన పెట్టుబడులు సకాలంలో దొరక్కపోవటం; నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుబాటులో లేకపోవడం; అష్టకష్టాలు పడి పంట పండిస్తే వాటికి కనీస మద్దతు ధర లభించకపోవడం; మార్కెట్‌లో దళారుల బెడద; సరైన ధర వచ్చేవరకు పంట ఉత్పత్తిని భద్రపర్చుకొనే గిడ్డంగుల సదుపాయం లేకపోవడం... ఇంకా అనేక సమస్యలు, సవాలక్ష కారణాలు దశాబ్దాల తరబడి భారత రైతాంగాన్ని వేధిస్తున్నాయి.

ఆర్థిక సర్వే ప్రకారం గత ఐదేళ్లుగా దేశ వ్యవసాయాభివృద్ధి సగటు రేటు 3.5శాతం. ఆహార ధాన్యాల ఉత్పత్తి కూడా గణనీయంగా పెరిగింది. కానీ, రైతులకు ఒరిగింది శూన్యం. సీఎస్‌డీసీ నివేదిక ప్రకారం వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడంతో 76శాతం మంది రైతులు వ్యవసాయాన్ని మానుకొని ఇతర ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాల్లోకి మళ్లాలని భావిస్తున్నారు.



2022 నాటికి రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని 2016లో ఎన్డీఏ ప్రభుత్వం హామీ ఇచ్చింది. కానీ ఇప్పటివరకూ ఆచరణలో ఆ హామీ పూర్తిగా నెరవేరలేదు. డా. స్వామినాథన్ కమిషన్ సిఫారసు మేరకు పంట వ్యయానికి 50శాతం కలిపి కనీస మద్దతు ధర అందిస్తామన్న హామీ నేటికీ ఆచరణలోకి రాలేదు. పైగా, ఆ ఫార్ములాను అమలు చేస్తే వినియోగదారుడిపై భారం పడుతుందని సర్వోన్నత న్యాయస్థానంలో అఫిడవిట్ దాఖలు చేసి తప్పించుకున్నారు. కాగా, ఇటీవలి కాలంలో రైతులకు నష్టాలు పెరిగాయి. వాతావరణ మార్పుల వల్ల వ్యవసాయ ఆదాయాలు 15 నుంచి 20 శాతం వరకు పడిపోయినట్లు 2023–24 ఆర్థిక సర్వే స్పష్టం చేసింది. ఫలితంగా, 2020లో ప్రతి మూడు రైతు కుటుంబాల్లో ఒకటి అప్పుల ఊబిలో కూరుకుపోగా, ప్రతి రుణగ్రస్థ రైతు కుటుంబం తలసరిన రూ.1.03 లక్షల అప్పు మోస్తున్నట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

ఆర్థిక సర్వే ప్రకారం గత ఐదేళ్లుగా దేశ వ్యవసాయాభివృద్ధి సగటు రేటు 3.5శాతం. ఆహార ధాన్యాల ఉత్పత్తి కూడా గణనీయంగా పెరిగింది. కానీ, రైతులకు ఒరిగింది శూన్యం. కారణం అధిక ఉత్పత్తి ఉన్నప్పుడు ధరల పతనం జరిగి రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడటం. పంట అధికంగా పండినపుడు ఎగుమతులు చేసుకొనే వెసులుబాటు సామాన్య రైతులకు లేదు. మరో పక్క విదేశాల నుంచి పప్పుధాన్యాలతోపాటు పండ్లు, కూరగాయలు దిగుమతి కావడంతో దేశీయ రైతాంగం ఆ పోటీని తట్టుకోలేకపోతున్నారు. వ్యవసాయం గిట్టుబాటు కాక అప్పుల భారం పెరిగి రైతులు పెద్ద సంఖ్యలో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.

నిజానికి, వివిధ రకాల వ్యవసాయ ఉత్పత్తుల్లో నేటికీ భారతదేశం అగ్రస్థానంలో ఉంది. కానీ, హెక్టారుకు వచ్చే సగటు ఉత్పత్తి, ఉత్పాదకతలో మాత్రం అట్టడుగు స్థానంలో ఉంది. మొక్కజొన్న, వరి, గోధుమ, సోయా తదితర పంటల ఉత్పాదకతలో భారత్ వృద్ధి నత్తనడకన ఉండగా, బ్రెజిల్ లాంటి దేశాలు సైతం ఉత్పాదకతలో శరవేగంగా ముందుకు సాగుతున్నాయి. దేశ ఆహార భద్రతకు కీలకమైన వ్యవసాయ రంగాన్ని సమూలంగా మార్పు చేసే అవకాశం గతంలో కంటే ఇప్పుడు ఎక్కువగా ఉంది. గతంలో కంటే మెరుగైన వాతావరణ అంచనాలను వేసే సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి వచ్చింది. అధిగ దిగుబడి ఇచ్చే వంగడాలను, విత్తనాలను వృద్ధి చేసుకోగలిగిన టెక్నాలజీ వచ్చింది. అభివృద్ధి చెందిన దేశాలలో వ్యవసాయ రంగంలో నిరంతర పరిశోధనలు జరుగుతున్నాయి. వ్యవసాయ పరిశోధనలకు చేసే వ్యయాన్ని ఆయా దేశాలు పెట్టుబడిగానే పరిగణిస్తున్నాయి. వ్యవసాయరంగంలో సైతం ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వినియోగాన్ని ఆ దేశాలు వేగవంతం చేశాయి. ఇటీవల అత్యధిక శాతం ప్రజలు చిరుధాన్యాలవైపు మొగ్గు చూపుతున్నందువల్ల పంట మార్పిడిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.

వ్యవసాయాన్ని ప్రాధాన్యతారంగంగా ప్రభుత్వాలు పరిగణించాలి. దేశంలోని అన్ని వ్యవసాయ విశ్వవిద్యాలయాలలో పెద్దఎత్తున పరిశోధనలు జరపాలి. వాటి ఫలితాలను రైతాంగానికి అందించాలి. వ్యవసాయ ఎగుమతులను ప్రోత్సహించాలి. రైతులకు అధిక ఆదాయాన్ని అందించే వ్యవసాయ అనుబంధ రంగాలైన పాడి, ఉద్యానవనం పంటలు, మత్స్య ఉత్పత్తులకు ప్రోత్సాహం కల్పించాలి. రైతాంగ కుటుంబాల విద్య, ఆరోగ్యంపై దృష్టి పెట్టడం కోసం గ్రామాలలో మౌలిక సదుపాయాలను విస్తరించాలి. రైతాంగ కుటుంబాల పిల్లలకు; చేతివృత్తులపై ఆధారపడిన కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు తగిన పాఠశాలలు ఏర్పాటు చేయాలి. రైతు కుటుంబాల ఆరోగ్య సంరక్షణకు ఆసుపత్రుల్ని ఏర్పాటు చేయాలి. విద్య, ఆరోగ్యం, ఉపాధి అందుబాటులో ఉంటే గ్రామీణ ప్రాంతాల నుంచి వలసలు ఆగిపోతాయి. వ్యవసాయ రంగం అభివృద్ధి చెందితేనే దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుంది. ఈ రంగాన్ని మెరుగుపర్చడానికి నిరంతర కార్యాచరణ అవసరం.

● సి. రామచంద్రయ్య
శాసనమండలి సభ్యులు





మంగళగిరి: తాడేపల్లి మహానాడు కాలనీలో లోకేశ్‌ను ఆశీర్వదిస్తున్న మహిళలు

ఉత్సాహంగా.. తొలి అడుగు

- జిల్లా అంతటా ఇంటింటికీ టీడీపీ ఆరంభం
- చేసిన పనులు వివరిస్తూ ప్రజల్లోకి ప్రజాప్రతినిధులు
- నాలుగేళ్లలో చేసే పనులు చెప్తూ.. సమస్యలు తెలుసుకున్న నేతలు

(గుంటూరు, ఆంధ్రజ్యోతి)

ఇది మంచి ప్రభుత్వం.. సుపరిపాలనకు.. తొలిఅడుగు.. అంటూ బుధవారం టీడీపీ ప్రజాప్రతినిధులు, నేతలు ఉత్సాహంగా ప్రజల్లోకి వెళ్లారు. చేసిన పనులు చెప్తూ.. రాబోయే నాలుగేళ్లలో చేపట్టే పనులు వివరిస్తూ.. సమస్యలు తెలుసుకుంటూ నేతలు ప్రజలతో మమేకమయ్యారు. నేరుగా తమ గడప వద్దకు వస్తున్న ప్రజాప్రతినిధులకు ఎక్కడికక్కడ ప్రజలు స్వాగతం పలికి, వారిని సత్కరించేందుకు ఉత్సాహం చూపారు. ఇంటింటికి మంచి ప్రభుత్వం కార్యక్రమం బుధవారం జిల్లా అంతటా కోలాహలంగా ప్రారంభమైంది. బూత్ స్థాయి నుంచి నియోజవర్గ స్థాయి వరకు నేతలు ఈ కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. ఇంటింటికి వెళ్లిన నేతలు వారితో ఫొటోలు తీసుకుని ప్రభుత్వ పనితీరుపై అభిప్రాయాలను సేకరించారు. ప్రజలు తెలిపిన సమస్యలతో పాటు వారి అభిప్రాయాలను టీడీపీ యాప్‌లో నమోదు చేశారు. కూటమి పాలనకు ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా సంక్షేమం.. అభివృద్ధిని వివరిస్తూ ఇంటింటికీ కరపత్రాలను పంపిణీ చేశారు. వైసీపీ పాలనలో జరిగిన అరాచకాలను చెబుతూ సుపరిపాలనతో ప్రజలకు స్వేచ్ఛ లభించిందని వివరించారు. సూపర్‌సిక్స్ పథకాల్లో ఇప్పటికే పింఛన్ పెంపుదల, ఉచిత గ్యాస్ సిలెండర్లు, తల్లికివందనం అమలు చేశామని చెప్పారు. త్వరలోనే అన్నదాత సుఖీభవ, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం పథకాల అమలు చేస్తామని ప్రకటించగా ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యత చేపట్టిన వెంటనే ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లు పేదల కడుపు నింపుతున్నాయన్నారు.



తుళ్లూరు : హరిశ్చంద్రపురంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్



పెదపలకలూరులో కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు



పొన్నూరు : మామిళ్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పాల నాణ్యతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్

తొలి అడుగులో ఎమ్మెల్యేలు..

తొలిరోజు తొలిఅడుగు కార్యక్రమంలో బుధవారం పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. మంగళగిరి నియోజకవర్గం తాడేపల్లిలోని మహానాడు ప్రాంతంలో బుధవారం సాయంత్రం మంత్రి నారా లోకేశ్ 'తొలి అడుగు' కార్యక్రమాన్ని ప్రారంభించారు. మహానాడు ప్రాంతవాసులు లోకేశ్‌కు ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక సమస్యల పరిష్కారంతోపాటు, కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఎమ్మెల్యే నసీర్ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఏపీఐడీసీ చైర్మన్ డేగల ప్రభాకర్‌తో కలిసి వాసవీ నగర్లో కార్యక్రమాన్ని నిర్వహించారు. పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యే గల్లా మాధవి కొండయ్యకాలనీ మూడో లైనులో పర్యటించారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలోని గుంటూరు రూరల్ మండలం పెదపలకలూరు గ్రామంలోని ముస్లిం కాలనీ జెండా చెట్టు సెంటర్లో ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు లిడ్ క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్యరావుతో కలిసి పర్యటించారు. పొన్నూరు నియోజకవర్గం మామిళ్లపల్లి గ్రామంలో ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ తుళ్లూరు మండలం హరిశ్చంద్రపురం బోరుపాలెం గ్రామంలో పర్యటించారు. ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాలు, జరుగుతున్న అభివృద్ధిని వివరించారు.



మంగళగిరి: తాడేపల్లి మహానాడు కాలనీలో వృద్ధురాలి కాళ్లపై పూలు చల్లుతున్న మంత్రి లోకేశ్



49వ డివిజన్‌లో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గల్లా మాధవి



గుంటూరు వాసవి నగర్‌లో కరపత్రాన్ని ప్రజలకు అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్, ఏపీఐడీసీ చైర్మన్ డేగల

రాత్రి గస్తీలో ఇద్దరు నేరస్తుల గుర్తింపు

అదుపులోకి తీసుకున్న పోలీసులకు రివార్డులు



హోంగార్డులను అభినందిస్తున్న డీఎస్పీ అరవింద్

గుంటూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రాత్రి గస్తీలో వేలిముద్రల పరికరం ఆధారంగా పాత నేరస్తులైన బసవరాజు, మోహన్‌లను పట్టాభిపురం పోలీసులు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకున్న కానిస్టేబుల్ శ్రీనివాసరావు, హోంగార్డు గురవయ్యలను బుధవారం వెస్ట్ డీఎస్పీ అరవింద్, సీఐ గంగా వెంకటేశ్వర్లు అభినందించారు. ప్రతి ఒక్కరూ వీరిని ఆదర్శంగా తీసుకుని బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. రాత్రి గస్తీ సమయంలో అనుమానాస్పద వ్యక్తులను ఫింగర్ ప్రింట్ డివైజ్‌తో తనిఖీలు చేయాలన్నారు.

ఇద్దరు తల్లులు సహా పది మంది అదృశ్యం

గుంటూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోబాల్డుపేట ఆరో లైన్ లో ఇద్దరు తల్లులు సహా పది మంది అదృశ్యమైనట్లు పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు. ఆరోలైన్‌లోని ఓ ఇంట్లో సయ్యద్ సంధాని, సయ్యద్ చిన్న బాజీ అనే బంధువులు ఇద్దరు తమ కుటుంబాలతో ఒకరు కింది పోర్షన్‌లో, మరొకరు పైపోర్షన్‌లో అద్దెకు ఉంటున్నారు. ముస్లిం మత ప్రచారాలకు సంబంధించిన ఖర్చులకు చందాలు వసూలు చేస్తుంటారు. అయితే బుధవారం మధ్యాహ్నం సంధాని భార్య కరీమూన్, వారి పిల్లలు మహమ్మద్ షాహిద్ (9), అబ్దుల్ సలీం(7) అబ్దుల్ హఫీజ్(5), చిన్న బాజీ భార్య రజియా, వారి పిల్లలు ముస్తాక్ ఖాన్(8), ముజాంబీర్(7), మొహరీన్ ఫిర్దోస్(4) లతో పాటు వారి మరదలు, ఆమె కూతురు మొత్తం పది మంది ఇంటి నుంచి ఎవరికి చెప్పకుండా అదృశమయ్యారు. వీరిలో వారి మరదలుకు మాత్రమే సెల్‌ఫోన్ ఉంది. ఆ సెల్‌ఫోన్ గుజ్జనగుండ్ల ఆటో స్టాండ్ వద్ద స్విచ్ ఆఫ్ చేశారు. ఆ తర్వాత నుంచి వారి ఆచూకీ తెలియరాలేదు. బాధితులు సంధాని, చినబాజీ ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్లాస్టిక్ మయం



- మహమ్మారిలా మారిన ప్లాస్టిక్
- యథేచ్ఛగా వినియోగం.. విక్రయం
- తనిఖీలు మరిచిన మున్సిపల్ అధికారులు
- కాల్వల్లో, ఖాళీ ప్రదేశాల్లో పేరుకుపోతున్న కవర్లు

వరద నీటి కాలువ నిండా ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు



(ఆంధ్రజ్యోతి - న్యూస్‌నెట్‌వర్క్)

వేడివేడి ఆహార పదార్థాలు, కూరలు, కూల్‌గా ఉండే జ్యూస్‌లు, పండ్లు, ఇతర సామగ్రి ఏది తెచ్చుకోవాలన్నా ప్లాస్టిక్ కవర్లనే వినియోగిస్తున్నారు. టిఫిన్ బళ్ల నుంచి కూరగాయల వ్యాపారుల వరకు కూడా ప్లాస్టిక్ కవర్లనే వాడుతున్నారు. పర్యావరణానికి పెనుభూతంగా మారిని ప్లాస్టిక్ నిషేధం అమలుకు నోచుకోకపోగా రోజు రోజుకు పెరుగుతుంది. ప్రభుత్వం ప్లాస్టిక్ కవర్ల వాడకంపై నిషేధం అమల్లోకి తెచ్చినా గ్రామాలు సహా పట్టణ ప్రాంతాల్లో ఎక్కడా అమలు కావడంలేదు. ఎక్కడికక్కడ విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్లను బహిరంగంగానే విక్రయిస్తున్నా.. ప్రజలు వినియోగిస్తున్నా పట్టించుకునే వారే లేరు. సామగ్రి ఏదైనా దుకాణాల్లో కొనుగోలు చేస్తే ప్లాస్టిక్ కవర్లపైనే ఆధారపడుతున్నాడు. దీనిని వ్యాపారులు ప్రోత్సహిస్తుండటంతో కవర్లను ఇష్టం వచ్చినట్లు వినియోగిస్తున్నారు. మున్సిపల్ పట్టణాల్లో ప్లాస్టిక్ కవర్లపై కఠిన నిషేధం ఉన్నా అధికారులు చర్యలు తీసుకుంటున్న దాఖలాలు లేవు. అప్పుడప్పుడు పైపై దాడులతోనే సరిపెడుతున్నారు. కేసులు నమోదు కఠినంగా వ్యవహరించకపోవడంతో (మిగతా 8వ పేజీలో)

అమలు కాని నిషేధం

ప్లాస్టిక్.. ప్లాస్టిక్.. ఎక్కడ చూసినా.. ఎవరి చేతిలో చూసినా.. ప్లాస్టిక్ కవర్లే. కర్రీ పాయింట్ల నుంచి టిఫిన్ బళ్లు సహా పెద్దపెద్ద హోటళ్లలో వేడివేడి ఆహార పదార్థాల ప్యాకింగ్‌కు ప్లాస్టిక్ కవర్లనే వినియోగిస్తున్నారు. ప్రాణాలు తీయడమే కాదు.. పర్యావరణానికి ముప్పు అంటున్నా విక్రయాలు.. వినియోగం యథేచ్ఛగా జరుగుతోంది. స్వచ్ఛ భారత్‌లో భాగంగా 2018 అక్టోబరు 2 నుంచి అప్పటి టీడీపీ ప్రభుత్వం ప్లాస్టిక్ కవర్లపై నిషేధం విధించింది. అపట్లో దాడులు.. కేసులు.. జరిమానాలతో కొంతవరకు ప్లాస్టిక్ కవర్ల వినియోగం, విక్రయం కొంత అదుపులోకి వచ్చింది. అయితే 2019 లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ప్లాస్టిక్ కవర్ల నిషేధాన్ని నీరుగార్చింది. దీంతో పట్టణాల్లో యథావిధిగా వినియోగం, విక్రయాలు సాగుతున్నాయి. డ్రెయిన్లు, ఖాళీ స్థలాల్లో గుట్టలుగుట్టలుగా పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను చూస్తే వాటి వినియోగం ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. తోపుడు బండ్ల వ్యాపారులు, చికెన్ సెంటర్లు, కూరగాయల వ్యాపారులు, ఆహార పదార్థాల విక్రయదారులు ఇలా అందరూ ప్లాస్టిక్ కవర్లను వినియోగి స్తున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడంలేదు.



అత్తలూరివారిపాలెం - కృష్ణా జిల్లా వల్లూరుపాలెం మధ్య దొంగదిబ్బపై రెండు జిల్లాల సరిహద్దుల్లో ఎక్స్‌కవేటర్‌తో ఇసుక తవ్వి గుట్టలుపోసి, లారీలకు లోడ్ చేస్తున్న చిత్రం

సరిహద్దుల్లో ఇసుక మాయ

- అనుమతి ఒక పక్క.. తవ్వకాలు మరోపక్క
- దొంగదిబ్బ కొల్లగొట్టేందుకు నదిలోకి ఎక్స్‌కవేటర్

తెనాలి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఒక జిల్లాలోని పట్టా భూముల్లో ఇసుక తవ్వుకునేందుకు అనుమతి తీసుకున్నారు. అయితే తవ్వకాలు మాత్రం పక్క జిల్లా పరిధిలో. అధికారులు దాడులు చేసేందుకు వస్తే సరిహద్దుల మాయచేసి, వారికి మామూళ్ల మత్తుమందుచల్లుతున్నారు. అమ్మకాలు మాత్రం రెండు జిల్లాల్లో యథేచ్ఛగా చేసుకుంటున్నారు. నిన్నటి వరకు బాపట్ల జిల్లా గాజుల్లంక, కృష్ణా జిల్లా శ్రీకాకుళం మధ్య ఈ తరహా మాయ జరిగితే, తాజాగా గుంటూరు జిల్లా కొల్లిపర కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలం వల్లూరుపాలెం మధ్య ఇసుక దందాకు దిగారు. రెండు జిల్లాల పరిధిలో నది మధ్యలో దొంగదిబ్బ పేరుతో ఇసుక మేట వేసి ఉంది. నదిలో కలిసిపోయిన చల్లపల్లి జమిందారుకు సంబంధించిన కొంత భూమి, సొసైటీ భాగాల పట్టాలతో కృష్ణా జిల్లాకు చెందిన కొందరు ఇసుక తవ్వుకునేందుకు అనుమతి తీసుకున్నామని చెబుతున్నారు. అయితే వారు అనుమతి పొందిన భూమి కృష్ణా జిల్లా పరిధిలో ఉంటే, తవ్వకాలు గుంటూరు జిల్లా పరిధిలో జరుగుతున్నాయని స్థానికుల ఆరోపణ. అత్తలూరివారిపాలేనికి చెందిన రైతులు కొందరు సర్పంచ్‌కు, మండల స్థాయి అధికారులకు తవ్వకాలపై ఫిర్యాదులు చేశారు. నెల క్రితం ఇదే అంశంపై వాగ్వాదం జరిగితే, రెండు జిల్లాల అధికారులు జిల్లా సరిహద్దులను నిర్ధారించారు. తర్వాత వరదలతో తవ్వకాలు ఆగిపోయాయి. ప్రస్తుతం నీరు తగ్గడంతో మళ్లీ తవ్వకాలు మొదలుపెట్టారు. అయితే గతంతో తవ్వినచోట కాకుండా గుంటూరు జిల్లావెపు తవ్వకాలు చేస్తున్నారు. దొంగదిబ్బపై సొసైటీ భాగాలుంటే, కృష్ణా జిల్లాలో ఎలా అనుమతులు తీసుకుంటారనేది స్థానికుల ప్రశ్న. నది మధ్యలోనే ఇసుక దిబ్బలు పోస్తున్నారు. మాన్‌సూన్ సీజన్ కావడంతో నదిలో తవ్వకాలు నిషేధం. అయినా నదిలోకి ఎక్స్‌కవేటర్లను దింపి, లారీల్లోకి ఇసుక లోడింగ్ చేస్తున్నారు. డంపింగ్ ప్రదేశాల్లో ఉండాల్సిన ఇసుక గుట్టలు నదిలోనే ఉంటున్నాయి. కొల్లిపర మండలం వైపునకు రావడానికి నీటిపాయ ఉండటంతో లారీలు మొత్తం కృష్ణా జిల్లావైపునకే వెళుతున్నాయి. ఇటు బాపట్ల జిల్లా గాజుల్లంక - కృష్ణా జిల్లా శ్రీకాకుళం మధ్య అనుమతులు ఒకచోటైతే మరోచోట తవ్వుతున్న పరిస్థితి ఉంది. గుంటూరు జిల్లా వైపు అనుమతి ఉంటే, రవాణా మాత్రం కృష్ణా జిల్లాకు తరలిస్తున్నారు. రెండు రోజుల క్రితం ఘంటసాల మండల అధికారులు శ్రీకాకుళం పక్కన గాలు మార్గంలోకి లారీలు దిగకుండా గండి కొట్టించారు. అధికారులకు మామూళ్లు ముట్టినన్ని రోజులూ అక్రమంగా ఇసుక తరలిపోతున్నా, పట్టించుకోకుండా మామూళ్లు ఆగినప్పుడు గాడి కొట్టించడం ఏమిటని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



వర్సిటీలో అక్రమాలపై విజిలెన్స్ దర్యాప్తు

- గత ఐదేళ్లలో జరిగిన అక్రమాలపై రికార్డులు అందజేయండి
- ఇన్‌చార్జి వీసీని కోరిన విజిలెన్స్ అధికారులు

నేడు పడవ రేవులకు వేలం

పేకాట స్థావరంపై దాడి

- జూదరుల నుంచి రూ.10లక్షలు స్వాధీనం 6

ముందస్తుగా సాగునీరు

- పశ్చిమ డెల్టాకు నీటి విడుదల
- ప్రధాన కాల్వ నుంచి 317 క్యూసెక్కుల ప్రవాహం



ఉండవల్లి హెడ్ రెగ్యులేటర్ నుంచి విడుదలవుతున్న సాగునీరు

తెనాలి, గుంటూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ డెల్టాలో ఈ ఏడు ముందస్తుగానే కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. నారుమళ్లు పెంపుదల కోసం రైతులకు అవసరమైన సాగునీటిని బుధవారం జలవనరులశాఖ విడుదల చేసింది. ఈ నెల మధ్యలో నీరు విడుదల చేయాల్సి ఉండగా మొదటి వారంలోనే లాంఛనంగా నీటిని విడుదల చేసింది. దీంతో ముందస్తుగానే డెల్టా కాల్వల్లో నీరు పారుదల ప్రారంభమైంది. రెండు రోజుల క్రితం కలెక్టర్ నాగలక్ష్మితో ఇరిగేషన్ ఎస్ఈ వెంకటరత్నం సమావేశమైనప్పుడు ఈ నెల 5 నుంచి నీటిని విడుదల చేయాలని భావించారు. అయితే ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలతో నాలుగు రోజుల ముందుగానే నీటి విడుదలను ప్రారంభించారు. తొలుత కేడబ్ల్యూ మెయిన్ కెనాల్‌కు 317 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. కాల్వల కింద ఉన్న తాగునీటి చెరువులు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నింపేందుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాల్సిందిగా ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు జారీ అయ్యాయి. రైతులు నారుమళ్లు పెట్టుకోవడం, నేరుగా వెద పద్ధతిలో వరి నాట్లు వేయడాన్ని బట్టి కాలువలకు నీటి విడుదలను పెంచుకుంటూ పోతామని ఎస్ఈ తెలిపారు. కాల్వ పనులు జరుగుతున్న చోట పరిమాణాన్ని తగ్గిస్తూ, పది రోజుల్లో ఆయా పనులు ముగియనున్నందున పూర్తి స్థాయి సామర్థ్యం మేరకు నీటిని విడుదల చేస్తామన్నారు.

ఆశ్చర్యం.. ఆనందం

సుదీర్ఘకాలం తర్వాత జరుగుతున్న డెల్టా కాల్వల మరమ్మతు పనులు కొనసాగుతున్న నేపథ్యంలో నీటి విడుదలలో జాప్యం జరుగుతుందని రైతులు భావించారు. దీంతో బోర్లు కింద ఇప్పటికే వెద పద్ధతిలో నారుమళ్లు సిద్ధం చేసుకునే పనిలో రైతులు ఉన్నారు. ఈ క్రమంలో ముందుగానే నీరు వస్తుండటంతో రైతుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. ముందస్తు సమాచారం లేకుండానే కాల్వలకు నీటి విడుదల చేయడంతో అందరూ ఆశ్చర్యపోతున్నారు. సాధారణంగా నీటి విడుదల తేదీని ప్రకటించి అందుకు డెల్టా రైతులను సిద్ధం చేసేవారు. అయితే ఈ ఏడాది వర్షాలు ఆలస్యం కావడం, ఇంకా జలాశయాల్లోకి పూర్తిస్థాయిలో ఇన్‌ఫ్లోలు లేకపోవడంతో నీటి విడుదల విషయంలో అధికారులు వెనకడుగు వేయాల్సిన పరిస్థితి. అయితే శ్రీశైలం జలాశయానికి ఇన్‌ఫ్లో పెరగడం, పులిచింతల డ్యాంలో నిల్వ చేసిన నీరు ఉండటంతో ఖరీఫ్ సాగుకు ఎలాంటి ఇబ్బంది ఉండబోదని భావించి అధికారులు నీటిని ముందుగానే విడుదల చేయడం ప్రారంభించారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లో కలిపి డెల్టా కింద 5.98 లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్నది. ఇందులో 5.71 లక్షల ఎకరాలు కేడబ్ల్యూడీ కింద, 27 వేల ఎకరాలు గుంటూరు ఛానల్ కింద ఉన్నాయి. ప్రస్తుత గుంటూరు జిల్లాలో 1,84,190 ఎకరాలు, బాపట్లలో 3,79,997 ఎకరాలు, ప్రకాశంలో 7,164 ఎకరాల రిజిష్టర్డ్ ఆయకట్టు ఉన్నది. అంతే కాకుండా మైనర్ ఇరిగేషన్ కింద 31,505 ఎకరాల యాకట్టు ఉన్నది. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కలిసి 270 చెరువులు కూడా ఆయకట్టు కింద ఉన్నాయి.

నేడు పడవ రేవులకు వేలం

గుంటూరు సిటీ, జూలై 2(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు పడవ రేవులకు గురువారం వేలం పాట నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ కొప్పర కృష్ణ తెలిపారు. ఉదయం టెండర్ ప్రక్రియ ప్రారంభించి, మధ్యాహ్నం బహిరంగ వేలం నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. అచ్చంపేట మండలంలోని గింజుపల్లి, చింతపల్లి పడవ రేవులతో పాటు మాదిపాడు బల్లకట్టుకు వేలంపాట నిర్వహిస్తామని తెలిపారు. మాచవరం మండలంలోని గోవిందాపురం బల్లకట్టు, అమరావతి మండలంలోని దిడుగు పడవ రేవుకు, కొల్లిపర మండలంలోని వల్లభాపురం పడవ రేవుకు వేలం నిర్వహిస్తామని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగే బహిరంగ వేలం లో పాల్గొనాలని డిప్యూటీ సీఈఓ కృష్ణ సూచించారు.

వర్సిటీలో అక్రమాలపై విజిలెన్స్ దర్యాప్తు

● గత ఐదేళ్లలో జరిగిన అక్రమాలపై రికార్డులు అందజేయాలని
● ఇన్‌చార్జి వీసీని కోరిన విజిలెన్స్ అధికారులు

పెదకాకాని, జూలై 2(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. బుధవారం విశ్వవిద్యాలయానికి చేరుకున్న విజిలెన్స్ అధికారులు వై శివన్నారాయణ, మరో అధికారి రిజిస్ట్రార్ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె గంగాధర్ రావుతో భేటీ అయ్యారు. 2019 నుంచి 2024 వరకు ఐదేళ్లపాటు విశ్వవిద్యాలయంలో జరిగిన అక్రమాలపై నివేదికలు కోరారు. అప్పటి వీసీ ఆచార్య రాజశేఖర్ పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడినట్లు, వర్సిటీ ఇంజనీరింగ్ అధికారులు దోపిడీ చేసినట్లు ఆరోపణలు వచ్చాయి. నకిలీ ఉద్యోగుల నియామకులు, ఒక ఇంజనీరింగ్ అధికారి తనకు ఇష్టం వచ్చినట్లుగా సిబ్బందిని నియమించుకున్నట్లు, కొంతమంది పేరుమీద ఉద్యోగాలు జీతాలు డ్రా చేసినట్లు ఫిర్యాదులు అందాయి. కొన్ని పనులు చేయకుండానే నిధులు డ్రా చేసినట్లు వచ్చిన ఫిర్యాదులపై సమగ్ర విచారణ చేయనున్నట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు.

45,224 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 46,390 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 45,224 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 10,119 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్టధర	గరిష్టధర	వెరైటీ	కనిష్టధర	గరిష్టధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9700	11000
334	9500	13000	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	13200	334	9500	12800
273	10000	12500	నెంబరు. 5	10000	13300
341	10000	13400	341	10000	13200
సూపర్ 10	9700	12400	4884	10000	12400
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			సూపర్ 10	---	---
తేజ	10000	14000	ఏసీ స్పెషల్ వెరైటీ		
భార్స్-1	---	---	తేజ	10000	13600
బ్యాడిగి 355	10000	12800	బ్యాడిగి	10000	12800
సింజెంటా బ్యాడిగి	---	---	దేవనూరు డీలక్స్	10000	12500
దేవనూరు డీలక్స్	10000	12600	తాలుకాయలు	4500	7000

నెలవారీ మామూళ్లు డిమాండ్ చేస్తున్నారు

● ఆర్టీవో రూ. 18 వేలు, పోలీసులు రూ. 3 వేలు ఇస్తేనే పంపిస్తున్నారు ● లేకుంటే భారీ పెనాల్టీలు విధించి కేసులు బనాయింపు ● ఇసుక లారీల యజమానులు, డ్రైవర్ల సమ్మె



అమరావతి రోడ్డులో సమ్మెకు దిగిన ఇసుక లారీల యజమానులు, డ్రైవర్లు

గుంటూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): నెలవారీ మామూళ్ల కోసం రవాణా, పోలీసుశాఖ సిబ్బంది తమను వేధిస్తున్నారని ఇసుక లారీల యజమానులు, డ్రైవర్లు ఆరోపించారు. రవాణా శాఖ సిబ్బంది ఒక్కో లారీకి రూ. 18 వేలు, పోలీసులు రూ. 3 వేలు డిమాండ్ చేస్తున్నారని తెలిపారు. ఇవ్వకపోతే కేసు నమోదు చేసి రూ. 50 వేల వరకు పెనాల్టీలు విధిస్తున్నారని చెప్పారు. ఈ వేధింపులు జిల్లా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు అడ్డుకోకపోతే తాము నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. బుధవారం సాయంత్రం అమరావతి రోడ్డులోని హోసన్నా మందిరం వద్ద ఇసుక లారీల యజమానులు సమ్మెకు దిగారు. ఈ సందర్భంగా వాళ్లు మాట్లాడుతూ ఉచిత ఇసుక విధానం పేరుతో లోడింగ్ చేస్తున్న లారీలకు ఇష్టానుసారంగా జరిమానాలు విధిస్తున్నారని చెప్పారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇలానే పీడించే వారని, తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఏర్పడ్డాక ఆరు నెలల పాటు ఏమి అనలేదని, ఇప్పుడు మళ్లీ మామూళ్లు డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. తద్వారా ప్రభుత్వానికి అధికారులు చెడ్డ పేరు తీసుకొస్తున్నారని తెలిపారు. తాము బిల్డర్లకి తక్కువ రేటుకి ఇసుక అందిస్తున్నామని, అయినప్పటికీ 3 నెలల నుంచి రవాణా శాఖ సిబ్బంది లారీ యజమానులను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కేసులు రాయకుండా ఉండాలి అంటే ముఖ్యమంత్రి దగ్గర నుంచి ప్రత్యేక జీవో తెచ్చుకోమని నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని పేర్కొన్నారు. ఇసుక రీచ్ వద్ద లోడింగ్ చేయడానికి ఎక్కువ రేటు తీసుకుంటున్నారని 20 టన్నులకు ఇవ్వాల్సిన బిల్లు 18 టన్నులకు మాత్రమే ఇస్తున్నారని ఆరోపించారు. దీంతో ఎక్కువ మోతాదులో ఇసుక తెస్తున్నారని రవాణా శాఖ అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారు. తాడికొండ, తుళ్లూరు పోలీసుస్టేషన్ల సిబ్బంది తమను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. తమ సమస్యలను పరిష్కరించకపోతే గురువారం 100 లారీలతో నిరసన తెలుపుతామని హెచ్చరించారు. హోసన్నా మందిరం నుంచి బిల్లిస్ వరకు లారీలతో ర్యాలీ చేపట్టి నాలుగు రోడ్ల కూడలిని దిగ్బంధిస్తామన్నారు. క్వారీల్లో లోడింగ్ విధానం ఒకేలా ఉండేలా చూడాలని కోరారు. కొన్ని లారీలకు ఓవర్ లోడింగ్‌కి అనుమతిస్తూ కొన్ని లారీలకు ఓవర్ లోడింగ్ ఇవ్వట్లేదన్నారు. రాజకీయంగా పలుకుబడి ఉన్న లారీలకు ఆర్టీవో అధికారులు కేసులు పెట్టకుండా సహకరిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఇసుక లారీల యజమానుల సంఘం నాయకులు డేగల ప్రదీప్, బోయపాటి తేజ, తన్నీరు శివ, తాడేపల్లి కోటేశ్వరరావు, వెనిగండ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాత బంగారం కొంటామని మోసం

● పెదకాకాని దర్గా వద్ద ఆశ్రయం పొందుతున్న నిందితులు
● ముఠాను అదుపులో తీసుకున్న శ్రీకాళహస్తి పోలీసులు

పెదకాకాని, జూలై 2(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి ప్రాంతంలో మోసాలకు పాల్పడుతూ గుంటూరు జిల్లా పెదకాకాని బాజీ బాబా దర్గా వద్ద ఆశ్రయం పొందుతున్న ముఠాను బుధవారం శ్రీకాళహస్తి పోలీసులు అదుపులో తీసుకున్నారు. నార్త్ ఇండియాకి చెందిన ఇద్దరు పురుషులు, ముగ్గురు మహిళలు మొత్తం ఐదుగురు ఒక టీంగా ఏర్పడి శ్రీకాళహస్తి ప్రాంతంలో ప్రజలను మోసగిస్తున్నారు. పాత బంగారాన్ని కొంటామని చెప్పి, బంగారం తెచ్చిన తర్వాత నోట్ల కట్ట మధ్యలో తెల్ల కాగితాలు పెట్టి వారికి అప్పజెప్పి, అక్కడ నుంచి పారిపోతున్నారు. ఈ విధంగా పాత బంగారం ముసుగులో అనేక మందిని ఆ ప్రాంతంలో మోసం చేశారు. దీనిపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన శ్రీకాళహస్తి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అక్కడ మోసాలకు పాల్పడి పెదకాకాని బాజీ బాబా దర్గా వద్ద ఆశ్రయం పొందుతున్నట్లు ఆ దొంగల ముఠా గురించి సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసులు గుర్తించారు. దీంతో పెదకాకాని పోలీసులను శ్రీకాళహస్తి పోలీసులు ఆశ్రయించారు. పెదకాకాని పోలీస్‌స్టేషన్ సిబ్బంది దర్గా వద్ద వీరు ఉంటున్న ప్రాంతాన్ని శ్రీకాళహస్తి పోలీసులకు చూపించారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఐదుగురిని అదుపులో తీసుకొని శ్రీకాళహస్తి తరలించారు.

పౌర్ణమికి అరుణాచలంనకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు

గుంటూరు, జూలై 2(ఆంధ్రజ్యోతి): ఈనెల 10న పౌర్ణమికి అరుణాచలం పుణ్యక్షేత్రానికి వెళ్ళే భక్తుల కోసం గుంటూరు-2 డిపో నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ సీహెచ్ సునీత బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అరుణాచలంలో గిరి ప్రదక్షణ మహోత్సవాలకు డిపో నుంచి స్పెషల్ హైటెక్ (2+2)పుష్ బ్యాక్ బస్ ఏర్పాటు చేశామని, ఈ బస్ జూలై 8వ తేదీన రాత్రి 9, 15 గంటలకు గుంటూరులో బయలుదేరి, జూలై 9న శ్రీకాళహస్తి, కాణిపాకం,శ్రీ పురం గోల్డెన్ టెంపుల్ దర్శించుకొని అదే రోజు రాత్రి అక్కడ నుంచి బయలు దేరి పౌర్ణమిరోజు అనగా జూలై 10న ఉదయం అరుణాచలం చేరుకుంటుందని, అదే రోజు గిరి ప్రదక్షిణ, అరుణాచలేశ్వరుని దర్శించుకొని, జూలై 10 వ తారీకు సాయంత్రం అరుణాచలంలో బయలు దేరి జూలై 11వ తారీకు ఉదయం 6.30 గంటలకు గుంటూరు చేరుతుందన్నారు. సర్వీస్ 96164 నెంబర్ ద్వారా ఆన్‌లైన్ రిజర్వేషన్ చేసుకొనే అవకాశం కల్పించామన్నారు. ప్రయాణికులు ఉపయోగించుకోవాలని ఒక్కో టికెట్ ధర రూ 2420 మాత్రమేనని, అదనపు సమాచారం కోసం 7382897459, 7382894613 సంప్రదించాలని కోరారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.90 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	101, 109, 120
చికెన్ విత్ స్కిన్(కిలో)	194.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	204.00

పార్టీ వీడనందుకు పెన్షన్ కట్ చేశారు..

● ఎమ్మెల్యే వేగేశన వద్ద ఆవేదన వెలిబుచ్చిన దివ్యాంగురాలు శివమ్మ ● త్వరలో పెన్షన్ ఇప్పిస్తానని ఎమ్మెల్యే హామీ



దివ్యాంగురాలు బోయిన శివమ్మ చేయిపట్టుకుని నడిపిస్తూ సమస్యను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అరాచకాలు పరాకాష్టకు చేరాయనటానికి ఇదొక నిదర్శనం. పుట్టుకతోనే పోలియోబారిన పడి రెండుకాళ్ళు పనిచేయని పరిస్థితులో ఉన్న బోయిన శివమ్మకు ఎన్టీఆర్ పెన్షన్ పథకాన్ని ప్రవేశ పెట్టిన నాటి నుంచి 70 రూపాయల పెన్షన్ తీసుకుంటూ వచ్చింది. కేవలం తెలుగుదేశంపార్టీకి చెందిన వారని చెప్పి గత పాలకులు ఆమె పెన్షన్ నిలిపివేశారు. ఇదేమిటని ప్రశ్నిస్తే టీడీపీని వీడి వైసీపీలో చేరితే పెన్షన్ కొనసాగిస్తామని నీచరాజకీయాలు చేశారు. పెన్షన్ అయిన వదులుకుంటానుకాని పార్టీని మాత్రం వీడనని చెప్పిన దివ్యాంగురాలు బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు తన ఆవేదన వెళ్ళబుచ్చింది. బాపట్ల పట్టణంలోని 9వ వార్డు చిల్లరగొల్లపాలెంకు చెందిన బోయిన శివమ్మకు పెన్షన్ పథకం ప్రారంభం నుంచే దివ్యాంగురాలు కావటంతో పెన్షన్ వచ్చేది. వైసీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే కోన రఘుపతి ఆమె పెన్షన్ కట్ చేయించారు. కేవలం ఆమె కుటుంబం తెలుగుదేశంపార్టీ వారు కావటమే కారణం. పెన్షన్ నిలిపి వేయటం గురించి కోన రఘుపతిని అడిగితే పార్టీ మారితే ఇస్తామని చెప్పటంతో ఆమె పెన్షన్ వదులుకుంది. పార్టీని వీడలేదు.వార్డుకొచ్చిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు జరిగినదంతా వివరించి మన ప్రభుత్వంలో తిరిగి నాకు పెన్షన్ ఇప్పించు అన్నా అని కోరింది. దీంతో తీవ్రంగా చెలించిపోయిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆమె చేయి పట్టుకుని నడిపిస్తూ వైసీపీ అరాచకాలను ప్రజలకు వివరించారు. ఇలాంటి వెదవపనులు కోన రఘుపతికే చెల్లుతాయని విమర్శించారు. త్వరలో పెన్షన్ ఇప్పిస్తానని హామీనిచ్చారు. అదేవిధంగా చిల్లర గొల్లపాలెంలోని కుర్రా వీరయ్య, దొడ్డక వెంకటేశ్వరమ్మ పెన్షన్‌లు కూడా తీసేశారని ఎమ్మెల్యేకు వివరించారు. వైసీపీ అరాచకాలను వివరిస్తూ కూటమి ప్రభుత్వ సుపరిపాలన గురించి తెలియజేస్తూ పార్టీశ్రేణులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్ళి కరపత్రాలు అందజేశారు.

ఉప్పరపాలెం మెటల్ క్వారీలలో అధికారుల తనిఖీలు

యడ్లపాడు, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : యడ్లపాడు మండలం ఉప్పరపాలెం గ్రామ పరిధిలోని మెటల్ క్వారీలలో రెవెన్యూ, మైనింగ్‌శాఖల అధికారులు బుధవారం ఉమ్మడిగా తనిఖీలు నిర్వహించారు. ఇటీవల ఉప్పరపాలెం గ్రామానికి చెందిన కొందరు నిబంధనలకు విరుద్ధంగా క్వారీయింగ్ చేస్తున్నారంటూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పల్నాడు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ ఆర్డీవో మధులతను పరిశీలించి నివేదిక ఇవ్వాల్సిందిగా ఆదేశించగా జూన్ 26న మైనింగ్, స్థానిక రెవెన్యూ, పంచాయతీ అధికారులతో కలసి ఆర్డీవో క్షేత్రస్థాయిలో పరిశీలించి ఉమ్మడి తనిఖీలకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో మైనింగ్, రెవెన్యూ అధికారులు ఉమ్మడి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయశ్రీ మాట్లాడుతూ గ్రామ పరిధిలోని సర్వే నంబరు 240/10లో గల కొండలో క్వారీయింగ్ నిర్వహించుకునేందుకు 23 మందికి లీజులు ఇవ్వడం జరిగిందన్నారు. వీటిలో 4 క్వారీల యజమానులు చైతన్య స్టోన్ క్రషర్‌కు 2, గాయత్రి స్టోన్ క్రషర్, ఆర్ సత్యన్నారాయణలకు చెందిన ఒక్కొక్క క్వారీకి పూర్తి అనుమతులు ఉన్నాయన్నారు. మరో 7 క్వారీలకు సంబంధించి దరఖాస్తులు ప్రాసెస్‌లో ఉన్నాయని, అన్ని అనుమతులు పూర్తయ్యాయని పొల్యూషన్ బోర్డు నుంచి సీఎఫ్‌వో మాత్రమే రావాల్సి ఉందన్నారు. మిగిలిన 12 క్వారీలకు అనుమతులు లేవని, వివిధ రకాల సమస్యల కారణంగా అనుమతులు రాలేదన్నారు. పూర్తి అనుమతులు ఉన్న నాలుగు క్వారీలకు సంబంధించి ఉమ్మడి తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. రెవెన్యూ సర్వేయర్లు అనుమతులు ఉన్న క్వారీలలో ఎంతమేర క్వారీయింగ్ జరిగిందన్న విషయంపై గ్లోబల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం(జీఎన్ఎస్ఎస్) ద్వారా కొలతలు సేకరిస్తారన్నారు. అయితే ఏ సర్వే నంబరులో ఎన్ని క్వారీలు ఉన్నాయి, లీజుదారులు ఎంత మంది, వారికి కేటాయించిన విస్తీర్ణం ఎంత, ఎప్పటి నుంచి ఎప్పటి వరకు అనుమతులు ఉన్నాయి, అన్న విషయాలను మైనింగ్ అధికారులు తేల్చాల్సి ఉందన్నారు. అన్ని అంశాలను పరిశీలించి ఉమ్మడి నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామని వివరించారు. కార్యక్రమంలో మైనింగ్ టీఏ కల్యాణి, సర్వేయర్ రవితేజ, మండల ఆర్ఐ సుబ్బారావు, మండల సర్వేయర్ సురేంద్ర, వీఆర్వో శివ కోటేశ్వరరావు, విలేజ్ సర్వేయర్లు శ్రీనివాసరావు, పవన్, ఏఎస్ఐ వెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

● జూదరుల నుంచి రూ.10లక్షలు స్వాధీనం

అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి): పుణ్యక్షేత్రమైన అమరేశ్వరాలయం సమీ పంలోని ఎస్ఆర్ఆర్ వసతి గృహంలో రూమ్ నెంబరు 206ను అద్దెకు తీసుకుని పేకాట ఆడుతున్న తరుణంలో అమరావతి పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహిం చారు. ఎస్పీ కే శ్రీనివాసరావు ఆదేశాల మేరకు డీఎస్పీ హనుమంతరావు ఆధ్వ ర్యంలో బుధవారం పోలీసులు నిర్వహించిన దాడిలో పది మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.10 లక్షల 38వేల నగదును, 11సెల్‌పోన్లు, రెండు కార్లు, ఒక బైక్ స్వాదీనం చేసుకున్నారు. జూదరులను స్టేషన్‌కు తరలించి కేసునమోదు చేశారు. వసతి గృహం యజమానిపై కేసు నమోదు చేశారు. వీరు సత్తెనపల్లి, క్రోసూరు, నరసరావుపేట నుంచి వచ్చి పేకాట ఆడుతున్నారు. దాడులు నిర్వహిం చిన వారిలో సీఐ అచ్చయ్య, ఎస్ఐలు రాజశేఖర్, అమీర్‌లతో పాటు స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది పాల్గొన్నారు. అమరావతిలో పేరుకు భక్తులకు, పర్యాటకులకు వసతి గృహాలు నిర్వహి స్తూ పేకాట, విజయవాడ, గుంటూరు తదితర ప్రాంతాల నుంచి వచ్చే జంటలకు ఆతిథ్యం ఇస్తున్నారు. వీటిపై పోలీసుల పర్యవేక్షణ కొరవడటంతో ఇటువంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇప్పటికైన వారం వారం వసతి గృహాలను తనిఖీ నిర్వహించి అసాంఘిక కార్యక్రమాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు నిబంధనలు పాటించాలి

● విద్యుత్ భద్రతా డైరక్టర్ విజయలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న విజయలక్ష్మి, వేదికపై ఈఈ శ్రీనివాసబాబు తదితరులు

గుంటూరు, జూలై 2(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ప్రమాదాల నివారణకు సీపీడీసీఎల్ యంత్రాంగం మరింత పకడ్బందీగా నిబంధనలు పాటించాలని విద్యుత్‌శాఖ భద్రతా డైరక్టర్, చీఫ్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ జీ విజయలక్ష్మి సూచించారు. జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా గుంటూరు నల్లచెరువులోని గుంటూరు టౌన్-1 డివిజన్ కార్యాలయంలో ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టీ శ్రీనివాసబాబు అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ జూన్ 26వ తేదీ నుంచి జూలై 2 వరకు జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ పోల్స్‌ను, సపోర్టు తీగెలను తాకవద్దని, సేఫ్టీ పరికరాలతోనే పనిచేయాలన్నారు. మూడు పిన్‌ల సాకెట్‌లను, మూడు పిన్‌ల ప్లగ్‌లను మాత్రమే వాడాలన్నారు. విద్యుత్ సరఫరా నిలపకుండా పనిచేయరాదని, సరఫరా నిలిపివేసి నిర్ధారించుకున్నాక మరమ్మతులు చేయాలని సూచించారు. తడిచేత్తో విద్యుత్ పరికరాలు, స్విచ్‌లను వేయవద్దన్నారు. న్యూట్రల్ వైర్, ఎర్త్ వైర్‌లను ఒకదానికి ఒకటి కలపవద్దన్నారు. గృహాలలో వినియోగించే ఇన్వర్టర్‌లకు సరైన గాలి, వెలుతురు ప్రసరించే విధంగా ఉండాలన్నారు. ఎప్పుడూ మరమ్మతులు, తనిఖీ కోసం ధృవీకరించిన ఎలక్ట్రీషియన్‌ను మాత్రమే సంప్రదించాలన్నారు. సమావేశంలో ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, ఆపరేషన్ డిప్యూటీ ఈఈలు, ఏఈలు ఉన్నారు.


నగరంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే నసీర్

ఏడాదిపాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి

- గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్
- వాసవీ నగర్‌లో 'సుపరిపాలనలో తొలి అడుగు'

గుంటూరు, జూలై 2(ఆంధ్రజ్యోతి): ఏడాది పాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధిని సాధించామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ చెప్పారు. నియోజకవర్గంలోని వాసవీ నగర్లో బుధవారం ఆయన ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్, చిట్టాబత్తిని చిట్టిబాబు, ఈస్ట్ అబ్జర్వర్ అంజనేయులు, మద్దిరాల మ్యాని, రాజా మాస్టర్‌తో కలిసి 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. నియోజక వర్గంలో ఆయన పార్టీ శ్రేణులతో కలిసి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల వద్దకు వెళ్లి తమ ఏడాది పాలనలో ప్రోగ్రెస్ గురించి అడిగి తెలుసుకున్నారు. ఏడాది ప్రోగ్రెస్ సూపర్ సక్సెస్ అయ్యిందని ప్రజలు కితాబిచ్చారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ చెప్పిన విధంగా సంక్షేమం, అభివృద్ధి పథకాలను అమలు చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని తెలిపారు. పింఛన్లు నాలుగు వేల రూపాయలు పెంచి ప్రతి నెల ఇంటికే తీసుకొచ్చి అందిస్తున్న ప్రభుత్వాన్ని అవ్వ తాతలు హృదయపూర్వకంగా ఆశీర్వదిస్తున్నారన్నారు. అనారోగ్యంతో ఏ ఒక్కరూ బాధపడకూడదనే కృతనిశ్చయంతో తూర్పు నియోజక వర్గంలో ఇప్పటివరకు సుమారు 200 మందికి రూ.2.50 కోట్ల సీఎం రిలీఫ్ ఫండ్ నిధుల ద్వారా భరోసా కల్పించామని తెలిపారు. ప్రతి వార్డులో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి వందల కోట్లతో పనులు చేపట్టామని వెల్లడించారు. ఇంటర్ విద్యను అభ్యసించే ఓ విద్యార్థిని ఎమ్మెల్యే నసీర్ వద్దకు వచ్చి తన చదువుకు సహకరించాలని కోరగా ఆమెకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

నిత్యం ప్రజల్లో ఉండాలి

తెలుగు గుంటూరులోని తన కార్యాలయంలో పార్టీ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే నసీర్ మాట్లాడారు. ప్రజల సమస్యలు వారి కంటే ముందే నాయకులు తన వద్దకు తీసుకురావాలని సూచించారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా స్థానిక నాయకులే గుర్తుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఎల్లావుల అశోక్, పోతురాజు సమత, ముప్పవరపు భారతి, వేమూరి జ్యోతి, వేములకొండ శ్రీనివాస్, రిహానా, అన్వర్, పిచ్చిరెడ్డి, శైలజ, జాబి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా అభివృద్ధి పరుగులు

- ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

గుంటూరు, జూలై 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాది కాలంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో అభివృద్ధిని పరుగులు పెట్టించారని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన అధ్యక్షతన తాడికొండ నియోజకవర్గ సుపరిపాలనలో తొలిఅడుగు సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కరపత్రాన్ని ఆయన విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఆర్థిక పరిస్థితులు, ఇబ్బందులు ఉన్నా అభివృద్ధి, పథకాలను ఆపకుండా అమలు చేయడం గొప్పవిషయమన్నారు. ఇప్పటికే రెండున్నర కోట్ల పై బడి సీఎం రిలీఫ్ ఫండ్ కింద బాధితులకు అందించామన్నారు. వైసీపీ అధినేత జగన్‌రెడ్డి చేసిన డ్రామాలను ప్రజలు గమనించి 11 సీట్లతో బుద్ధి చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో దామినేని శ్రీనివాసరావు, చిరుమామిళ్ల మధుసూదనరావు, ముత్తినేని రాజేష్, నక్కల అగస్టిన్, కంచర్ల శివరామయ్య, గుంటుపల్లి మధుసూదనరావు, కొత్తపల్లి కోటేశ్వరరావు, దూళిపాళ్ల ఏసుబాబు, మండవ నరసింహారావు, మల్లెపూడి రమేష్, ధనేకుల సుబ్బారావు, తలశిల ప్రసన్న కుమార్, తంతెటి సురేంద్ర, షేక్ అబ్దుల్ గని, షేక్ జానీ బేగం తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

డంపర్ బిన్ ఫ్రీ నగరంగా గుంటూరు

- ఎమ్మెల్యే రామాంజనేయులు, కమిషనర్

గుంటూరు కార్పొరేషన్, జులై 2 (ఆంధ్రజ్యోతి): డంపర్ బిన్ ఫ్రీ నగరంగా గుంటూరుని తీర్చిదిద్దేలా పారిశుధ్య పనుల్లో మెరుగుదల ఉండాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బి.రామాంజనేయులు, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నగరపాలక సంస్థ పరిధిలోని ప్రత్తిపాడు నియోజకవర్గ డివిజన్లలో పారిశుధ్య సమస్యలపై ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, కమిషనర్ పులి శ్రీనివాసులు ఇరువురు కలిసి కార్పొరేటర్లు, ప్రజారోగ్య కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లతో పారిశుధ్యం మెరుగు కోసం ప్రత్యేక సమీక్షా సమావేశం జరిగింది. ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ ప్రజారోగ్య విభాగ అవసరాల రీత్యా పుష్ కాట్స్, చెత్త తరలింపు వాహనాలను డివిజన్ ఇన్‌స్పెక్టర్ పరిధిలో ఉండేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ నగరం రోజు రోజుకి విస్తరిస్తుందని, అందుకు తగిన విధంగా ఆయా ప్రాంతాల్లో ప్రజలకు పారిశుధ్య పనులతో పాటు మెరుగైన మౌలిక వసతుల కల్పనకు బాధ్యత తీసుకోవాలన్నారు. నగరంతో పోలిస్తే కార్మికుల, వాహనాల సంఖ్య విలీన గ్రామాలకు, శివారు ప్రాంతాలకు అవసరమన్నారు. సమావేశంలో సిఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఎంహెచ్‌ఓలు(ఇన్‌చార్జి) రామారావు, సోమశేఖర్, ఎస్‌ఎస్ ఐజాక్, కార్పొరేటర్లు, ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు, పక్కన కమిషనర్ శ్రీనివాసులు తదితరులు

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఆర్‌వీఆర్ జేసీ విద్యార్థులకు ఉద్యోగాలు

గుంటూరు (విద్య), జూలై 2 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ ఔషధ సంస్థ దివిస్ లేబరేటరీస్ లిమిటెడ్ నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 9 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ఆర్‌వీఆర్ అండ్ జేసీ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ బుధవారం ప్రకటన పేర్కొన్నారు. వార్షిక వేతనం రూ.2.5 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలకు ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, కళాశాల అకడమిక్ అండ్ ఆర్ అండ్ డీ డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్‌వీ శ్రీనివాసరావు, వివిధ శాఖల విభాగాధిపతులు, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారులు సీహెచ్ శ్రీనివాసరావు, డాక్టర్ కె.సురేష్‌బాబు తదితరులు ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

నూరు శాతం మెరుగైన పారిశుధ్యం అందించాలి

- ఎమ్మెల్యే నసీర్, కమిషనర్ పులి శ్రీనివాసులు


సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే నసీర్, కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): నగరంలో మైక్రో ప్లాన్ మేరకు నూరుశాతం మెరుగైన పారిశుధ్యం అందించేలా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేస్తామని ఎమ్మెల్యే నసీర్ తెలిపారు. నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో బుధవారం కమిషనర్ పులి శ్రీనివాసులతో కలిసి, తూర్పు నియోజకవర్గంలో కార్పొరేటర్లు, ప్రజారోగ్య కార్యదర్శులు, ఇన్‌స్పెక్టర్లతో పారిశుధ్యం మెరుగు కోసం ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ రెండు రోజుల క్రితం ముఖ్యమంత్రి మునిసిపల్ శాఖపై సుదీర్ఘ సమీక్ష చేశారని, అందులో పలు అంశాల్లో గుంటూరు నగరపాలక సంస్థ రాష్ట్రంలో ముందుందన్నారు. నగరంలో ప్రతి 350 ఇళ్లకు ఒక మైక్రో ప్యాకెట్ ఉంటుందని, మైక్రో ప్యాకెట్ ఇద్దరు కార్మికులని కేటాయించామన్నారు. రాబోయే నెలరోజుల్లో కమాండ్ కంట్రోల్ రూమ్‌ని సిద్ధం చేసుకోనున్నాం, దాని ద్వారా ఏఐ టెక్నాలజీ, డ్రోన్ టెక్నాలజీ ఉపయోగించుకొని వర్కర్స్ హాజరు, క్షేత్ర స్థాయిలో పనితీరు, ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ చేస్తుంది, లేనిదీ కూడా కెమెరాల ద్వారా పర్యవేక్షణ చేస్తామన్నారు.

కమిషనర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం చెత్త మీద పన్ను విధించి, ప్రజలను ఇబ్బందికి గురి చేసిందని, ప్రస్తుతం పన్ను లేకుండా, చెత్త నుండి సంపద సృష్టించే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రోత్సహిస్తున్నారన్నారు. నగరంలో పారిశుధ్యాన్ని మెరుగుపరుచుకొని, పరిశుభ్రమైన వాతావరణాన్నితీసుకురావడానికి నగరపాలక సంస్థ శానిటరీ విభాగం ఇన్‌స్పెక్టర్స్‌తో పాటు కమిషనర్, సీఎంఓహెచ్, అలాగే శానిటరీ సిబ్బంది యావత్తుతో కలిసి కార్పొరేటర్స్‌తో ఒక ఇంటరాక్షన్ ప్రోగ్రామ్‌ని ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. సమావేశంలో సిఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఎంహెచ్‌ఓ(ఇన్‌చార్జి) జె.రామారావు, ఎస్‌ఎస్‌లు ఆయుబ్ ఖాన్, సాంబయ్య, కార్పొరేటర్లు, ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

అవుట్ ఫాల్ డ్రెయిన్ శుభ్రం చేయాలి

- కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : నగరపాలక సంస్థ పరిధిలో ప్రధానంగా శివారు ప్రాంతాల్లో అవుట్ ఫాల్ డ్రెయిన్లు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, అంతర్గత డ్రెయిన్‌లు మేజర్ డ్రెయిన్లలో కలిసే ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మెష్‌ల వద్ద నిలిచే వ్యర్థాలను తొలగించాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజనీరింగ్, ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. కమిషనర్ బుధవారం రెడ్డిపాలెం, విఘ్నేశనగర్, పోస్టల్ కాలనీ, వర్కర్స్ కాలనీ తదితర ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి, పారిశుధ్య పనులను డ్రోన్ ద్వారా పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ల వారీగా తమ పరిధిలో డ్రెయిన్ల శుభ్రంపై దృష్టి సారించాలన్నారు. అలాగే వార్డుల వారీగా ఖాళీ స్థలాల యజమానులను గుర్తించి, స్థలాలు శుభ్రం చేసుకోవాలని నోటీసులు ఇవ్వాలన్నారు. స్పందించని వారి స్థలాల్లో జీఎంసీ బోర్డులను ఏర్పాటు చేయాలని శానిటరీ ఇన్స్పెక్టర్లు, కార్యదర్శులను ఆదేశించారు. పర్యటనలో డీఈఈ రమేష్ బాబు, కార్పొరేటర్ కె.రంగారెడ్డి, ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.


రాధికకు వెండింగ్ ఐడీ కార్డుని అందజేస్తున్న ఎమ్మెల్యే నసీర్, కమిషనర్ తదితరులు

రాధికాకు వెండింగ్ ఐడీ కార్డు అందజేత

599				0.28	ప్రళయకావేరిజాలమ్మ (శ్రీనివాసులు)	398	398	461	395	
600				0.28	ప్రళయకావేరిబుజ్జమ్మ జ్జ (పోతయ్య)	398	398	461	395	
601				0.28	ప్రళయకావేరివెంకయ్య (పోతయ్య)	398	398	461	395	
602				0.09	అక్కంగారి రాములమ్మ (పోలయ్య)	398	398	461	395	
603				0.28	అక్కంగారి మారయ్య (జాలయ్య)	398	398	461	395	
604				0.28	ప్రళయకావేరిసరస్వతి (జాలయ్య)	398	398	461	395	
605				0.28	ప్రళయకావేరిసీతాదేవి (నాగేంద్ర బాబు)	398	398	461	395	
606				0.28	ప్రళయకావేరిఈశ్వరమ్మ (జయరామ్)	398	398	461	395	
607				0.28	ప్రళయకావేరిమంగమ్మ (గోవిందు)	398	398	461	395	
608				0.28	ప్రళయకావేరిపోలమ్మ (రమణయ్య)	398	398	461	395	
609				0.28	ప్రళయకావేరిజాలమ్మ (అగ్గేయ్య)	398	398	461	395	
610				0.28	గోవిందమ్మ (అగ్గేయ్య)	398	398	461	395	
611	398/ 3	8.49	అసైన్మెంట్	8.49	అక్కంగారి రాములమ్మ (పోలయ్య)	398	399	460	395	
612					ప్రళయకావేరిబుజ్జమ్మ జ్జ (పాపయ్య)	398	399	460	395	
613					ప్రళయకావేరివరలక్ష్మి (శ్రీను)	398	399	460	395	
614					ప్రళయకావేరిమంగమ్మ (రమణయ్య)	398	399	460	395	
615					ప్రళయకావేరినాగలక్ష్మి (నీలా బాబు)	398	399	460	395	
616					ప్రళయకావేరిలక్ష్మి (హరికృష్ణ)	398	399	460	395	
617					కాటంగారిలక్ష్మమ్మ (నాగేశ్వర రావు)	398	399	460	395	
618					ప్రళయకావేరిసుజాత (పోలయ్య)	398	399	460	395	
619					ప్రళయకావేరిజాలమ్మ (పెద్ద వెంకటేశ్వర్లు)	398	399	460	395	
620					అక్కంగారి మారయ్య (జాలయ్య)	398	399	460	395	
621					వాయిలబుజ్జమ్మ జ్జ (పొన్నుస్వా మి)	398	399	460	395	
622					ప్రళయకావేరిసరస్వతి (జాలయ్య)	398	399	460	395	
623					ప్రళయకావేరిసీతాదేవి (నాగేం ద్ర బాబు	398	399	460	395	
624					ప్రళయకావేరిఈశ్వరమ్మ (జయరామ్)	398	399	460	395	
625					ప్రళయకావేరిమంగమ్మ (గోవిందు)	398	399	460	395	
626					ప్రళయకావేరిపోలమ్మ (రమణయ్య)	398	399	460	395	
627					ప్రళయకావేరిజాలమ్మ (శ్రీనివాసులు)	398	399	460	395	
628					ప్రళయకావేరిగోవిందమ్మ (అగ్గెయ్య)	398	399	460	395	
629					ప్రళయకావేరిజయమ్మ (ఏడుకొండలు)	398	399	460	395	
630					ప్రళయకావేరిజాలమ్మ (శ్రీనివాసులు)	398	399	460	395	
631					ప్రళయకావేరిబుజ్జమ్మ (పోతయ్య)	398	399	460	395	
632					వాయిలవిజయమ్మ (సింహాద్రి)	398	399	460	395	
633					ప్రళయకావేరివెంకయ్య (పోతయ్య)	398	399	460	395	
634					అక్కంగారి రాములమ్మ (పోలయ్య)	398	399	460	395	
635					వాయిలబుజ్జమ్మ జ్జ (పొన్నుస్వా మి)	398	399	460	395	
636					వాయిలవిజయమ్మ (సింహాద్రి)	398	399	460	395	
637					ప్రళయకావేరిపాపమ్మ (పెద వీర రాఘవులు)	398	399	460	395	
638					ప్రళయకావేరిభవాని (శివకుమార్)	398	399	460	395	
639					వాయిలసుబ్బమ్మ (పాపయ్య)	398	399	460	395	
640					ప్రళయకావేరిబుజ్జమ్మ (పాపయ్య)	398	399	460	395	
641					ప్రళయకావేరిపద్మ (వెంకటేశ్వర్లు)	398	399	460	395	
642					వాయిలమల్లీస్వ ల్లీరమ్మ (మాధవ్)	398	399	460	395	
643					ప్రళయకావేరిపాపమ్మ (పెద వీర రాఘవులు)	398	399	460	395	
644					ప్రళయకావేరిపద్మ (వెంకటేశ్వర్లు)	398	399	460	395	
645					ప్రళయకావేరినాగలక్ష్మి (నీలా బాబు)	398	399	460	395	
646					ప్రళయకావేరిమంగమ్మ (రమణయ్య)	398	399	460	395	
647					ప్రళయకావేరివరలక్ష్మి (శ్రీను)	398	399	460	395	
648					ప్రళయకావేరిసుజాత (పోలయ్య)	398	399	460	395	
649					కాటంగారిలక్ష్మమ్మ (నాగేశ్వర రావు)	398	399	460	395	
650					ప్రళయకావేరిలక్ష్మి (హరికృష్ణ)	398	399	460	395	
651					ప్రళయకావేరిభవాని (శివకుమార్)	398	399	460	395	
652					వాయిలసుబ్బమ్మ (పాపయ్య)	398	399	460	395	
653					వాయిలమల్లీస్వ ల్లీరమ్మ (మాధవ్)	398	399	460	395	
654					ప్రళయకావేరిబుజ్జమ్మ జ్జ (పాపయ్య)	398	399	460	395	
655					ప్రళయకావేరిపద్మ (వెంకటేశ్వర్లు)	398	399	460	395	
656	399/ 2	5.65	అసైన్మెంట్	1.02	యల్లసిరిచంద్రమోహన్ (బాస్కరరావు)	399-1	403-1	458	401	
657				1.01	యల్లసిరిచంద్రమోహన్ (బాస్కరరావు)	399-1	403-1	458	401	
658				0.58	తుపాకులమాధవి (చినసుబ్బారావు)	399-1	403-1	458	401	
659				3.04	ఇతరులు	399-1	403-1	458	401	
660	401	6.22	అసైన్మెంట్	0.92	పర్రినిర్మల (మాలకోండయ్య)	400	402	399-2	395-2	
661				0.95	మర్రిరమణమ్మ (సుబ్బులు)	400	402	399-2	395-2	
662				1.05	పర్రిఉసా (వెంకటేశ్వర్లు)	400	402	399-2	395-2	
663				1.04	పోన్నాటికోటేశ్వరమ్మ (వీరాస్వామి)	400	402	399-2	395-2	
664				1.11	కందుకూరునిర్మల (రామయ్య)	400	402	399-2	395-2	
665				1.11	పోన్నాతినాగశిరోమణి (శ్రీనివాసులు)	400	402	399-2	395-2	
666				0.04	ఇతరులు	400	402	399-2	395-2	
667	403 / 1	5.66	అసైన్మెంట్	5.66	ఇతరులు	399-2	403-2	457	402	
668					ఇతరులు	399-2	403-2	457	402	
669					మిరియంమాలకొండయ్య (పేరయ్య)	399-2	403-2	457	402	
670					ఇతరులు	399-2	403-2	457	402	
671					ఇతరులు	399-2	403-2	457	402	
672					ఇతరులు	399-2	403-2	457	402	
673					ఇతరులు	399-2	403-2	457	402	
674	403/ 2	5.52	అసైన్మెంట్	1	పామంజిలక్ష్మయ్య (యానాది)	402	403-3	455	182	
675				1	నంబూరుసుబ్బయ్య (చెంచయ్య)	402	403-3	455	182	
676				1	ఉప్పాలవెంకయ్య (శ్రీ)	402	403-3	455	182	
677				1.06	కత్తివెంకట రామయ్య (శ్రీ)	402	403-3	455	182	
678				1.01	గంధళ్ళముత్యాలు (సుబ్బయ్య)	402	403-3	455	182	
679				0.45	తికవరపుశివరామిరెడ్డి (పుల్లారెడ్డి)	402	403-3	455	182	
680	403/ 3	6.8	అసైన్మెంట్	0.6	తికవరపుశివరామిరెడ్డి (పుల్లారెడ్డి)	403-2	406	453	182	
681				1.04	వాయిలఓరుగల్లు (రామస్వామి)	403-2	406	453	182	
682				1	యల్లంగారిపరుశురాముడు (శ్రీ)	403-2	406	453	182	
683				1	ప్రళయకావేరిచిన్నగోవిందు (రోశయ్య)	403-2	406	453	182	
684				1	వాయిలపోలయ్య (రామ స్వామి)	403-2	406	453	182	
685				1.02	యల్లంగారిమహేశ్వరరావు (పార్వతయ్య)	403-2	406	453	182	
686				1.14	చల్లాచిన్నకొండయ్య (పెద కొండయ్య)	403-2	406	453	182	
687	406	4.59	అసైన్మెంట్	0.94	బసంగారిఅరేల్లామ్మ	405	427	408	182	
688				0.95	బసంగారిపోలమ్మ	405	427	408	182	
689				0.9	బసంగారిగోవిందమ్మ (బాలరాజు)	405	427	408	182	
690				0.9	బసంగారిరమణమ్మ (శ్రీ)	405	427	408	182	
691				0.9	బసంగారిరోశమ్మ (రోశయ్య)	405	427	408	182	
692	409	0.61	అసైన్మెంట్	0.61	వాయలలక్ష్మమ్మ (మునెయ్య)	460	412	415	408	
693	413	1.08	అసైన్మెంట్	0.54	చల్లాచిన్నకోండయ్య (పెద కొండయ్య)	412	414	415	412	
694				0.54	చల్లామస్తాన్ (చిన కొండయ్య)	412	414	415	412	
695	415	6.19	అసైన్మెంట్	6.19	గోళ్ళమూడికిష్టారెడ్డి (సుబ్బారెడ్డి)	473	414	474	409	
696					గోళ్ళమూడికిష్టారెడ్డి (సుబ్బారెడ్డి)	473	414	474	409	
697					ఇతరులు	473	414	474	409	
698					వాయిలలక్ష్మమ్మ (మునెయ్య)	473	414	474	409	
699					యల్లంగారిరాజారావు (అంకయ్య)	473	414	474	409	
700	417	5.42	అసైన్మెంట్	0.15	ఇతరులు	474	480	481	416	
701				1	యేటూరుప్రసాద్ (లేట్ నరశింహం)	474	480	481	416	
702				1.19	సన్నీబోయినవెంకటేశ్వర్లు	474	480	481	416	
703				3.08	ఇతరులు	474	480	481	416	
704	419	0.69	అసైన్మెంట్	0.69	వాయిలసుమ (మస్తాన్)	43	479	418	420	
705	420	3.22	అసైన్మెంట్	0.8	యెయ్యాలమీరా సాహెబ్ (కాశింసాహేబ్)	416	479	419	421	
706				1	యల్లంటీరామణమ్మ (రామ్మూర్తి)	416	479	419	421	
707				1.06	వాయిలసుమ (మస్తాన్)	416	479	419	421	
708				0.36	ఇతరులు	416	479	419	421	
709	450	6	అసైన్మెంట్	0.33	వాయిలముత్యాలమ్మ (ఏసురత్నం)	452	408	473	457	
710				0.33	వాయిలమంగమ్మ (వెంకటేశ్వర్లు)	452	408	473	457	
711				0.32	ఆవులకనకమ్మ (తిరుపతి)	452	408	473	457	
712				0.34	నాగన్నగారిజయమ్మ (రూబేను)	452	408	473	457	
713				0.35	కాటంగారినరసమ్మ (తాతయ్య)	452	408	473	457	
714				0.34	ఆవులసుబ్బలక్ష్మి (సోమయ్య)	452	408	473	457	
715				0.33	కాటంగారిజాలమ్మ (మల్లిఖాల్లిర్జున)	452	408	473	457	
716				0.33	కాటంగారికౌసల్య (పోలయ్య)	452	408	473	457	
717				0.13	కాటంగారికౌసల్య (పోలయ్య)	452	408	473	457	
718				0.11	వాయిలక్రుపావతి (రాములు)	452	408	473	457	
719				0.32	ఆవులఉమ (హరి)	452	408	473	457	
720				0.24	వాయిలక్రుపావతి (రాములు)	452	408	473	457	
721				0.33	కాటంగారిపద్మ (పొట్టెయ్య	452	408	473	457	
722				0.24	ఆవులశ్యామలాదేవి (జనార్ధన్	452	408	473	457	
723				0.34	ఆవులఅంజమ్మ (నంది కుమార్)	452	408	473	457	
724				0.09	ఆవులశ్యామలాదేవి (జనార్ధన్	452	408	473	457	
725				0.34	ఆవులరాములమ్మ (తాతయ్య)	452	408	473	457	
726				0.12	ఆవులజయమ్మ (నరసింహం)	452	408	473	457	
727				0.34	ఆవులరాజేశ్వరి (నందకుమార్)	452	408	473	457	
728				0.21	ఆవులజయమ్మ (నరసింహం)	452	408	473	457	
729				0.34	నాగన్నగారిమరియమ్మ (ప్రభుదాసు)	452	408	473	457	
730				0.18	కాటంగారికౌసల్య (పోలయ్య)	452	408	473	457	
731	451	4.72	అసైన్మెంట్	0.34	ప్రళయకావేరిరాములమ్మ (తిరుపతి)	452	408	450	404	
732				0.34	నాగన్నగారిజానకమ్మ (పోలయ్య)	452	408	450	404	
733				0.18	ఆవులకనకమ్మ (రోశయ్య)	452	408	450	404	
734				0.34	ఆవులగోవిందమ్మ (పెంచలయ్య)	452	408	450	404	
735				0.15	ఆవులకనకమ్మ (రోశయ్య)	452	408	450	404	
736				0.07	వాయిలపోలమ్మ (రామక్రిష్ణ)	452	408	450	404	
737				0.34	వాయిలవరమ్మ (జాలయ్య)	452	408	450	404	
738				0.26	వాయిలపోలమ్మ (రామక్రిష్ణ)ష్ణ	452	408	450	404	
739				0.34	వాయిలవరమ్మ (జాలయ్య)	452	408	450	404	
740				0.33	ఆవులఅంకమ్మ (రామయ్య)	452	408	450	404	
741				0.34	ఆవులసుజాత (ఈశ్వరయ్య)	452	408	450	404	
742				0.34	ఆవులరాణేమ్మ (పెంచలయ్య)	452	408	450	404	
743				0.34	ఆవులపద్మ (బాబు)	452	408	450	404	
744				0.34	ఆవులఅన్నమ్మ (పప్పు)	452	408	450	404	
745				0.27	ప్రళయకావేరిమంగమ్మ (రాంబాబు)	452	408	450	404	
746				0.34	ఆవులరమణమ్మ (రాజయ్య)	452	408	450	404	
747				0.06	ప్రళయకావేరిమంగమ్మ (రాంబాబు)	452	408	450	404	

(మిగతా 16వ పేజీలో)

(15వ పేజీ తరువాయి)

748	455	10.17	అసైన్మెంట్	1.04	ఇతరులు	456	454	470	403	
749				0.92	ఇతరులు	456	454	470	403	
750				0.92	ఇతరులు	456	454	470	403	
751				0.9	ఇతరులు	456	454	470	403	
752				0.91	ఇతరులు	456	454	470	403	
753				0.91	ఇతరులు	456	454	470	403	
754				0.91	ఇతరులు	456	454	470	403	
755				0.91	పర్రిచిన్న నరసింహం (కొండయ్య)	456	454	470	403	
756				0.91	ఇతరులు	456	454	470	403	
757				0.92	ఇతరులు	456	454	470	403	
758				0.92	ఇతరులు	456	454	470	403	
759	457	9.78	అసైన్మెంట్	0.4	ఆలాతిరుపాలు (శ్రీ)	458	455	456	403-1	
760				0.54	ఆలాతిరుపాలు (శ్రీ)	458	455	456	403-1	
761				0.96	ఇతరులు	458	455	456	403-1	
762				0.96	ఇతరులు	458	455	456	403-1	
763				0.33	పర్రిరమణయ్య (కొండయ్య	458	455	456	403-1	
764				0.71	పర్రిరమణయ్య (కొండయ్య	458	455	456	403-1	
765				0.96	పొన్నతిఆదినారాయణ	458	455	456	403-1	
766				0.96	బొర్రానాగేశ్వర రావు	458	455	456	403-1	
767				0.31	బొర్రావెంకట్రావు (రామస్వామి)	458	455	456	403-1	
768				0.65	బొర్రావెంకట్రావు (రామస్వామి)	458	455	456	403-1	
769				0.94	పర్రిపుష్పావతి (నారాయణ)	458	455	456	403-1	
770				0.94	కొవ్వూరుఓంకారయ్య (శ్రీ)	458	455	456	403-1	
771				0.91	ఇతరులు					
772	458	6.93	అసైన్మెంట్	0.96	పొన్నాతిమొగ్గయ్య (పాపయ్య)	467	457	468	399-2	
773				0.96	వేమూరిసత్యవతి (వైశ్యాం)	467	457	468	399-2	
774				0.99	పొన్నాతిఆంజనేయులు (పాపయ్య)	467	457	468	399-2	
775				0.99	చేజర్లభద్రయ్య (సుబ్బయ్య	467	457	468	399-2	
776				0.99	అట్లరామలక్ష్మమ్మ (కొండయ్య)	467	457	468	399-2	
777				0.96	పర్రిదుర్గయ్య (వెంగయ్య)	467	457	468	399-2	
778				1.08	ఇతరులు (అగ్గెయ్య)					
779	461	3.98	అసైన్మెంట్	1.32	పొన్నతిశ్రీలక్ష్మి (చలపతిరావు)	462	460	464	398	
780				2.66	పర్వతరెడ్డినాగ సుశీలమ్మ (వెంకటరమణారెడ్డి)	462	460	464	398	
781	462	7.34	అసైన్మెంట్	0.66	పర్వతరెడ్డినాగ సుశీలమ్మ (వెంకటరమణారెడ్డి)	474	461	463	399	
782				3.34	పర్వతరెడ్డిశ్రీనివాసులు రెడ్డి (వెంకటరమణారెడ్డి)	474	461	463	399	
783				3.34	పర్వతరెడ్డివెంకటక్రిష్ణారెడ్డి (వెంకటరమణారెడ్డి)	474	461	463	399	
784	463	7.2	అసైన్మెంట్	7.2	వేమూరిపద్మావతి (సుబ్బారావు లేట్)	బంగాళ ఖాతం	464	494	462	
785					మారంరెడ్డివెంకటక్రిష్ణారెడ్డి (రామలింగారెడ్డి)	బంగాళ ఖాతం	464	494	462	
786					వాయిలపుల్లయ్య (శ్రీ)	బంగాళ ఖాతం	464	494	462	
787					తిక్కవరపువేణుగోపాల్ రెడ్డి (లేట్ నరసారెడ్డి)	బంగాళ ఖాతం	464	494	462	
788	464	5.7	అసైన్మెంట్	0.73	వేమూరిపద్మావతి (సుబ్బారావు లేట్)	463	465	493	467	
789				2.5	కొండూరిజలమ్మ (బాబురావు)	463	465	493	467	
790				2.47	కొండూరిభవాని (శ్రీనివాసరావు)	463	465	493	467	
791	470	6.05	అసైన్మెంట్	6.05	ఇతరులు	469	471	486	455	
792	471	7.47	అసైన్మెంట్	1	ఎందేటివెంకయ్య (శ్రీ)	470	472	485	454	
793				0.34	ప్రళయకావేరినరసమ్మ (ఏడుకొండలు)	470	472	485	454	
794				0.34	ఆవులబుజ్జమ్మ (రామక్రిష్ణ)	470	472	485	454	
795				0.34	ఆవులమంగమ్మ (సోమయ్య)	470	472	485	454	
796				0.34	ఆవులరమణమ్మ (బాబు)	470	472	485	454	
797				0.34	వాయిలపోలమ్మ (ఈశ్వరయ్య)	470	472	485	454	
798				0.34	వాయిలతిరుపతమ్మ (శ్రీను)	470	472	485	454	
799				0.34	కాటంగారివెంకటమ్మ (బాబు)	470	472	485	454	
800				0.34	కాటంగారిజయలక్ష్మి (శ్రీను	470	472	485	454	
801				0.34	కాటంగారిరమాదేవి (రాజాబాబు)	470	472	485	454	
802				0.34	వాయిలలక్ష్మమ్మ (కోటేశ్వరరావు)	470	472	485	454	
803				0.34	ఆవులసుజాత (ఏడుకొండలు)	470	472	485	454	
804				0.34	కొమరినరసమ్మ (ప్రసాద్)	470	472	485	454	
805				0.34	ఆవులలక్ష్మి (గోవిందు)	470	472	485	454	
806				0.34	ఆవులపోలమ్మ (తోటయ్య)	470	472	485	454	
807				0.34	ఆవులమమత (అభిమన్యు)	470	472	485	454	
808				0.34	ఆవులరమణమ్మ (రమేష్)	470	472	485	454	
809				0.34	ఆవులకళ్యాణి (రాములు)	470	472	485	454	
810				0.34	ఆవులశాంతమ్మ (పెంచలయ్య)	470	472	485	454	
811				0.34	ఆవులజయమ్మ (ప్రసాద్)	470	472	485	454	
812				0.01	ఇతరులు	470	472	485	454	
813	479	6.5	అసైన్మెంట్	1	కొండూరునరసింహం (వెంకటేశ్వర్లు)	421	428	480	422	
814				1	అట్లసుబ్బయ్య (శ్రీ)	421	428	480	422	
815				1	అట్లచెంచయ్య (శ్రీ)	421	428	480	422	
816				1	ఆవులయాదగిరి (శ్రీ)	421	428	480	422	
817				1.4	నాగన్నగారిదామిని (శివాజి)	421	428	480	422	
818				1.1	ఇతరులు	421	428	480	422	
819	480	6.18	అసైన్మెంట్	1	ఇతరులు	417	478	441	479	
820				1	ఇతరులు	417	478	441	479	
821				1	ఇతరులు	417	478	441	479	
822				1	ఇతరులు	417	478	441	479	
823				2.18	ఇతరులు	417	478	441	479	
824	489	5.9	అసైన్మెంట్	5.9	జూపూడిమాల్యాద్రి (నారాయణ)	490	488	501	488	
825					వాయిలపెదపోలయ్య (పోలయ్య)	490	488	501	488	
826					నాగన్నగారివరలక్ష్మి (ప్రసాద్)	490	488	501	488	
827					ఇతరులు	490	488	501	488	
828					ఇతరులు	490	488	501	488	
829					నాగన్నగారిసంజీవ రావు (వెంకటేశ్వర్లు)	490	488	501	488	
830					వాయిలపెదపోలయ్య (పోలయ్య)	490	488	501	488	
831	490	6.01	అసైన్మెంట్	2.34	బొమ్మిరెడ్డిరమణమ్మ (వెంకారెడ్డి)	499	489	500	467	
832				2.66	నాగన్నగారిభాగ్యలక్ష్మి (రమణయ్య)	499	489	500	467	
833				0.64	నాగన్నగారిసంజీవ రావు (వెంకటేశ్వర్లు)	499	489	500	467	
834				0.37	ఇతరులు	499	489	500	467	
835	491	6.85	అసైన్మెంట్	1.7	మర్రిఅంజయ్య (రోశయ్య)	492	490	499	466	
836				0.67	మర్రిరవి (వెంకయ్య)	492	490	499	466	
837				4.48	వాయిలబుజ్జమ్మ (యాదగిరి)	492	490	499	466	
838	492	9.4	అసైన్మెంట్	6.26	సామాంజఅంకయ్య (యానాది)	493	491	497	465	
839					ప్రళయకావేరిలక్షమయ్య (సోమయ్య)	493	491	497	465	
840					పామంజిపద్మా (బాబు)	493	491	497	465	
841					మర్రిసంపూర్ణమ్మ (అంజయ్య)	493	491	497	465	
842					కాటంగారి మంగమ్మ (తిరుపతి)	493	491	497	465	
843	509	6.15	అసైన్మెంట్	2.68	మర్రిశేషమ్మ (పొలమ్మ)	506	510	1555	508	
844	517	5.65	అసైన్మెంట్	1.13	ప్రళయకావేరిముత్తాతయ్య (శ్రీ)	516	518	1250	444	
845					ప్రళయకావేరిముత్తాతయ్య (శ్రీ)	516	518	1250	444	
846	520	4.03	అసైన్మెంట్	4.03	ప్రళయకావేరిఆరుణమ్మ (తాతయ్య)	519	521	780	440	
847					ఇతరులు	519	521	780	440	
848					ఇతరులు	519	521	780	440	
849					ఇతరులు					
850	522	6.21	అసైన్మెంట్	0.32	యల్లంగారిశాంతమ్మ (మహేశ్వరరావు)	499	489	500	467	
851				0.31	ఇతరులు	499	489	500	467	
852				0.31	ఉప్పాలవరలక్ష్మమ్మ (మనోహర్)	499	489	500	467	
853				0.31	ఉప్పాలవరలక్ష్మమ్మ (మనోహర్)	499	489	500	467	
854				0.31	ఇతరులు	499	489	500	467	
855				0.3	వాయిలమంగమ్మ (వెంకటేశ్వర్లు)	499	489	500	467	
856				0.31	వాయిలనరసమ్మ (పోలయ్య)	499	489	500	467	
857				0.3	వాయిలమంగమ్మ (ఒరగల్లు)	499	489	500	467	
858				0.3	వాయిలగోవిందు (చిన సోమయ్య)	499	489	500	467	
859				0.3	వాయిలగోవిందు (చిన సోమయ్య)	499	489	500	467	
860				0.3	ప్రళయకావేరిమంగమ్మ (పోలయ్య)	499	489	500	467	
861				0.32	యల్లంగారిశాంతమ్మ (మహేశ్వరరావు)	499	489	500	467	
862				0.3	వాయిలపోలమ్మ (రాములు)	499	489	500	467	
863				0.3	వాయిలపోలమ్మ (రాములు)	499	489	500	467	
864				0.3	వాయిలతిరుపతమ్మ (దాసు)	499	489	500	467	
865				0.27	ఇతరులు	499	489	500	467	
866				0.27	యల్లంగారిశాంతమ్మ (మహేశ్వరరావు)	499	489	500	467	
867				0.27	పంతంగియశోద (లక్ష్మి నారాయణ)	499	489	500	467	
868				0.27	ఇతరులు	499	489	500	467	
869				0.27	ఉప్పాలవరలక్ష్మమ్మ (మనోహర్)	499	489	500	467	
870				0.27	పంతంగియశోద (లక్ష్మి నారాయణ)	499	489	500	467	
871	523	5.04	అసైన్మెంట్	0.3	కొండూరుకనకమ్మ (చిన్న పోలయ్య)	499	489	500	467	
872				0.31	ప్రళయకావేరిఅరుణమ్మ (పోతయ్య)	499	489	500	467	
873				0.31	ఆవులపోలమ్మ (ప్రభుదాసు)	499	489	500	467	
874				0.3	ప్రళయకావేరిమంగమ్మ (సోమయ్య)	499	489	500	467	
875				0.3	ప్రళయకావేరిఅరుణమ్మ (పోతయ్య)	499	489	500	467	
876				0.19	ప్రళయకావేరిలక్ష్మి (భాస్కర్)	499	489	500	467	
877				0.19	పామంజిమంగమ్మ (వెంకటేశ్వర్లు)	499	489	500	467	
878				0.14	ప్రళయకావేరినరసమ్మ (నరసింహ)	499	489	500	467	
879				0.3	కొండూరుకనకమ్మ (చిన్న పోలయ్య)	499	489	500	467	
880				0.31	కొండూరుకనకమ్మ (చిన్న పోలయ్య)	499	489	500	467	
881				0.26	కొండూరుసుశీలమ్మ (గోవిందు)	499	489	500	467	
882				0.31	ప్రళయకావేరితిరుపతమ్మ (యర్రయ్య)	499	489	500	467	
883				0.31	ప్రళయకావేరిజ్యోతి కుమారి (హరిప్రసాద్)	499	489	500	467	
884				0.31	పాటూరిమారెమ్మ (చిరంజీవి)	499	489	500	467	
885				0.31	చిన్నింగారిమల్లీశ్వరి (శ్రీను)	499	489	500	467	
886				0.31	ప్రళయకావేరిభూదేవమ్మ (జలయ్య)	499	489	500	467	
887				0.58	ఇతరులు	499	489	500	467	
888	524	5.74	అసైన్మెంట్	0.21	కుర్రుమంగమ్మ (నరసింహం)	499	489	500	467	
889				0.3	యల్లంగారిహైమావతి (వెల్లులు)	499	489	500	467	
890				0.31	ఆవులబుజ్జమ్మ (సోమయ్య)	499	489	500	467	
891				0.31	ఆవులబుజ్జమ్మ (సోమయ్య)	499	489	500	467	
892				0.3	ఆవులనరసింహం (సోమయ్య)	499	489	500	467	
893				0.31	సామంజిరామయ్యు (చిన్న సోమయ్య)	499	489	500	467	
894				0.31	సామంజిరామయ్యు (చిన్న సోమయ్య)	499	489	500	467	
895				0.99	ఇతరులు	499	489	500	467	
896				0.35	నాగన్నగారిఅగ్గెమ్మ (వెంకటేశ్వర్లు)	499	489	500	467	
897				0.4	ప్రళయకావేరిమంగమ్మ (బాబు)	499	489	500	467	
898				0.31	ప్రళయకావేరిఅరుణమ్మ (బాబు)	499	489	500	467	
899				0.04	ప్రళయకావేరిఅరుణమ్మ (బాబు)	499	489	500	467	
900				0.15	కాటంగారిలక్ష్మమ్మ (తాతయ్య)	499	489	500	467	
901				0.31	కాటంగారిలక్ష్మమ్మ (తాతయ్య)	499	489	500	467	
902				0.22	కుర్రుపొలమ్మ (పోలయ్య)	499	489	500	467	
903				0.3	కొండూరుసుశీలమ్మ (గోవిందు)	499	489	500	467	
904				0.31	యల్లంగారిపోలమ్మ (చిన నాగూరు)	499	489	500	467	
905				0.31	యల్లంగారిపోలమ్మ (చిన నాగూరు)	499	489	500	467	
906	525	6.84	అసైన్మెంట్	0.31	ప్రళయకావేరిపోలమ్మ (గోవిందు)	499	489	500	467	
907				0.36	యల్లంగారిలక్ష్మమ్మ (ఏడుకొండలు)	499	489	500	467	
908				0.36	యల్లంగారిలక్ష్మమ్మ (ఏడుకొండలు)	499	489	500	467	
909				0.35	కాటంగారిగోవిందమ్మ (సంజీవ రావు)	499	489	500	467	
910				0.32	వాయిలముత్యాలమ్మ (పార్వతయ్య)	499	489	500	467	
911				0.36	వాయిలముత్యాలమ్మ (పార్వతయ్య)	499	489	500	467	
912				0.36	ప్రళయకావేరిమస్తానమ్మ (శ్రీను)	499	489	500	467	
913				0.35	ప్రళయకావేరిమస్తానమ్మ (శ్రీను)	499	489	500	467	
914				0.3	పామంజిపొట్టెయ్య (బుజ్జయ్య)	499	489	500	467	
915				0.15	ఇతరులు	499	489	500	467	
916				0.2	ఇతరులు	499	489	500	467	
917				0.33	ఆవులకృష్ణమ్మ (తాతయ్య	499	489	500	467	
918				0.35	పామంజిపొట్టెయ్య (బుజ్జయ్య)	499	489	500	467	
919				0.27	ప్రళయకావేరిమస్తానమ్మ (శ్రీను)	499	489	500	467	
920				0.34	ఆవులపద్మ (గోవిందు)	499	489	500	467	
921				0.31	ప్రళయకావేరిలక్ష్మమ్మ (వెంకటేశ్వర్లు)	499	489	500	467	
922				0.35	ప్రళయకావేరిపద్మ (వెంకయ్య)	499	489	500	467	
923				0.36	ప్రళయకావేరిలక్ష్మమ్మ (వెంకటేశ్వర్లు)	499	489	500	467	
924				0.38	ప్రళయకావేరివెంకటేశ్వర్లు (సోమయ్య)	499	489	500	467	
925				0.37	కాటంగారిపాపమ్మ (నాగరాజు)	499	489	500	467	
926				0.36	కాటంగారిపాపమ్మ (నాగరాజు)	499	489	500	467	
927	526	6.43	అసైన్మెంట్	0.17	ప్రళయకావేరిలక్ష్మి (భాస్కర్)	499	489	500	467	
928				0.32	ఇతరులు	499	489	500	467	
929				0.32	ఇతరులు	499	489	500	467	
930				0.32	కాటంగారిమంగమ్మ (తిరుపతి)	499	489	500	467	
931				0.32	కాటంగారిగోవిందమ్మ (సుబ్బారావు)	499	489	500	467	
932				0.32	ప్రళయకావేరిలక్ష్మి గిరిజ (నరసింహం)	499	489	500	467	
933				0.32	ప్రళయకావేరితిరుపతమ్మ (వెంకటేశ్వర్లు)	499	489	500	467	
934				0.32	ప్రళయకావేరితిరుపతమ్మ (వెంకటేశ్వర్లు)	499	489	500	467	
935				0.33	ప్రళయకావేరినరసమ్మ (నరసింహ)	499	489	500	467	
936				0.35	ప్రళయకావేరిరాహేలమ్మ (తాతయ్య)	499	489	500	467	
937				0.33	ప్రళయకావేరిమేరి (తిమోతి)	499	489	500	467	
938				0.2	పామంజిమంగమ్మ (వెంకటేశ్వర్లు)	499	489	500	467	

(మిగతా 17వ పేజీలో)

అగ్రి ఇన్‌పుట్స్ లైసెన్సింగ్‌కు అజైల్ యాప్

అమరావతి, జూలై2 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖ కొత్తగా రూపొందించిన అగ్రి ఇన్‌పుట్ లైసెన్స్ ఇంజిన్ (అజైల్) యాప్‌ను ఆశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీ రాజశేఖర్ బుధవారం అమరావతి సచివాలయంలో ఆవిష్కరించారు. పల్నాడు జిల్లాకు చెందిన మహిళా డీలర్‌కు ఎరువుల తయారీకి అవసరమైన తొలి డిజిటల్ లైసెన్స్ జారీ చేశారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ... విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు వంటి ఇన్‌పుట్స్ వ్యాపారానికి సంబంధించిన లైసెన్స్‌ల కోసం అజైల్ ప్లాట్ ఫాం తప్పనిసరిగా వినియోగించాలని వ్యాపారులకు సూచించారు. ఇది సెంట్రలైజ్డ్ డిజిటల్ ఇన్‌పుట్ మేనేజ్‌మెంట్ సిస్టం అని వివరించారు. వ్యవసాయ శాఖ డైరెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ... ఈయాప్ ద్వారా అందుబాటులోకి వచ్చే పర్యవేక్షక కార్యకలాపాలను, వ్యాపారులు, రైతులకు అందుబాటులోకి వచ్చే సేవలను తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు, రైతు సాధికార సంస్థ కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, వ్యవసాయ, ఉద్యాన వర్సిటీల వీసీలు శారదా జయలక్ష్మి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆరా మస్తాన్ వాంగ్మూలం నమోదు చేసిన సిట్

- రేవంత్, కొండల్‌రెడ్డి, చామలతో ఆయన మాట్లాడిన కాల్స్ ట్యాపింగ్
- ఏపీ నాయకులతో మస్తాన్ మాట్లాడిన కాల్స్ కూడా

హైదరాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఫోన్‌ట్యాపింగ్‌పై విచారణకు ఏర్పాటైన సిట్ అధికారులు బుధవారం రాజకీయ విశ్లేషకుడు ఆరా మస్తాన్ వాంగ్మూలాన్ని నమోదు చేశారు. నాటి తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఆయన సోదరుడు కొండల్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో మస్తాన్ మాట్లాడిన కాల్స్‌ను ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలోని టీం ట్యాపింగ్ ద్వారా రికార్డు చేసిందన్న విషయాన్ని ఆయనకు ఆధారాలతో చూపించారు. 2023 నవంబరులో మస్తాన్ తెలంగాణ కాంగ్రెస్ నాయకులతో మాట్లాడిన ప్రతి ఫోన్ కాల్‌ను ట్యాపింగ్ చేసి సంభాషణలను ప్రభాకర్‌రావు బృందం రికార్డు చేశారు. సిట్ అధికారులు ఆరా మస్తాన్‌కు ఆయన ఫోన్ ట్యాపింగ్ డేటాను చూపించడంతో విభ్రాంతికి గురైనట్లు తెలుస్తోంది. 2020 నుంచి మస్తాన్ ఫోన్‌ను ఎస్ఐబీ అధికారులు ట్యాపింగ్‌లో పెట్టారని, 2023లో మావోయిస్టుల సమాచారం కోసమంటూ ఆయన ఫోన్ నెంబర్ ట్యాపింగ్‌కు రివ్యూ కమిటీ అనుమతి తెచ్చుకున్నారని సమాచారం. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ పార్టీల నాయకులతో మస్తాన్ మాట్లాడిన, ఆయనకు వచ్చిన ఇన్‌కమింగ్ కాల్స్‌ను రికార్డు చేశారు. భార్యాపిల్లలతో మాట్లాడిన మాటలు కూడా రికార్డు చేయడం శోచనీయమని విచారణ తర్వాత మస్తాన్ మీడియాతో మాట్లాడుతూ అన్నారు. సిట్ అధికారులు తనకు చాలా డేటాతో పాటు రికార్డింగ్‌లు చూపించారని, ఇది వ్యక్తిగత స్వేచ్ఛకు అత్యంత ప్రమాదకరమని చెప్పారు.

(16వ పేజీ తరువాయి)

939				0.33	ప్రళయకావేరిరమణమ్మ (వెంకటేశ్వర్లు)	499	489	500	467	
940				0.33	ప్రళయకావేరిపోలమ్మ (తాతయ్యా)	499	489	500	467	
941				0.22	ప్రళయకావేరిపద్మ (వెంకయ్యా)	499	489	500	467	
942				0.32	ప్రళయకావేరిగోవిందమ్మ (జ్ఞానయ్యా)	499	489	500	467	
943				0.32	ఇతరులు	499	489	500	467	
944				0.32	ప్రళయకావేరిగోవిందమ్మ (జ్ఞానయ్యా)	499	489	500	467	
945				0.32	కాటంగారిలక్ష్మమ్మ (తాతయ్యా)	499	489	500	467	
946				0.32	ఇతరులు	499	489	500	467	
947				0.01	ఇతరులు	499	489	500	467	
948	527	6.35	అసైన్మెంట్	0.91	వాయిలవెంకటేశ్వర్లు (చినసోమయ్యా)	528	తుమ్మలపెంట	434	22	
949				0.67	ప్రళయకావేరిచిన్నవెంకటేశ్వర్లు (శ్రీ)	528	తుమ్మలపెంట	434	22	
950				0.78	వాయిలవెంకటేశ్వర్లు (చినసోమయ్యా)	528	తుమ్మలపెంట	434	22	
951				0.55	ప్రళయకావేరివెంకటేశ్వర్లు (రామయ్యా)	528	తుమ్మలపెంట	434	22	
952				0.56	సామంజరామయ్యా (సోమయ్యా)	528	తుమ్మలపెంట	434	22	
953				0.56	వాయివరామయ్యా (శ్రీ)	528	తుమ్మలపెంట	434	22	
954				0.51	వాయిలలక్ష్మమ్మ (సోమయ్యా)	528	తుమ్మలపెంట	434	22	
955				0.58	పామంజిసోమయ్యా (శ్రీ)	528	తుమ్మలపెంట	434	22	
956				0.58	వాయిలసుబ్బయ్యా (శ్రీ)	528	తుమ్మలపెంట	434	22	
957				0.59	ప్రళయకావేరిరామయ్య (శ్రీ)	528	తుమ్మలపెంట	434	22	
958				0.06	ఇతరులు	528	తుమ్మలపెంట	434	22	
959	528	5.58	అసైన్మెంట్	5.58	కాటంగారిరామయ్యా (పెద సుబ్బయ్యా)	528	తుమ్మలపెంట	434	22	
960					ప్రళయకావేరిపార్వతమ్మ (శ్రీ)	528	తుమ్మలపెంట	434	22	
961					ప్రళయకావేరిసుబ్బయ్య (పార్వతయ్యా)	528	తుమ్మలపెంట	434	22	
962					వాయులజయమ్మ (శ్రీ)	528	తుమ్మలపెంట	434	22	
963					కుర్రుగోవిందమ్మ (శ్రీ)	528	తుమ్మలపెంట	434	22	
964					గంగన్నగారిగోవిందమ్మ (యాదగిరి)	528	తుమ్మలపెంట	434	22	
965	529	5.4	అసైన్మెంట్	5.25	ఇతరులు	27	22	528	530	
966					ప్రళయకావేరిగోవిందమ్మ (పెద్దవీరరాఘవులు)	27	22	528	530	
967					ప్రళయకారిగోవిందు (పోలయ్యా)	27	22	528	530	
968					ప్రళయకావేరిపోతయ్య (శ్రీ)	27	22	528	530	
969					ప్రళయకావేరిగోవింద్ (తాతయ్యా)	27	22	528	530	
970					ప్రళయకావేరితాతయ్య (వీర రాఘవులు)	27	22	528	530	
971	530	4.79	అసైన్మెంట్	4.66	ఇతరులు	23-1	22-1	529	21-2	
972					ప్రళయకారిగోవిందు (పోలయ్యా)	23-1	22-1	529	21-2	
973					ప్రళయకారిగోవిందు (పోలయ్యా)	23-1	22-1	529	21-2	
974					ప్రళయకావేరిరామయ్య (శ్రీ)	23-1	22-1	529	21-2	
975					వాయిలరమణ (శెట్టి)	23-1	22-1	529	21-2	
	TOTAL	511.47		492.83						

సం/- ఓ.ఆనంద్
కలెక్టరు మరియు జిల్లా మేజిస్ట్రేట్,
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు.

సెర్ప్‌లో 'అదనపు' రింగ్ లీడర్!

- లేని అదనపు సీఈవో పోస్టులో చేరి హల్‌చల్
- బదిలీల్లో ఇష్టారాజ్యం.. అస్మదీయులకు అడ్డగోలుగా పోస్టులు
- ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులపై చిన్నచూపు.. అవినీతి అధికారులకు అందలం
- మంత్రులూ.. ఎమ్మెల్యేల సిఫారసులూ బేఖాతర్
- డిప్యుటేషన్ అధికారి తీరుతో భ్రష్టుపడుతున్న సెర్ప్

అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి): సెర్ప్‌లో ఆయనో రింగ్ లీడర్. ఆయనేది చెప్తే అదే శిలాశాసనం. నిబంధనలు బేఖాతరు చేయడంలో ఆయన దిట్ట. సహకార శాఖ నుంచి డిప్యూటేషన్‌పై వచ్చిన ఆయన లేని సెర్ప్ అడిషనల్ సీఈవో పోస్టులో తిష్ట వేశారు. ఇటీవలి సాధారణ బదిలీల ప్రక్రియలో ఆయన జోక్యం శృతిమించడంతో రాష్ట్ర వ్యాప్తంగా వెలుగు సిబ్బంది బదిలీలు గందరగోళంగా మారాయి. సెర్ప్ సీఈవో తనకున్న పాత పరిచయంతో కొంత మంది అధికారులను సెర్ప్ కార్యాలయంలోకి డిప్యూటేషన్‌పై తీసుకొచ్చారు. ఈ క్రమంలో ఎక్కడో ఉత్తరాంధ్రలో ఉండే ఆయన సెర్ప్ ప్రధాన కార్యాలయానికి వచ్చారు. వాస్తవానికి రాష్ట్రంలో అదనపు సెర్ప్ సీఈవో పోస్టు లేనే లేదు. అయితే ప్రస్తుత సెర్ప్ సీఈవో... ఎక్స్ అఫిషియో సెక్రటరీగా కూడా బాధ్యతలు నిర్వహిస్తున్నందున తనకున్న అధికారాలతో లేని అదనపు సెర్ప్ సీఈవో పోస్టులో ఉత్తరాంధ్రకు చెందిన ఈ సహకార శాఖ అధికారిని నియమించుకున్నారు. దీంతో సెర్ప్ కార్యాలయం గందరగోళంగా మారిపోయింది. సామర్థ్యం లేని కొందరిని ఏకంగా డైరెక్టర్లుగా నియమించడంతో సెర్ప్ సీఈవో విమర్శలు మూటగట్టుకున్నారు. గతంలో సెర్ప్ పెన్షన్ విభాగానికి సంబంధించి డైరెక్టర్ ఉండేవారు. ఆ తర్వాత ఆ డైరెక్టర్ బదిలీ కావడంతో ఆ స్థానంలో ఏపీవో బాధ్యతలు చేపట్టారు. కొన్ని రోజుల తర్వాత ఆ ఏపీవోను ఏలూరుకు బదిలీ చేశారు. బదిలీ అయిన ఆ ఏపీవోను తిరిగి పిలిచి ఏకంగా పెన్షన్ విభాగానికి డైరెక్టర్ బాధ్యతలు అప్పజెప్పారు. అంతే కాకుండా ఎంఐఎస్ విభాగానికి ఇన్‌చార్జ్ బాధ్యతలు ఇచ్చేందుకూ సిద్ధం అయ్యారు. ఒక కులం వారికి పెద్ద పీట వేసి ఎస్సీ, ఎస్టీల పట్ల వివక్ష చూపిస్తున్నారన్న ఆరోపణలూ ఈ అధికారిపై ఉన్నాయి. ఇటీవల ఈ అధికారి తీరుకు నిరసనగా సెర్ప్‌లోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు.

మంత్రులూ, ఎమ్మెల్యేల సిఫారసులూ డోంట్ కేర్

సెర్ప్ కార్యాలయంలో బదిలీలకు సంబంధించి ఎమ్మెల్యేలు, మంత్రులిచ్చిన లేఖలను కూడా పట్టించుకోని ఈ అదనపు సీఈవో... సాక్షాత్తు సెర్ప్ మంత్రి చేసిన సిఫారసులను కూడా పక్కన పడేశారన్న విమర్శలున్నాయి. పోనీ బదిలీలు పారదర్శకంగా జరిగాయా అంటే అదీ లేదు. ఉత్తరాంధ్ర మూడు జిల్లాల్లో బదిలీలకు ప్రత్యేక పరిశీలకుడిగా వెళ్లిన ఈ అదనపు సీఈవో ఇష్టారీతిన బదిలీలు చేపట్టారు. ఈ అధికారిని అతిగా విశ్వసిస్తున్న సీఈవో... ఆయనపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే వారినే మందలిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇటీవల ఓ డీపీఎంను శ్రీకాకుళం నుంచి ఏఎస్ఆర్ జిల్లాకు బదిలీ చేశారు. అయితే సెర్ప్ అదనపు సీఈవో ఆయన్ను అర్జెంట్‌గా విజయవాడ సెర్ప్ కార్యాలయానికి తీసుకురావాలని హుకుం జారీ చేయడం గమనార్హం. మరోవైపు, అదనపు సీఈవో రాకతో సెర్ప్‌ను అవినీతి ఆరోపణలున్న ఎదుర్కొంటున్న వారితో నింపేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. స్టేట్ ఆడిట్ విభాగంలో అడిషనల్ డైరెక్టర్‌గా పనిచేసి, అవినీతి ఆరోపణలు ఎదుర్కొని సస్పెండ్ అయిన ఓ అధికారిని ఇక్కడ డైరెక్టర్‌గా నియమించాలని అదనపు సీఈవో భావించారు. ఆయన అనుకున్నదే తడవుగా సెర్ప్ సీఈవో గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశారు. డిప్యూటీ డైరెక్టర్ స్థాయి అధికారికి రిటైర్ అయిన తర్వాత పోస్టింగ్ ఇవ్వాలంటే సీఎం ఆమోదం ఉండాలి. అదేమీ పట్టించుకోలేదు. ఆ అధికారిపై ఉన్న ఆరోపణల నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఆయన రిటైర్ కావడానికి ఆరు రోజుల ముందు పోస్టింగ్ ఇచ్చింది. ఆరు రోజుల్లోనే ఆ అధికారి స్టేట్ ఆడిట్ విభాగంలో విచ్చలవిడిగా బదిలీ చేపట్టారు. ఫైల్స్ కూడా కనపడకుండా చేసి నిబంధనలను అడ్డగోలుగా తుంగలో తొక్కారన్న ఆరోపణలున్నాయి. అలాంటి అధికారిని సెర్ప్‌లో ప్రధానమైన పోస్టులోకి తీసుకురావడం ఎందుకో మరి.

కార్యాలయం మార్పుతో నెలకు రూ.6 లక్షల భారం

విజయవాడ నడిబొడ్డులో ఆర్టీసీ కార్యాలయంలో ప్రస్తుతం సెర్ప్ కార్యాలయం సకల సౌకర్యాలతో ఉంది. పైగా రాష్ట్రం నలుమూలల నుంచి సిబ్బంది గాని, డ్వాక్రా సంఘాలు గాని వచ్చి తమ పనులు చేసుకునేందుకు అందుబాటులో ఉంది. ఆర్టీసీకి చెందిన ఈ కార్యాలయానికి చదరపు అడుగుకు రూ.30లు అద్దెగా చెల్లిస్తున్నారు. అయితే అదనపు సీఈవోకు, సెర్ప్ సీఈవోకు ఈ కార్యాలయం నచ్చలేదట. అంతే అర్జెంట్‌గా మారిపోవాలని నిర్ణయించేసుకున్నారు. విజయవాడలోని మహానాడు రోడ్డు చివరన ఆటోనగర్‌కు దగ్గరగా చదరపు అడుగు రూ.45లతో కొత్త భవనంలోకి మారడానికి రంగం సిద్ధం చేశారు. ఆ మేరకు భవన యజమానికి ఇప్పటికే రూ.27 లక్షలు అడ్వాన్స్ ఇచ్చినట్లు సమాచారం. ప్రస్తుతమున్న సెర్ప్ కార్యాలయం సరిపోకపోతే అదే ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అదనపు భవనాలున్నాయి. అక్కడ సర్దుబాటు చేసుకోవచ్చు. కానీ, కార్యాలయాన్ని ఇక్కడ నుంచి మార్చాలన్న నిర్ణయంతో సెర్ప్‌పై అదనంగా ప్రతి నెలా రూ.6 లక్షల భారం పడుతుంది. పేదరిక నిర్మూలనలో ప్రధానపాత్ర పోషించాల్సిన సెర్ప్ కార్యాలయంలో అంతా గందరగోళంగా మారడంతో ప్రభుత్వ కార్యక్రమాలు సజావుగా ఎలా సాగుతాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సెర్ప్‌పై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి గాడిలో పెట్టాలని పలువురు కోరుతున్నారు.

బుడమేరు వరదతో తీవ్రనష్టం

- దానికి బాధ్యులైన అధికారులను గుర్తించండి
- ముప్పును అడ్డుకొనే వ్యవస్థను బలోపేతం చేయండి
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం
- పిల్‌పై కౌంటర్‌కు మరికొంత సమయం మంజూరు



అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి): విజయవాడలో వరదల కారణంగా ప్రాణనష్టం జరిగిందని, అందుకు బాధ్యులైన అధికారులను గుర్తించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. వరద ముప్పును అంచనా వేసి, దానిని అడ్డుకొనేందుకు వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. బుడమేరు వరదపై ప్రజలను అప్రమత్తం చేయడంలో అధికారులు విఫలమయ్యారని, బాధ్యులైనవారిపై చర్యలు తీసుకొనేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)లో కౌంటర్ వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి మరికొంత సమయం ఇచ్చింది. వ్యాజ్యంలో వ్యక్తిగత హోదాలో ప్రతివాదిగా ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు నోటీసులు ఇవ్వాలని పిటిషనర్ తరపు న్యాయవాది అభ్యర్థనను తోసిపుచ్చింది. తదుపరి విచారణను అక్టోబరు 8కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. కృష్ణా నదితో పాటు కొండవీటి వాగు, బుడమేరు ప్రవాహాలకు అవరోధంగా ఉన్న అక్రమ నిర్మాణాల తొలగింపునకు ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ఒంగోలుకు చెందిన విశ్రాంత పాత్రికేయుడు నాతాని భూపతిరావు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. ఈ పిల్ బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరపున న్యాయవాది కాసా జగన్మోహన్‌రెడ్డి వాదనలు వినిపించారు. అక్రమ నిర్మాణంలో ముఖ్యమంత్రి నివాసం ఉంటున్నారని, అందువల్ల ఆయన్ను వ్యక్తిగత హోదాలో ప్రతివాదిగా చేర్చానని చెప్పారు. సీఎంకు నోటీసులు జారీ చేయాలని కోరారు. అందుకు ధర్మాసనం నిరాకరించింది. వ్యక్తిని లక్ష్యంగా చేసుకొని వాదనలు వినిపించవద్దని సూచించింది. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ప్రణతి వాదనలు వినిపిస్తూ.. ప్రకృతి విపత్తు వల్ల వరదలు సంభవించాయని, అందుకు అధికారులను బాధ్యులను చేయలేమన్నారు. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేస్తామని చెప్పారు.



ఆంధ్రప్రదేశ్‌లో లక్ష వ్యవసాయ చెరువులను విజయవంతంగా పూర్తిచేసిన సందర్భంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణతేజను ఢిల్లీలో బుధవారం సత్కరిస్తున్న కేంద్ర జలశక్తి శాఖకు చెందిన నేషనల్ వాటర్ మిషన్ డైరెక్టర్ ఎన్. అశోక్‌బాబు.

కడసారి చూపూ దక్కని ఘోరం!

- సిగాచి పరిశ్రమ దుర్ఘటన జరిగి 3 రోజులైనా ఆచూకీ లభించని పది మంది
- మంటలకు కాలి బూడిదైనట్లు అంచనా
- ఏమాత్రం గుర్తుపట్టలేని స్థితిలో మరో 20 మృతదేహాలు

సంగారెడ్డి ప్రతినిధి/రామచంద్రాపురం టౌన్/పటాన్‌చెరు రూరల్, జూలై 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని పాశమైలారంలో సిగాచి పరిశ్రమ దుర్ఘటనలో ఆత్మీయులను కోల్పోయిన వారికి కడసారి చూపూ దక్కని వేదన వర్ణనాతీతంగా మారింది. గల్లంతైన వారిలో పది మంది ఆచూకీ దొరకని పరిస్థితి నెలకొంది. ప్లాంటులోని డ్రయర్‌కు సమీపంలో పనిచేస్తున్న ఆ పది మంది ఎముకలు సైతం మంటల ఉధృతితోపాటు రసాయనాల ప్రభావంతో బూడిదైపోయి ఉంటాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక పూర్తిగా కాలిపోయి మాంసపు ముద్దలుగా మారిన మరో 20 మందికిపైగా మృతదేహాల గుర్తింపులోనూ జాప్యం జరుగుతోంది. ప్రమాదం జరిగి మూడు రోజులైనా తమవారి జాడ లేక.. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఆచూకీ చెప్పాలంటూ బుధవారం పరిశ్రమ వద్ద ఆందోళనకు దిగారు. మృతులు, గల్లంతైన వారి విషయంలో ప్రభుత్వం, కంపెనీ ప్రతినిధులు ఒక్కో లెక్క చెబుతుండటం గందరగోళానికి దారితీస్తోంది. ప్రమాదంలో ఆచూకీ తెలియకుండా పోయిన వారి కోసం బుధవారం ఘటనా స్థలిలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. హైడ్రా, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక బృందాలు.. శిథిలాల్లో విస్తృతంగా గాలించాయి. అదనపు వాహనాలను, పరికరాలను తెప్పించి సహాయ చర్యలు చేపట్టారు. శిథిలాలను టిప్పర్లతో ఖాళీ ప్రదేశాలకు తరలించి, మృతదేహాల అవశేషాల కోసం వెతుకుతున్నట్టు తెలిసింది. బుధవారం ఒకరి చెయ్యి బయటపడగా మార్చురీకి తరలించారు. మంగళవారం రాత్రి నుంచీ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో సహాయ చర్యలకు ఆటంకం కలుగుతోంది.



సిగాచి పరిశ్రమలో శిథిలాలు తొలగిస్తున్న సిబ్బంది

ఇన్ఫోసిస్ టెకీ నీచపు పని..!

- ఆఫీస్ టాయిలెట్‌లో మహిళా ఉద్యోగిని రహస్యంగా వీడియో

బెంగళూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఐటీ కంపెనీ ఇన్ఫోసిస్‌లో దారుణ సంఘటన చోటుచేసుకుంది. ఆఫీస్ టాయిలెట్‌లో ఓ మహిళా ఉద్యోగిని రహస్యంగా వీడియో తీస్తున్న సహోద్యోగి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. దీంతో పోలీసులు అతన్ని అరెస్టు చేశారు. బెంగళూరులోని ఇన్ఫోసిస్‌లో సీనియర్ అసోసియేట్‌గా పనిచేస్తున్న నగేశ్ స్వప్నిల్ మాలి.. సోమవారం ఈ నీచపు పనికి పాల్పడ్డాడు. ఆఫీసులోని టాయిలెట్‌కు వెళ్లిన తనను పక్కనే ఉన్న క్యూబికల్స్ నుంచి ఎవరో గమనిస్తున్నట్టు అనుమానం వచ్చిందని, ఆ సమయంలో నగేశ్ తనను వీడియో తీస్తున్నట్టు గుర్తించి పెద్దగా కేకలు వేశానని బాధిత మహిళ పేర్కొన్నారు. ఆమె అరుపులు విన్న సహోద్యోగులు వెంటనే అక్కడకు చేరుకుని నగేశ్‌ను పట్టుకున్నారు. ఈ ఘటనపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో నగేశ్ ఫోన్‌ను పరిశీలించగా అందులో 30 మందికి పైగా మహిళల వీడియోలు ఉన్నట్టు తేలింది. కాగా, బాధితురాలి సమక్షంలోనే కంపెనీ హెచ్ఆర్ సిబ్బంది ఆ వీడియోను డిలీట్ చేశారు. నిందితుడిని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించినట్టు తెలిసింది.

17 రోజుల్లో 7 అత్యాచారాలు!

- ఒడిసాలో ఆగని అఘాయిత్యాలు
- తాజాగా మహిళపై గ్యాంగ్ రేప్

భువనేశ్వర్, జూలై 2: ఒడిసాలో బాలికలు, మహిళలపై వరుసగా జరుగుతున్న అఘాయిత్యాలు తీవ్ర ఆందోళనలను రేకెత్తిస్తున్నాయి. కేవలం 17 రోజుల్లో ఏడు అత్యాచార ఘటనలు నమోదయ్యాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా మహిళల భద్రత, శాంతిభద్రతలపై ప్రతిపక్షాలు నిరసన వ్యక్తం చేస్తున్నాయి. తాజాగా మేకలను మేపేందుకు వెళ్లిన మహిళపై ఇద్దరు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఈ ఘటనకు సంబంధించి ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. బాధిత మహిళ మంగళవారం భలుమరా అటవీ ప్రాంతంలో మేకలు మేపేందుకు వెళ్లగా భజమన్ భోయి, సునంద పిహు అనే వ్యక్తులు.. ఆమెను అనుసరించి అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఇదిలావుంటే.. జూన్ 15 తర్వాత రాష్ట్రవ్యాప్తంగా అత్యాచార ఘటనలు వరుసగా జరుగుతున్నాయి. జూన్ 28న గంజాం జిల్లాలో ఏడో తరగతి బాలికపై ఆమె బంధువు(22) అత్యాచారానికి ఒడిగట్టాడు. జూన్ 25న ఇదే జిల్లాలో 17 ఏళ్ల బాలికపై ఓ క్లినిక్ యజమాని అఘాయిత్యానికి పాల్పడ్డాడు. మరో ఘటనలో ఓ యువతి ఆలయానికి వెళ్లి తిరిగి వస్తుండగా కొందరు యువకులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. మయూర్‌భంజ్ జిల్లాలో జూన్ 19న 31 ఏళ్ల మహిళపై నలుగురు వ్యక్తులు సామూహిక అత్యాచారం చేశారు. కేంఝర్ జిల్లాలో 17 ఏళ్ల బాలిక చెట్టుకు ఉరివేసుకోగా, ఆమె మృతదేహం పోస్టుమార్టమ్ రిపోర్టులో అత్యాచారానికి సంబంధించిన ఆనవాళ్లు ఉన్నట్టు గుర్తించారు. గోపాలపూర్ జిల్లాలోని బీచ్‌లో జూన్ 15న విద్యార్థినిపై గ్యాంగ్ రేప్ జరిగింది.

జనవరి 28 నుంచి 31వరకు

మేడారం మహా జాతర



తాడ్వాయి, జూలై 2(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం మహాజాతర ముహూర్తం ఖరారైంది. 2026 జనవరి 28 నుంచి 31 వరకు జాతర జరుగుతుందని దేవస్థాన కార్యనిర్వాహక అధికారి వీరస్వామి, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు బుధవారం ప్రకటించారు. వనదేవతలు సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల మహా జాతర నాలుగు రోజులపాటు జరగనుందని తెలిపారు. మహా జాతర ప్రారంభానికి ముందు జనవరి 21(బుధవారం) మండే మెలుగు(శుద్ధి పండుగ) కార్యక్రమం జరు గుతుందని పేర్కొన్నారు. జాతర ముగిసిన అనంతరం ఫిబ్రవరి 4 (బుధవారం) తిరుగువారం పండుగ జరుగుతుందని వారు వెల్లడించారు. తిరుగువారం తర్వాత వచ్చే మొదటి ఆదివారం పూజారుల వనభోజనాలతో జాతర తంతు పూర్తిగా ముగుస్తుందని జగ్గారావు తెలిపారు.

మహాజాతర షెడ్యూల్ ఇలా..

- జనవరి 28న (బుధవారం) సాయంత్రం 6 గంటలకు సారలమ్మ అమ్మవారు మేడారంలోని గద్దెను చేరుకుంటుంది. అలాగే పగిడిద్దరాజు, గోవిందరాజులు గద్దెలకు రావడంతో మహా జాతర మొదటి ఘట్టం ప్రారంభమవుతుంది.
- జనవరి 29న (గురువారం) సాయంత్రం 6 గంటలకు వనదేవత సమ్మక్క గద్దెకు చేరుకుంటుంది.
- జనవరి 30న (శుక్రవారం) భక్తులు మొక్కులు సమర్పించుకుంటారు.
- జనవరి 31న (శనివారం) సాయంత్రం 6 గంటలకు వనదేవతలు తిరిగి వన ప్రవేశం చేస్తారు. దీంతో నాలుగు రోజుల ఈ మహా జాతర ముగుస్తుంది.



విదేశాల్లో చదువుకున్న వైద్య విద్యార్థుల సమస్యలపై అధికారులతో చర్చిస్తున్న మంత్రి సత్యకుమార్

వ్యాధులపై పరిశోధనలు చేయాలి

- వైద్య కళాశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించండి
- హెల్త్ వర్సిటీ అధికారులు క్రియాశీలంగా వ్యవహరించాలి
- విదేశాల్లో వైద్య విద్య అభ్యసించిన విద్యార్థుల సమస్యల పరిష్కారానికి ఢిల్లీ వెళ్లాలి: సత్యకుమార్

అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ క్రియాశీలంగా వ్యవహరించాలని, వైద్య విద్య వికాసానికి కృషి చేయాలని ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ఆదేశించారు. 39 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ పనితీరుపై బుధవారం ఆయన సమీక్షించారు. విశ్వవిద్యాలయం పనితీరు మెరుగుపడాలని, వైద్య కళాశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. 1986లో హెల్త్ వర్సిటీ ఏర్పాటైందని, అప్పటి నుంచి ఇప్పటి వరకూ మంత్రి స్థాయిలో ఏ రోజూ సమీక్ష జరగలేదని అధికారులు ఆయనకు తెలిపారు. దీంతో మంత్రి ఆశ్చర్యానికి గురయ్యారు. ఎంతో ప్రాధాన్యం గల ఎన్టీఆర్ వర్సిటీ ప్రధాన విషయాలపై దృష్టి పెట్టకుండా సాధారణ బాధ్యతల నిర్వహణతో సాగుతోందని అన్నారు. రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో విద్యాబోధన నాణ్యతను పెంచడంపై దృష్టి సారించిన దాఖలాలు లేవని, కేవలం సిలబస్ తయారీ, పరీక్షల నిర్వహణకు పరిమితమవ్వడం వర్సిటీ చట్ట స్ఫూర్తిని, ఆశయాలను నిర్లక్ష్యం చేసినట్టు అవుతుందన్నారు. ఉన్నత వైద్య విద్య నాణ్యత కోసం మౌలిక సదుపాయాలు, బోధనా తీరు, వైద్యులు, విద్యార్థుల హాజరుపై పటిష్ఠ నిఘా విధానాన్ని రూపొందించాలని ఆదేశించారు. వర్సిటీ స్థాపనలో ముఖ్య ఉద్దేశమైన పరిశోధన తీరు తెన్నులపై మంత్రి ఆరా తీశారు. రాష్ట్రంలో విస్తృత స్థాయిలో ప్రభుత్వాసుపత్రులు ప్రతి రోజూ వేలాదిమందికి ఓపీ, ఐపీ సేవలు అందిస్తూ వ్యాధులకు సంబంధించి భారీ స్థాయిలో అమూల్యమైన సమాచారాన్ని సేకరిస్తున్నా.. వ్యాధులు, ప్రాంతాల వారీగా పరిశోధనలు జరగకపోవడం, మొక్కుబడిగా పరిశోధనా ప్రాజెక్టుల్ని చేపట్టడం సబబు కాదని మంత్రి అన్నారు. ఆరోగ్య విజ్ఞాన వికాసానికి తోడ్పడే విధంగా పరిశోధనలు జరగాలని సూచించారు. సమీక్షా సమావేశంలో హెల్త్ వర్సిటీ వీసీ డా.పి.చంద్రశేఖర్, రిజిస్ట్రార్ డా.రాధికారెడ్డి, డీఎంఈ డా.నరసింహం ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఢిల్లీ వెళ్లనున్న ఏపీఎంసీ

విదేశాల్లో వైద్య విద్యను అభ్యసించి శాశ్వత రిజిస్ట్రేషన్ కోసం ఎదురు చూస్తున్న వైద్యుల డిమాండ్‌పై సంబంధిత అధికారులతో మంత్రి మాట్లాడారు. వెంటనే ఢిల్లీ వెళ్లి వారి సమస్య పరిష్కారాల మార్గాలపై ఎన్ఎంసీతో చర్చించాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు ఏపీఎంసీ చైర్మన్ డా.శ్రీహరిరావు, రిజిస్ట్రార్ డా.రమేశ్ త్వరలో ఢిల్లీ వెళ్లి అధికారులతో భేటీ కానున్నారు. 2021 వరకూ శాశ్వత రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరికి రిజిస్ట్రేషన్ చేశామని, తదుపరి వచ్చిన దరఖాస్తులు మన దేశంలో చేయాల్సిన ఇంటర్న్‌షిప్ కాలపరిమితిపై స్పష్టత కోసం పెండింగ్‌లో ఉన్నాయని అధికారులు తెలిపారు. విదేశాల్లో వైద్య విద్యను అభ్యసించిన ప్రతి విద్యార్థి ఒకటి నుంచి రెండేళ్లు మన దేశంలో ఇంటర్న్‌షిప్ చేయాలని తాజాగా జాతీయ వైద్య సంఘం నిబంధన విధించిందన్నారు.

నేటి నుంచి సదరం స్లాట్లు

అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ కోసం గురువారం నుంచి సెప్టెంబరు 30 వరకూ దరఖాస్తు చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. సదరం హెల్త్ నోడల్ అధికారి ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాల డైరెక్టర్‌కు లేఖ పంపించారు. మీ సేవ లేదా సచివాలయాల్లో సదరం క్యాంపు స్లాట్లు బుక్ చేసుకోవచ్చు.

నేడు ప్రైవేటు పాఠశాలలు బంద్

అమరావతి, కడప మారుతీనగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఏకపక్ష నిర్ణయాలకు నిరసనగా గురువారం ప్రైవేటు పాఠశాలలు మూసివేయాలని నిర్ణయించినట్లు ఏపీ ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘాల ప్రతినిధి తులసీ ప్రసాద్ బుధవారం ప్రకటించారు. కొందరు అధికారులు ప్రైవేటు పాఠశాలలపై అతిగా స్పందిస్తున్నారని, త్రిసభ్య కమిటీలు, తనిఖీలు పేరుతో తప్పుడు ఫిర్యాదుల ఆధారంగా నోటీసులు జారీ చేస్తున్నారని ఆరోపించారు. అలాగే విద్యాహక్కు చట్టం కింద తగిన ధ్రువీకరణ లేకుండానే విద్యార్థులను చేర్చుకోవాలని బలవంతం చేస్తున్నారని, షోకాజ్ నోటీసులు ఇస్తున్నారని అన్నారు. గుర్తింపు రద్దు చేస్తామని బెదిరిస్తున్నారన్నారు. అధికారుల చర్యలతో ఆవేదనకు గురై బంద్‌కు పిలుపునిచ్చామన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలను కూటమి ప్రభుత్వం మానవత్వంతో త్వరితగతిన పరిష్కరించాలని కోరుతూ గురువారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రైవేటు విద్యాసంస్థలు మూసివేత (బంద్) జరుగనుందని సాయిబాబా విద్యాసంస్థల చైర్మన్, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి కడపలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం వెల్లడించారు. పేద వర్గాలకు చెందిన 25శాతం మంది విద్యార్థులకు ఉచితంగా విద్య చెప్పాలని కేంద్ర ప్రభుత్వం చట్టం తీసుకొచ్చినా అందుకు అనుగుణంగా సంబంధిత అధికారులు నిబంధనలు పాటించడం లేదన్నారు. అలాంటి విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్ ఇవ్వాల్సి ఉందన్నారు. కాగా కొన్ని ప్రైవేటు పాఠశాలల సంఘాలు ఈ బంద్‌లో తాము పాల్గొనడం లేదని తెలిపాయి.

పత్రికలు ప్రజా వారధులు

- సమాజ సేవలో 'ఆంధ్రజ్యోతి' పాత్ర అద్వితీయం
- 'అక్షరం అండగా' సభలో మంత్రి ఎన్ఎండీ ఫరూక్



'అక్షరం అండగా..' సభలో ప్రసంగిస్తున్న మంత్రి ఫరూక్

నంద్యాల, జూలై 2(ఆంధ్రజ్యోతి): 'ఎన్నో ఏళ్ల నుంచి పత్రికలు ప్రజా వారధులుగా నిలుస్తున్నాయి. ప్రజాప్రతినిధుల దృష్టికి రాని సమస్యలను సైతం గుర్తిస్తున్నాయి. ఈ విషయంలో 'ఆంధ్రజ్యోతి' పాత్ర అద్వితీయం.' అని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. నంద్యాల జిల్లా కేంద్రంలోని నందమూరినగర్‌లో బుధవారం నిర్వహించిన 'అక్షరమే అండగా.. పరిష్కారమే అజెండాగా..' సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేదల సంక్షేమం.. అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగిస్తున్నామని అన్నారు. నియోజకవర్గంలోని ప్రజల సమస్యలను 'ఆంధ్రజ్యోతి' తన దృష్టికి తీసుకురావడంతో వాటి పరిష్కారానికి కృషి చేశానని చెప్పారు. 38వ వార్డు పరిధి నందమూరి నగర్, వైఎస్సార్ నగర్‌లలో రూ.3కోట్ల నిధులతో రోడ్లు, కాలువలు, విద్యుత్తు స్తంభాలు, లైట్లు, తాగునీటి పైప్‌లైన్ తదితర పనులు చేపట్టామని వివరించారు. నంద్యాలలో హిందువులు, ముస్లిం, క్రైస్తవులకు వేర్వేరుగా శ్మశానవాటికలు ఏర్పాటు చేయిస్తానని, ప్రజలకు రక్షణ ఉండేలా ఈ ప్రాంతంలో 4వ పట్టణ పోలీసు స్టేషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజలకు సేవ చేయాలన్న సంకల్పంతో ఇలాంటి కార్యక్రమాలను 'ఆంధ్రజ్యోతి' ఎండీ వేమూరి రాధాకృష్ణ, డైరెక్టర్ వేమూరి ఆదిత్య రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించడం అభినందనీయమని ఫరూక్ కొనియాడారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండీ ఫిరోజ్, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, 'ఆంధ్రజ్యోతి' యూనిట్ మేనేజర్ ఆకుల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

10 కోట్ల ప్రభుత్వ భూమిని
కోటిన్నరకే కొట్టేయాలని..

ఓ ఎమ్మెల్యే సోదరుడి స్కెచ్

- రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం సొంతం చేసుకునేందుకు ప్లాన్
- వెంచర్‌కు రోడ్ల నిర్మాణం పేరిట మార్కెట్ విలువకు ఇవ్వాలని అర్జీ
- అభ్యంతరాలుంటే తెలపాలని
- తాడేపల్లి తహసీల్దార్ నోటీసు జారీ

(గుంటూరు-ఆంధ్రజ్యోతి)



తమకు విక్రయించాలని రియల్ ఎస్టేట్ సంస్థ అర్జీ పెట్టుకున్న మంగళగిరి నియోజకవర్గంలోని ప్రభుత్వ భూములివే

అది.. అమరావతి రాజధానికి ఆనుకుని గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గంలోని ప్రాంతం. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో భాగంగా విల్లాలు నిర్మించుకునేందుకు అక్కడ ఉన్న ఖరీదైన రెండు ఎకరాల ప్రభుత్వ భూమిపై ఓ సంస్థ నిర్వాహకులు కన్నేశారు. కారు చౌకగా హస్తగతం చేసుకునేందుకు పథకం సిద్ధం చేశారు. ఆ భూముల వాస్తవ విలువ దాదాపు రూ.10 కోట్లు కాగా, మార్కెట్ విలువ పేరుతో కేవలం రూ.కోటిన్నరకే కొట్టేసేందుకు ప్రయత్నిస్తున్నారు. సదరు రియల్ ఎస్టేట్ సంస్థ అధినేత సోదరుడు గోదావరి జిల్లాలకు చెందిన ఓ ఎమ్మెల్యే. దీంతో భూమి కట్టబెట్టేందుకు స్థానిక రెవెన్యూ అధికారులు సహకరిస్తున్నారు. చుట్టుపక్కల పొలాలకు చెందిన రైతులు ఈ తంతుకు అడ్డుపడుతూ స్థానిక తహసీల్దార్‌కు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తాడేపల్లి గ్రామంలోని సర్వే నంబర్లు 255, 275-1ఏ, 302, 316-1 సరిహద్దుల్లో రెండు ఎకరాలా నాలుగు సెంట్ల ప్రభుత్వ భూమిని విల్లాలు, అపార్ట్‌మెంట్లకు అవసరమైన రహదారుల సౌకర్యాల నిమిత్తం మార్కెట్ విలువ ప్రకారం విక్రయించాల్సిందిగా కోరుతూ విష్ణు ప్రియ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ అర్జీ దాఖలు చేసినట్లు, దీనిపై అభ్యంతరాలు ఉంటే 15 రోజుల్లోగా తెలియజేయాల్సిందిగా తాడేపల్లి తహసీల్దారు ప్రకటన జారీ చేయడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఏ1 నోటీసును ఆ ప్రాంతంలోని వార్డు సచివాలయం, మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ కార్యాలయం, తాడేపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద బోర్డులో ప్రచురించారు. చట్టం ముసుగులో ఈ స్థలాలను తమ స్వాధీనంలోకి తీసుకునేందుకు రియల్ ఎస్టేట్ నిర్వాహకులు పావులు కదిపారు. ఎమ్మెల్యే కుటుంబీకులు కావడంతో అధికారులు కూడా దీనికి అవసరమైన ప్రక్రియను వేగంగా ప్రారంభించారు. ఈ రెండు ఎకరాలా నాలుగు సెంట్లు కూడా ఒకే బిట్టుగా లేదు. 255 సర్వే నంబర్‌లో 45 సెంట్లు, 275-1ఏలో 17 సెంట్లు, 302లో 44 సెంట్లు, 316-1లో 98 సెంట్లుగా ఉంది. ఈ భూముల విలువ బహిరంగ మార్కెట్లో సుమారు రూ.10 కోట్ల వరకు పలుకుతుందని ఆ ప్రాంత రైతులు చెబుతున్నారు. అయితే ప్రభుత్వ రికార్డుల ప్రకారం మార్కెట్ విలువ సుమారు రూ.కోటిన్నర ఉంటుందని తెలుస్తోంది. ఆ మొత్తం చెల్లించి ఈ భూములను చేజిక్కించుకునేందుకు రియల్ ఎస్టేట్ నిర్వాహకులు తొలి అడుగు వేశారు. ఈ భూముల్లో కొంత మేరకు వెంచర్‌కు అవతలి వైపు ఉన్న పొలాలకు వెళ్లేందుకు డొంక రోడ్డు మార్గంగా ప్రస్తుతం ఉపయోగపడుతున్నది. డొంక రోడ్లుగా ఉపయోగ పడుతున్న ప్రభుత్వ భూములను అమ్మేందుకు వీల్లేదని ఇప్పటికే ఆ ప్రాంత రైతులు స్థానిక తహసీల్దార్‌కు, కలెక్టర్‌కు అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేసినట్టు తెలిసింది. అయితే రైతులను ఏదోవిధంగా ఒప్పించి ఫిర్యాదులు వెనక్కి తీసుకునేలా చేయాలని రియల్ ఎస్టేట్ నిర్వాహకులు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఇప్పుడున్న రోడ్డు మార్గం వంకలుగా ఉందని, ఈ భూమిని తాము కొనుక్కునేందుకు అంగీకరిస్తే నేరుగా వెళ్లేందుకు తమ వెంచర్ పక్కన వేరే మార్గం వేస్తామని మభ్య పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. భూముల విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే, మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు.

కోటిపల్లి-నరసాపురం
రైల్వే లైన్ సర్వేకు ఓకే

- స్టే ఎత్తివేసిన హైకోర్టు.. త్వరగా చేయాలని ఆదేశం

అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి): కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్ అలైన్‌మెంట్ సర్వేకు మార్గం సుగమమైంది. రైల్వేలైన్ రీ అలైన్‌మెంట్, భూసేకరణను సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాలలో ఇప్పటి వరకు ఉన్న స్టే ఉత్తర్వులను హైకోర్టు ఎత్తివేసింది. రీ అలైన్‌మెంట్‌కు సంబంధించి సర్వే చేసేందుకు అధికారులకు వెసులుబాటు కల్పించింది. సాధ్యమైనంత త్వరగా సర్వే పూర్తిచేసి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలని రైల్వే అధికారులను ఆదేశించింది. రైల్వేలైన్ రీ అలైన్‌మెంట్ ద్వారా ఎవరైనా రాజకీయ నాయకులు, బడా వ్యక్తులు లబ్ధిపొందుతున్నారా? అనే విషయాన్ని కూడా పరిశీలించాలని అధికారులకు సూచించింది. విచారణను వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. రాజకీయ నాయకులు, బడాబాబుల లబ్ధి కోసం కోనసీమజిల్లా, అమలాపురం సమీపంలోని భట్నవిల్లి-గుడిమెల్లంక మధ్య కోటిపల్లి- నరసాపురం రైల్వేలైన్ అలైన్‌మెంట్ మారుస్తున్నారని, ముందుగా నిర్ణయించిన అలైన్‌మెంట్ ప్రకారం ట్రాక్ నిర్మాణం చేపట్టేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో పలు వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లు బుధవారం విచారణకు రాగా పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది సత్యప్రసాద్ వాదనలు వినిపించారు. ముందుగా ప్రతిపాదించిన రైల్వేలైన్ అలైన్‌మెంట్‌ను మార్చేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. రీఅలైన్‌మెంట్ వల్ల ప్రభుత్వ ఖజానాకు నష్టం జరుగుతుందన్నారు. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ఎస్. ప్రణతి, రైల్వేశాఖ తరఫు న్యాయవాది రుద్రప్రసాద్ వాదనలు వినిపిస్తూ.. రైల్వే అలైన్‌మెంట్ మార్పు కోసం జిల్లా కలెక్టర్ ప్రతిపాదన చేశారని తెలిపారు. సర్వే నిర్వహణపై హైకోర్టు స్టే విధించడంతో ప్రక్రియ ముందుకు సాగలేదన్నారు. దీంతో ప్రాజెక్టు నిలిచిపోయిందని పేర్కొన్నారు. రైల్వే లైన్ అలైన్‌మెంట్ సర్వే, భూసేకరణ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లేందుకు స్టే ఉత్తర్వులు ఎత్తివేయాలని అభ్యర్థించారు. ఇరు పక్షాల వాదనలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. అలైన్‌మెంట్ మార్పు పూర్తిగా ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని, ఫలానా దగ్గర లైన్ వేయాలని ఎలా చెప్పగలమని వ్యాఖ్యానించింది.

10న రెండో విడత 'తల్లికి వందనం'

- ఒకటో తరగతి, ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు జమ



అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి): రెండో విడత తల్లికి వందనం నగదును ఈ నెల 10వ తేదీన విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. తొలి విడతలో 67.27 లక్షల మంది విద్యార్థులకు పథకం అమలుచేశారు. రెండో విడతలో భాగంగా ఒకటో తరగతిలో, ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో చేరిన వారికి జూలై 5న నిధులు విడుదల చేస్తామని ప్రభుత్వం గతంలో తెలిపింది. కానీ అడ్మిషన్లు ఇంకా జరుగుతున్నందున ఎక్కువ మంది లబ్ధి పొందేందుకు వీలుగా ఈనెల 10న మెగా పేరెంట్-టీచర్స్ సమావేశం జరిగే రోజు రెండో విడత నిధులు విడుదల చేయాలని నిర్ణయించింది. కాగా, ఇప్పటివరకూ ఒకటో తరగతిలో 5.5 లక్షలు, ఇంటర్ ఫస్టియర్‌లో 4.7లక్షల మంది విద్యార్థులు చేరారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

ముగిసిన మెగా డీఎస్సీ పరీక్షలు

- 91.72శాతం హాజరు

అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఏడాది జూన్ 6న ప్రారంభమైన పరీక్షలు 23 రోజుల పాటు సాగి బుధవారం ముగిశాయని డీఎస్సీ కన్వీనర్ ఎంవీ కృష్ణారెడ్డి తెలిపారు. ఈ పరీక్షలకు మొత్తం 91.72 శాతం మంది హాజరయ్యారన్నారు. చివరి రోజు ఎస్జీటీ తెలుగు పరీక్షకు 19,879 మంది దరఖాస్తు చేసుకోగా 19,409 (97.06శాతం) మంది హాజరయ్యారన్నారు. డీఎస్సీపై ఇతరత్రా సందేహాలకు వెబ్‌సైట్‌లో ఉన్న టోల్‌ఫ్రీ నంబర్లకు కాల్ చేయాలని సూచించారు. పరీక్షల నిర్వహణకు సహకరించిన అన్ని శాఖలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.



మీడియాతో మాట్లాడుతున్న సీపీఐ నేత డీ రాజా, పక్కన రామకృష్ణ, కూనంనేని

కేంద్రానికి మద్దతుపై బాబు, నితీశ్ పునరాలోచించాలి: సీపీఐ

న్యూఢిల్లీ, జూలై 2(ఆంధ్రజ్యోతి): 'కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి మద్దతుపై చంద్రబాబు, నితీశ్ కుమార్ పునరాలోచించాలి. బాబు మద్దతుతోనే కేంద్ర ప్రభుత్వం నడుస్తోంది. విభజన హామీలు నెరవేర్చని బీజేపీకి, ఆయన ఎందుకు మద్దతివ్వాలి?' అని సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డీ రాజా ప్రశ్నించారు. ఢిల్లీలోని అజోయ్ భవన్‌లో సీపీఐ జాతీయ కౌన్సిల్ సమావేశాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, సీపీఐ శాసన సభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు, ఏపీ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణతో కలిసి రాజా తెలుగు మీడియాతో మాట్లాడారు. 'రెండు రోజుల పాటు జరిగే పార్టీ జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో దేశ రాజకీయాలపై చర్చిస్తాం. చండీగఢ్‌లో సెప్టెంబరులో పార్టీ కాంగ్రెస్ సమావేశాలు జరుగుతాయి. విజయవాడలో డిసెంబరు 24, 25 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు, ఖమ్మం వేదికగా డిసెంబరు 26న శతజయంతి ఉత్సవాలు నిర్వహిస్తాం. అంబేడ్కర్ భావజాలానికి వ్యతిరేకంగా ఆర్ఎస్ఎస్, ఉప రాష్ట్రపతి వ్యవహరిస్తున్నారు. దేశాన్ని కాపాడాలంటే బీజేపీని అధికారం నుంచి దూరం చెయ్యాలి' అని రాజా అన్నారు.

ఉద్యోగులకు ఉచిత వసతి పొడిగింపు

అమరావతి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సచివాలయం, శాఖాధిపతుల కార్యాలయాల్లో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగులకు ఉచిత వసతి సదుపాయాన్ని పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2026 జూన్ వరకు ఉద్యోగులకు ఉచిత వసతి కొనసాగుతుందని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఏపీ సచివాలయం, శాసనసభ, హెచ్ఓడీ కార్యాలయాలు, హైకోర్టు, రాజ్‌భవన్ ఉద్యోగులకు ఈ ఉచిత వసతి పొడిగింపు వర్తిస్తుంది. రాష్ట్ర విభజన తర్వాత ఏపీ రాజధానిని అమరావతిలో ఏర్పాటు చేశారు. దీంతో ఉద్యోగులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు వారికి ఉచిత వసతి, ఐదు రోజుల పనిదినాల వెసులుబాటు కల్పించారు. అప్పటి నుంచి ప్రతి ఏడాది ఉచిత వసతి, ఐదు రోజుల పనిదినాలు సౌకర్యాన్ని పొడిగిస్తూ వస్తున్నారు. గతంలో వైసీపీ ప్రభుత్వం ఉచిత వసతి సౌకర్యాన్ని రద్దు చేసినప్పటికీ ఉద్యోగుల విజ్ఞప్తితో మళ్లీ పొడిగించింది.


లాయర్లకు 4.42 కోట్లు మంజూరు

- ఏపీ న్యాయవాదుల సంక్షేమ నిధి కమిటీ

అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల డెత్ బెనిఫిట్స్, వైద్య ఖర్చులు, పదవీ విరమణ ప్రయోజనాల కోసం వచ్చిన దరఖాస్తులను పరిష్కరించేందుకు సమావేశమైన ఏపీ న్యాయవాదుల సంక్షేమ నిధి కమిటీ పలు నిర్ణయాలు తీసుకుంది. బార్ కౌన్సిల్ చైర్మన్ నల్లారి ద్వారకానాథ్‌రెడ్డి అధ్యక్షతన ఇటీవల జరిగిన న్యాయవాదుల సంక్షేమ నిధి కమిటీ సమావేశంలో సభ్యులు ముప్పాళ్ల సుబ్బారావు, పి.నరసింగరావు, ఏపీ హైకోర్టు, న్యాయశాఖ ప్రతినిధులు హాజరయ్యారు. ఇటీవల మరణించిన 75 మంది న్యాయవాదుల కుటుంబ సభ్యులకు రూ.3.77 కోట్లు, వైద్య ఖర్చుల నిమిత్తం 85 మంది న్యాయవాదులకు రూ.50.40 లక్షలు, పదవీ విరమణ ప్రయోజనం కింద 5గురు న్యాయవాదులకు రూ.15 లక్షలు మొత్తం రూ.4.42 కోట్లు మంజూరు చేసింది. అలాగే న్యాయవాదుల గుమస్తాల సంక్షేమ నిధి నుండి క్లర్కులు, వారి కుటుంబాలకు రూ.51.82 లక్షలు మంజూరు చేశారు.

జిన్‌పింగ్ శకం ముగిసిందా?

- కొన్ని రోజులుగా అధికారిక కార్యక్రమాల్లో కనిపించని చైనా అధినేత
- ప్రభుత్వ మీడియాలోనూ మాయం
- బ్రిక్స్ సదస్సుకు ఆయన బదులుగా ప్రధాని క్వియాంగ్
- జిన్‌పింగ్‌ను పక్కనపెట్టారంటూ ఊహాగానాలు
- తెర వెనుక మాజీ అధ్యక్షుడు జింటావో
- జనరల్ ఝాంగ్ యూక్సియాకి పగ్గాలు!
- చైనాలో పెరుగుతున్న నిరుద్యోగం.. ప్రజల ఆందోళనలు



వాషింగ్టన్, జూలై 2: చైనాలో గత 12 ఏళ్లుగా తిరుగులేని నాయకుడిగా ఉన్న షీ జిన్‌పింగ్ తన ప్రాభవం కోల్పోతున్నారా? అధికారాలు క్రమంగా ఆయన చేజారుతున్నాయా? తాజా పరిణామాలు చూస్తే అవుననే అనిపిస్తోందని అంతర్జాతీయ రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. బ్రెజిల్‌లోని రియోడీజెనిరోలో ఈ నెల 5-8 తేదీల మధ్య జరిగే 17వ బ్రిక్స్ సదస్సుకు జిన్‌పింగ్ హాజరు కావటం లేదని, ఆయన బదులుగా ప్రధాని లీ క్వియాంగ్ హాజరవుతారని చైనా విదేశాంగశాఖ ప్రతినిధి బుధవారం మీడియాకు వెల్లడించారు. జిన్‌పింగ్ రాకపోవటానికి కారణాలేమిటన్న విలేకర్ల ప్రశ్నలకు ఆమె స్పందించలేదు. జిన్‌పింగ్ 2013లో చైనా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత.. ప్రతి ఏటా బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సుకు హాజరవుతూ వచ్చారు. ఈసారి మాత్రమే ఆయన గైర్హాజరు అవుతున్నారు. అంతేకాదు, గత కొన్ని రోజులుగా జిన్‌పింగ్ చైనాలో బహిరంగ కార్యక్రమాల్లో పాల్గొనటం లేదు. దాదాపు ప్రతి రోజూ మొదటిపేజీలో జిన్‌పింగ్ ఫొటోలతో వార్తలు ప్రచురించే ప్రభుత్వ పత్రిక పీపుల్స్ డైలీలో ఈ మధ్య ఆయన వార్తలుగానీ, ఫొటోలుగానీ కనిపించటం లేదు. చైనాకు వస్తున్న విదేశాల అధినేతలకు, ప్రతినిధులకు చైనా కమ్యూనిస్టు పార్టీ (సీపీసీ)కి చెందిన సీనియర్ నేతలు ఆతిథ్యం ఇస్తున్నారే తప్ప జిన్‌పింగ్ జాడ లేదు. జూన్ తొలివారంలో.. చైనాకు బెలారస్ అధ్యక్షుడు అలెగ్జాండర్ లుకాషెంకో వచ్చినప్పుడు ఆయనతో జిన్‌పింగ్ సమావేశయ్యారు కానీ, ఈ తరహా ద్వైపాక్షిక సమావేశాల సందర్భంగా కనిపించే ఆర్భాటం మచ్చుకైనా లేదు. ఈ సమావేశంపై బెలారస్ అధ్యక్ష ప్రెస్ సర్వీస్ ఒక ప్రకటన విడుదల చేస్తూ.. సదరు భేటీలో జిన్‌పింగ్ అలసటతో ఉన్నట్లుగా కనిపించారని తెలిపింది. ఇటీవల జిన్‌పింగ్ వ్యక్తిగత భద్రత సిబ్బందిని సగానికి తగ్గించారు. ఆయన తండ్రి స్మారకస్థలానికి ఇప్పటి వరకూ ఉన్న అధికారిక హోదాను తొలగించారు. అంతేకాదు, అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో జిన్‌పింగ్ ఫోన్‌లో సంభాషించారన్న వార్తను చైనా ప్రభుత్వ టీవీ ఇటీవల ప్రసారం చేస్తూ.. జిన్‌పింగ్ పేరు ముందు ఎటువంటి హోదాను పేర్కొనకపోవటం విశేషం. ఇవన్నీ చూసి, చైనాలో ఏదో జరుగుతోందని విశ్లేషకులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. జిన్‌పింగ్‌ను పేరుకే అధ్యక్షుడిగా కొనసాగిస్తున్నప్పటికీ.. అధికారాలు ఆయన చేతుల్లో లేకపోవచ్చని చెబుతున్నారు. సర్వాధికారాలు చెలాయించిన వారిని నిశ్శబ్దంగా పక్కనపెట్టి, వారి స్థానంలో మరొకరిని తీసుకొచ్చే సంప్రదాయం చైనా కమ్యూనిస్టు పార్టీలో ముందు నుంచీ ఉంది. ప్రస్తుతం జిన్‌పింగ్ విషయంలో అదే జరుగుతున్నట్లు ఉండవచ్చని విశ్లేషకుల అంచనా.

పగ్గాలు ఎవరికి?

ఈ నేపథ్యంలోనే, జిన్‌పింగ్ స్థానంలో పగ్గాలు చేపట్టేదెవరు అన్న దానిపైనా ఊహాగానాలు నడుస్తున్నాయి. చైనాలో అత్యంత శక్తిమంతమైన 'సెంట్రల్ మిలిటరీ కమిషన్'లో ఫస్ట్ వైస్ చైర్మన్‌గా ఉన్న జనరల్ ఝాంగ్ యూక్సియా పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ప్రస్తుతం అత్యున్నత అధికారాలన్నీ ఆయన చేతుల్లోనే ఉన్నాయని అంటున్నారు. ఆయనకు కమ్యూనిస్టు పార్టీలోని సీనియర్లు, మాజీ అధ్యక్షుడు హ్యూ జింటావో వర్గం మద్దతిస్తోందని సమాచారం. 2022లో సీపీసీ మహాసభల నుంచి జింటావోను (ఆయన ఆరోగ్యం బాగా లేదనే సాకుతో) అవమానకర రీతిలో బయటకు పంపించివేశారు. బహిరంగంగా జరిగిన ఈ ఘటనను యావత్ ప్రపంచం చూసింది. పార్టీలో, ప్రభుత్వంలో తన ఏకఛత్రాధిపత్యం కోసమే జిన్‌పింగ్ ఈ పని చేయించారని అప్పట్లో అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇప్పుడు అదే జింటావో చక్రం తిప్పుతున్నారని, చైనాను గుప్పిట పెట్టుకున్న జిన్‌పింగ్‌ను పక్కకు తప్పించే వ్యూహం ఆయనదేనని విశ్లేషకులు భావిస్తున్నారు. సైన్యంలో జిన్‌పింగ్‌కు మద్దతుదారులుగా ఉన్న పలువురు జనరల్స్‌ను కీలక బాధ్యతల నుంచి తప్పిస్తున్నారని, కొందరినైతే రహస్యంగా చంపేస్తున్నారన్న అనుమానాలూ వ్యక్తమవుతున్నాయి. ఇక, జిన్‌పింగ్ వారసుడిగా వినిపిస్తున్న మరో పేరు వాంగ్ యాంగ్. చైనాలో మావో అనంతరం ఆ దేశాన్ని ఆర్థిక సంస్కరణల బాట పట్టించిన డెంగ్ జియావో పింగ్ ప్రోత్సాహంతో వాంగ్ యాంగ్ రాజకీయాల్లోకి వచ్చారు. సాంకేతిక నిపుణుడిగా, మార్కెట్ ఆధారిత సంస్కరణలకు మొగ్గు చూపేవాడిగా, వివాద రహితుడిగా ఆయనకు పేరుంది.

పెరుగుతున్న నిరుద్యోగం

చైనాలో నిరుద్యోగం భారీగా పెరుగుతోంది. స్థిరాస్తి రంగం స్తబ్ధుగా ఉంది. విదేశీ రుణం 50 లక్షల కోట్ల డాలర్లకు పెరిగింది. జీవన ప్రమాణాలు పడిపోవటంతో ప్రజల్లో ప్రభుత్వంపై అసంతృప్తి పెరిగిపోతోంది. పలు ప్రాంతాల్లో నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. ఫ్యాక్టరీలను ధ్వంసం చేయటం, కొల్లగొట్టటం వంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలోనే, జిన్‌పింగ్‌ను పక్కనపెట్టటం ద్వారా ప్రజాగ్రహాన్ని చల్లార్చాలని సీపీసీ ప్రయత్నిస్తోందా? కొత్త నాయకుడు చైనా పగ్గాలు చేపట్టనున్నారా?.. ఈ ప్రశ్నలకు సమాధానాలు తెలియాలంటే మరికొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

బనకచర్లకు బీఆర్ఎస్ రాజకీయ రంగు

- కేటీఆర్, హరీశ్‌రావు మధ్య రాజకీయ అస్తిత్వ పోరు
- మా ప్రభుత్వంలో అక్రమ కేసులు ఉండవు: మంత్రి పయ్యావుల



అనంతపురం, జూలై 2(ఆంధ్రజ్యోతి): 'కేటీఆర్, హరీశ్‌రావు మధ్య రాజకీయ అస్తిత్వ పోరు నడుస్తోంది. ఆ కారణంగానే బనకచర్ల ప్రాజెక్టుకు రాజకీయ రంగు పులుముతున్నారు' అని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా ఆయన అనంతపురం జిల్లా కూడేరు మండలం జయపురంలో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడారు. 'మేం తెలంగాణకు వ్యతిరేకం కాదు. సముద్రంలోకి వెళ్లే జలాలను వాడుకునే ప్రయత్నం చేస్తున్నాం. బీఆర్ఎస్‌లో కేటీఆర్, హరీశ్‌రావు మధ్య ఉన్న అస్తిత్వ పోరుకు రాజకీయ రంగు పులిమి, ఇదేదో ప్రాంతాల మధ్య సమస్య అన్నట్లు మాట్లాడటం బాధాకరం. రాయలసీమను రతనాల సీమను చేస్తానని చెప్పిన కేసీఆర్ మాటలు హరీశ్‌రావుకు గుర్తుకు రాలేదా? తిరుపతిలో విందు భోజనం చేసినప్పుడు ఈ అంశం కనపడలేదా..? కేటీఆర్ ఎక్కడా బనకచర్ల ప్రాజెక్టు గురించి మాట్లాడలేదు. హరీశ్‌రావు ట్రాప్‌లో పడి, ఆ పార్టీ మిగతా నేతలు బనకచర్లపై మాట్లాడే ప్రయత్నం చేస్తున్నారే తప్ప, దాని మూలంగా తెలంగాణకు నష్టం ఉండదని వారికీ తెలుసు. ఇదంతా పొలిటికల్ డ్రామా. అక్రమ కేసులు మా ప్రభుత్వంలో ఉండవు. మద్యంలో తప్పు జరిగిందనేది వాస్తవం. రాష్ట్రంలో అక్రమ కేసుల సంస్కృతి మొదలు పెట్టింది వైసీపీనే. మా ప్రభుత్వం అలా చేయడం లేదు. తప్పు చేసిన వాళ్లకు చట్టం పరిధిలోనే శిక్ష ఉంటుంది. గత పాలకులు రాష్ట్రంలో అరాచకం, ఆర్థిక విధ్వంసం సృష్టించారు. ఆ ఆర్థిక వ్యవస్థను మా ప్రభుత్వం గాడిలో పెడుతోంది. కేంద్రం సహకారంతో నిలదొక్కుకుంటున్నాం' అని పయ్యావుల అన్నారు.

జగన్ ఓ చీడపురుగు: మంత్రి అచ్చెన్న



శ్రీకాకుళం, జూలై 2(ఆంధ్రజ్యోతి): 'జగన్ ఓ చీడ పురుగు. ఆ చీడపురుగును రాష్ట్రంలో లేకుండా చేసేందుకు ప్రయత్నిస్తున్నాం' అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి నియోజకవర్గం సంతబొమ్మాళిలో బుధవారం నిర్వహించిన 'సుపరిపాలన తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి మీడియాతో మాట్లాడారు. 'జగన్‌రెడ్డి రాజకీయాలకు అర్హత లేని వ్యక్తి. రాష్ట్రంలో ఉండకూడదు. ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి రూ.10 లక్షల కోట్లు అప్పులు చేశారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు వైసీపీ దొంగలకు కనపడటం లేదా..? కళ్లు, చెవులు మూసుకున్నారా?' అని ప్రశ్నించారు.

రాష్ట్రంలో లక్ష సీసీ కెమెరాలు ఏర్పాటు: అనిత



తునిలో పెట్రోల్ బంకును ప్రారంభిస్తున్న హోంమంత్రి అనిత, ఎమ్మెల్యే దివ్య

తుని రూరల్, జూలై 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో లక్ష సీసీ కెమెరాలు ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్టు హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ప్రతి నియోజకవర్గంలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఇప్పటికే 60 శాతం పూర్తి చేశామని, మిగిలిన పనులు 3, 4 నెలల్లో పూర్తి కానున్నాయని వెల్లడించారు. కాకినాడ జిల్లా తునిలో జైళ్ల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంకు, సబ్ జైలు భవనాన్ని.. తుని ఎమ్మెల్యే యనమల దివ్యతో కలిసి అనిత బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... రాష్ట్రంలో శాంతిభద్రతలను కట్టుదిట్టంగా అమలుచేసేందుకు అధునాతన టెక్నాలజీని అనుసంధానం చేస్తున్నట్టు తెలిపారు. కొన్ని జైళ్లలో సీసీ కెమెరాలు పనిచేయడం లేదని, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తామని చెప్పారు.

సింగయ్య భార్యతో నేర రచయితల స్క్రిప్ట్ చదివిస్తారా?: పిల్లి మాణిక్యాలరావు

అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి): 'జగన్‌రెడ్డిని చేసిన పాపాలు వెంటాడుతున్నాయి. సింగయ్య మృతి కేసుతోపాటు మిగిలిన కేసుల్లో కూడా శిక్ష అనుభవించక తప్పదు' అని పిల్లి మాణిక్యాలరావు అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'సింగయ్య మృతిపై మానవత్వం లేని మృగంలా జగన్ వ్యవహరించాడనే విషయం ప్రజల్లోకి వెళ్లింది. దీంతో సింగయ్య భార్యతో నేర రచయితలు రాయించిన స్క్రిప్ట్ చదివించారు. ఆమె అబద్ధాలు మాట్లాడలేక తడబడుతుంటే పక్కన వైసీపీ మూకలు లోకేశ్ మనుషులు వచ్చి బెదిరించారని చెప్పాలంటూ స్క్రిప్ట్ చదివిస్తున్నారు. జగన్‌రెడ్డి ఎంత దుర్మార్గుడో వివేకా హత్య కేసు ద్వారా రాష్ట్ర ప్రజలందరికీ తెలిసింది. ఇంత చేసినోడు సింగయ్య మృతిని పక్కదారి పట్టించలేడా?' అని ప్రశ్నించారు.

సింగయ్య మృతిలో కుట్ర: వర్ల రామయ్య

'సింగయ్య మృతిలో కుట్ర ఉంది. సమగ్ర దర్యాప్తు జరిగితే కుట్ర బయట పడుతుందని జగన్ భయపడుతున్నారు. అందుకే కోర్టులను ఆశ్రయిస్తున్నారు' అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఐదేళ్లు సీఎంగా పనిచేసిన జగన్ పల్నాడు పర్యటనలో మానవత్వాన్ని కోల్పోయారు. ఆయన నిర్లక్ష్యానికి దళిత వృద్ధుడు బలయ్యాడు. జరిగిన నేరమంతా డ్రైవర్ మీద తోసేయాలని చూస్తున్నారు. అతను ప్రాణాలు కోల్పోవడానికి కారకుడు జగన్ రెడ్డే' అని వర్ల అన్నారు. కాగా, తన కారు కింద పడి చనిపోయిన సొంత పార్టీ కార్యకర్త సింగయ్య కుటుంబంతో జగన్ నీచ రాజకీయాలు చేస్తున్నారని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. సింగయ్య భార్యను అడ్డంపెట్టుకుని తాడేపల్లి పెద్దలు రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ఆరోపణలు చేయిస్తున్నారన్నారు. ఆమెను వైసీపీ వారు బెదిరించి అబద్ధాలు చెప్పిస్తున్నారని అన్నారు.

ఉగ్ర మూకలపై ఉక్కుపాదం మోపాలి

- పవన్‌పై కేసు మురుగన్‌పై దాడే: మాధవ్

అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉగ్రవాదుల కదలికలపై మరింత నిఘా పెంచి దేశ ద్రోహులపై పోలీసులు ఉక్కుపాదం మోపాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడయ్యాక సాధు సంత్‌ల ఆశీర్వాదం తీసుకున్న ఆయన విజయవాడలో విలేకరులతో ముచ్చటించారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఏళ్ల తరబడి ఉగ్రవాదులు మారు పేర్లతో ఉంటూ అక్కడ తరచూ జరిగే హింసాత్మక ఘటనలకు ఆజ్యం పోస్తున్నారన్న అనుమానం వ్యక్తంచేశారు. విజయనగరం లాంటి చోట ఉగ్రవాద లింకులు పోలీసు కుటుంబాల నుంచి బయట పడటం ఆందోళనకరమన్నారు. జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌పై తమిళనాడులో కేసు నమోదుచేయడం మురుగన్‌పై దాడిగా మాధవ్ అభివర్ణించారు. సనాతన ధర్మాన్ని నాశనం చెయ్యాలనే దుర్మార్గపు పాలన సాగిస్తోన్న డీఎంకే ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయన్నారు. ఆలయాలు, ఆవులపై దాడులు చేస్తే తాము చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

9న జగన్ మామిడి రైతు పరామర్శ యాత్ర

- చిత్తూరు జిల్లా బంగారుపాళెంకు రానున్న వైసీపీ అధినేత

తిరుపతి(జీవకోన), జూలై 2(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా బంగారుపాళెనికి వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ 9న రానున్నారని మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. తిరుపతిలో బుధవారం ఆయన ఉమ్మడి జిల్లా వైసీపీ అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డితో కలసి మీడియాతో మాట్లాడారు. చిత్తూరులో ప్రసిద్ధి చెందిన మామిడిని కొనేవారే లేరని, తూతూమంత్రంగా ప్రభుత్వం టన్నుకు రూ.4,000 గిట్టుబాటు ధర ప్రకటించిందని విమర్శించారు. మామిడికాయలను రైతులు రోడ్డుపక్కన పడేసే పరిస్థితి వచ్చిందన్నారు. ఇంతటి దారుణ పరిస్థితులు ఎన్నడూ చూడలేదన్నారు. గతంలో కాంగ్రెస్, వైసీపీ ప్రభుత్వాలు రైతులకు మద్దతు ధర లభించని సమయంలో కోల్డ్ స్టోరేజీలు ఏర్పాటు చేసి అండగా నిలిచాయన్నారు. చిత్తూరు జిల్లాలో తాను పల్ప్ సిండికేట్ చేసుంటే ఎందుకు కేసు పెట్టలేదని ప్రశ్నించారు. ఈ క్రమంలో 9న బంగారుపాళెం మార్కెట్ యార్డుకు మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వచ్చి మామిడి రైతుల కష్టాలను తెలుసుకుంటారన్నారు.





సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం రాత్రి తిమ్మరాజుపల్లె గ్రామస్థులతో ముచ్చటిస్తున్న చంద్రబాబు

మాది అభివృద్ధి యజ్ఞం

(మొదటి పేజీ తరువాయి)

ప్రజావేదికలో మాట్లాడారు. వైసీపీ చేసిన విధ్వంసం తలుచుకుంటుంటే భయమేస్తోందన్నారు. రాష్ట్రంలో అన్ని వ్యవస్థలూ పడకేశాయని చెప్పారు. కేంద్ర నిధుల్ని కూడా తీసుకురాలేకపోయారని, పైగా రూ.లక్షల కోట్ల అప్పులుచేసి పోయారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పుడు రాజకీయాలు నేరమయం అయిపోయాయన్నారు. 'బాబాయిని చంపి మళ్లీ ఆయన కూతురిని ఇబ్బంది పెడుతున్నారు. నా చేతిలో కత్తిపెట్టి నారాసుర రక్తచరిత్ర అంటూ రాశారు. నేను శవ రాజకీయాలు, హత్యా రాజకీయాలు చేయను. ఇన్నేళ్లలో ఎప్పుడైనా ఒకరిని కొట్టినట్లు గానీ, చంపించినట్లు గానీ నా పేరు వినిపించిందా' అని ప్రశ్నించారు. జగన్ కారు కింద కార్యకర్త పడిపోతే కుక్క పిల్లను లాగేసినట్లు లాగిపడేశారని, చనిపోయిన వ్యక్తి భార్యను మేనేజ్ చేసి.. 'మా ఆయన కారు కింద పడి కాదు.. అంబులెన్సులో వెళ్తూ మరణించారు' అని చెప్పించారని ధ్వజమెత్తారు. 2029 నాటికి రాష్ట్రంలో పేదరికం నిర్మూలించేందుకు కృషి చేస్తున్నానని, అందుకే పీ4 విధానానికి శ్రీకారం చుట్టానని తెలిపారు. రాష్ట్రంలోని 15 లక్షల బంగారు కుటుంబాల కోసం లక్ష మంది మార్గదర్శులను సిద్ధం చేసే బాధ్యత తనదేనన్నారు. ఆడబిడ్డల కష్టం తీర్చేందుకు ఆనాడు దీపం పథకం తీసుకొచ్చానని. ఇప్పుడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని తెచ్చానని చంద్రబాబు చెప్పారు.

ఎక్కడా 4 వేల పెన్షన్ ఇవ్వడం లేదు..

మంగళవారం కొవ్వూరు నియోజకవర్గంలో చెప్పులు కుట్టుకునే వ్యక్తి ఇంటికి వెళ్లానని. అతడికి డప్పు కళాకారుడి పెన్షన్ అందించానని.. చాలా సంతోషమేసిందని చెప్పారు. దేశంలో మరెక్కడా రూ.4 వేల పెన్షన్ ఇవ్వడం లేదన్నారు. 'ప్రతి నెలా 1వ తేదీన గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంటోంది. దివ్యాంగులకు అప్పట్లో రూ.3 వేలకు, ఇప్పట్లో రూ.6 వేలకు పెన్షన్ పెంచింది నేనే. మంచానికి పరిమితమైన వారికి జీతం తరహాలో నెలకు రూ.15 వేలు అందిస్తున్నా. తల్లికి వందనం విషయంలో మాట నిలబెట్టుకున్నా. ఐదుగురు పిల్లలున్న వారికి కూడా డబ్బులు వేశాం. దీనివల్ల రెండు లాభాలున్నాయి. పిల్లలను బాగా చదివిస్తారు, జనాభా తగ్గకుండా ఉంటుంది. 1, 11 తరగతుల వారికి అడ్మిషన్లు పూర్తయ్యాక డబ్బులు వేస్తాం. రైతులకు కేంద్రం ఇచ్చే రూ.6 వేలతో పాటు రూ.14 వేలు రాష్ట్ర వాటాగా మొత్తం రూ.20 వేలను అన్నదాతా సుఖీభవ కింద అందించనున్నాం. మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం కూడా అమలు చేస్తాం. వైసీపీ హయాంలో కంటే రెట్టింపు సంక్షేమం అందిస్తున్నాం' అని వివరించారు.



కుప్పంలోని శాంతిపురం మండలం తిమ్మరాజుపల్లెలో నిర్వహించిన ప్రజావేదికలో ప్రసంగిస్తున్న చంద్రబాబు

ఈ ఏడాదే కుప్పానికి హంద్రీ-నీవా నీళ్లు

వరుసగా 9 సార్లు కుప్పం ప్రజలు గెలిపించారని.. దేశంలోనే ఇదొక చరిత్రగా సీఎం పేర్కొన్నారు. హంద్రీ-నీవా కోసం రూ.3,890 కోట్లు విడుదల చేశామని గుర్తుచేశారు. ఒక ప్రాజెక్టు కోసం ఒకే విడతలో ఇన్ని నిధులివ్వడం స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎప్పుడూ జరుగలేదన్నారు. ఈ ఏడాది కచ్చితంగా కుప్పానికి హంద్రీ-నీవా నీళ్లు తెస్తామని.. ఇందులో ఎలాంటి సందేహం లేదని స్పష్టంచేశారు. '10 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి నియోజకవర్గంగా, సోలార్ పవర్ ఉత్పత్తి కేంద్రంగా కుప్పాన్ని మారుస్తా. ఎయిర్‌పోర్టును రెండేళ్లలో పూర్తి చేసేలా కృషి చేస్తున్నాం. ఈ ఏడాది రూ.1,293 కోట్ల నిధులతో కుప్పం నియోజకవర్గంలో అభివృద్ధి పనుల్ని ప్రారంభించాం. ఇందులో రూ.125 కోట్ల పనులు పూర్తయ్యాయి. పురోగతిలో ఉన్న పనులు 2026 నాటికి పూర్తి చేస్తాం' అని తెలిపారు. అప్పటికే సుదీర్ఘంగా ప్రసంగించిన ఆయన.. ప్రజావేదికకు హాజరైన మహిళలనుద్దేశించి.. 'మీకు పాలు పిండే టైమయింది. రోజంతా ఎలా ఉన్నా.. సాయంత్రమైతే ఇళ్లకు వెళ్లిపోవాలి. అది నాకు తెలుసు' అంటూ ముగించారు. కుప్పంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. పలు సంస్థలతో ఎంవోయూలు చేసుకున్నారు.

సమస్యల తక్షణ పరిష్కారానికి ఆదేశం

ప్రజావేదికలో ప్రసంగించాక.. 'సుపరిపాలనలో తొలి అడుగు'లో భాగంగా చంద్రబాబు బుధవారం రాత్రి శాంతిపురం మండలం తిమ్మరాజుపల్లెలో ఇంటింటికీ తిరిగారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఇంతవరకు చేసిన అభివృద్ధి, సంక్షేమం గురించి వివరించారు. రాత్రి 8.15కి మొదలుపెట్టి అర్ధరాత్రి 11గంటలు దాటేవరకు గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ సభ్యులను పలుకరించారు. పిల్లలు ఏం చదువుతున్నారు.. పెద్దలకు ఆరోగ్యం ఎలాఉంది.. సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. ఏమైనా సమస్యలున్నాయా అని ప్రశ్నిస్తూ.. వారి సమాధానాలు ఓపికతో వింటూ ముందుకు కదిలారు. ప్రతి ఇంటి వద్దా కుటుంబ సభ్యులతో ఫొటోలు దిగారు. విద్య, వైద్యం, ఆర్థిక అవసరమున్న వారికి తక్షణ సాయం అందించాలని అక్కడికక్కడే అధికారులను ఆదేశించారు. అనంతరం తన ఇంటికి చేరుకున్నారు. ఆయన గురువారం కుప్పం రూరల్ మండలంలో పర్యటిస్తారు.



లోకేశ్‌తో సెల్ఫీ దిగుతున్న తాడేపల్లి వాసులు

తాడేపల్లిలో లోకేశ్ తొలి అడుగు

- ఇంటింటికి తిరిగి అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించిన మంత్రి

తాడేపల్లి టౌన్, జూలై 2(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా తాడేపల్లిలోని మహానాడు కాలనీలో బుధవారం సాయంత్రం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి కరపత్రాల ద్వారా కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. లోకేశ్‌కు స్థానికులు ఘన స్వాగతం పలికారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ఆయన ముందుకు సాగారు. ఈ సందర్భంగా తామెదుర్కొంటున్న పలు సమస్యలను స్థానికులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు. రిటైనింగ్ వాల్ ప్రాంతాన్ని పరిశీలించిన మంత్రి నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ పథకాలపై ఆరా

బీసీ సామాజిక వర్గానికి చెందిన వెదుళ్ల మధుబాబు ఇంటికి వెళ్లిన మంత్రి లోకేశ్... ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరుపై ఆరా తీశారు. కుటుంబ సభ్యుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. 'మా దశాబ్దాల కల... ఇంటి పట్టా అందించారు. రూపాయి ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాం. మేం ఎక్కడికీ తిరగలేదు. బస్సులు పెట్టి మరీ మమ్మల్ని తీసుకెళ్లారు. భోజనంతోపాటు బట్టలు పెట్టి ఇంటి పట్టా అందించారు. ఇంటర్ చదువుతున్న మా కుమార్తెకు తల్లికి వందనం సాయం అందింది. దీపం పథకం కింద గ్యాస్ సబ్సిడీ నగదు బ్యాంకు ఖాతాలో జమైంది. మాకు చాలా ఆనందంగా ఉంది. మా కుమారుడు ఇంటర్ పూర్తి చేశాడు. త్వరలోనే ఇంజనీరింగ్‌లో చేరుస్తాం' అని మధుబాబు కుటుంబ సభ్యులు లోకేశ్‌కు వివరించారు.

ఘనంగా తొలి అడుగు

తొలిరోజు ఉత్సాహంగా సుపరిపాలన కార్యక్రమం

- ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలు వివరించిన ప్రజాప్రతినిధులు
- పాల్గొన్న మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు
- ఏలూరు జిల్లాలో జోరువానలోనూ కొనసాగిన కార్యక్రమాలు
- మన్యం జిల్లాలో మంత్రి సంధ్యారాణికి మహిళల హారతి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం ఘనంగా నిర్వహిస్తున్నారు. తొలిరోజు బుధవారం అత్యధిక నియోజకవర్గాల్లో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ ప్రజలతో మమేకం అయ్యారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా? అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు చెప్పిన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కృష్ణాజిల్లా మచిలీపట్నం నియోజకవర్గంలో మంత్రి కొల్లు రవీంద్ర సుల్తానగరంలోని ఆంజనేయస్వామి గుడిలో పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పామర్రు నియోజకవర్గంలో ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పర్యటించి ప్రజల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ కృత్తివెన్నుమండలం ఇంతేరు గ్రామంలో పర్యటించగా.. రోడ్లు వేయించాలని, ఇళ్లపట్టాలు, తాగునీటిని సక్రమంగా ఇప్పించాలని గ్రామస్థులు కోరారు. అవనిగడ్డ నియోజకవర్గంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, గన్నవరంలో ప్రభుత్వవిప్ యార్లగడ్డ వెంకట్రావు ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. గుడివాడలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రాష్ట్ర గిడ్డంగులసంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లాలోని విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో ఎంపీ కేశినేని శివనాథ్, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర యాదవ్, మాజీ ఎమ్మెల్సీ మంతెన వెంకట సత్యనారాయణ రాజు కార్యక్రమాలు నిర్వహించారు. విశాఖ జిల్లాలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా ఆరు నియోజకవర్గాల్లో కార్యక్రమాలు కొనసాగాయి. విశాఖ ఉత్తర నియోజకవర్గంలో టీడీపీకి ఇన్‌చార్జి లేకపోవడంతో అక్కడ తొలి అడుగు కార్యక్రమం నిర్వహించలేదు. గాజువాకలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, విశాఖ దక్షిణ నియోజకవర్గంలో ఎంపీ ఎం.శ్రీభరత్ కార్యక్రమాలు నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు, అరకులోయ, రంపచోడవరం నియోజకవర్గాల్లో కార్యక్రమాలు కొనసాగాయి. అనకాపల్లి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోనూ కార్యక్రమం మొదలైంది. పాయకరావుపేట నియోజకవర్గంలో హోంమంత్రి వంగలపూడి అనిత ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు, సాధించిన విజయాలు, భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అనంతరం రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ప్రకాశం జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో కార్యక్రమాలు కొనసాగాయి. కడప, అనమ్మయ్య జిల్లాల్లో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మంగళవారం టీడీపీ నేతలు ఇంటింటి బాట పట్టారు. కడప జిల్లా పులివెందులలో బీటెక్ రవి, రాయచోటి నియోజకవర్గంలో మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

జోరు వర్షంలోనూ తొలి అడుగు

ఏలూరు జిల్లావ్యాప్తంగా వర్షాలు పడుతున్నా తొలి అడుగు కార్యక్రమానికి అనూహ్య స్పందన కనిపించింది. ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భారీగా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నూజివీడు నియోజకవర్గంలో మంత్రి కొలుసు పార్థసారథి, ఏలూరు జిల్లా కేంద్రంలో ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ యాదవ్, మేయర్ షేక్ నూర్జహాన్, దెందులూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఎంపీ మహేశ్ యాదవ్ పాల్గొన్నారు. చింతలపూడిలో ఎమ్మెల్యే రోషన్ అందుబాటులో లేకపోవడంతో పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు కోళ్ల నాగేశ్వరరావు కార్యక్రమాన్ని ఆరంభించారు. కైకలూరు, ఉంగుటూరు, పోలవరం నియోజకవర్గాల్లో టీడీపీ ఎమ్మెల్యేలు లేనందున నియోజకవర్గ కన్వీనర్లు గన్ని వీరాంజనేయులు, బొరగం శ్రీనివాసరావు, అచ్యుతరావులు తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లాల్లో పాలకొల్లులో మంత్రి నిమ్మల రామానాయుడు, విజయనగరం జిల్లాలోని గజపతినగరం నియోజకవర్గంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, బాపట్ల జిల్లా రేపల్లెలో మంత్రి అనగాని సత్యప్రసాద్, అద్దంకి నియోజకవర్గంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాలు అందుతున్నాయా? అని ఆరా తీశారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం శివరాంపురం గ్రామంలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఉరవకొండలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, గోరంట్ల మండలం వానవోలులో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, రాయదుర్గంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, రాప్తాడులో ఎమ్మెల్యే పరిటాల సునీత, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి, గుంతకల్లులో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కళ్యాణదుర్గంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు వర్షం కురుస్తున్నా ఇంటింటికీ పర్యటించారు. నంద్యాల పట్టణంలో మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పర్యటించి ప్రజల సమస్యలను యాప్‌లో నమోదు చేసుకున్నారు. ఓ మహిళ చిన్నారికి స్నానం చేయిస్తుండగా.. మంత్రి సైతం సదరు చిన్నారికి స్నానం చేయించడం ఆకట్టుకుంది. మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి బనగానపల్లె నియోజకవర్గంలో, ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి డోన్ పట్టణం, ఎంపీ బైరెడ్డి శబరి, నందికొట్కూరు మండలం దామగట్ల గ్రామంలో, ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియ ఆళ్లగడ్డ నియోజకవర్గంలో, నెల్లూరు నగరంలో మంత్రి పొంగూరు నారాయణ, ఆత్మకూరు పట్టణంలో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తిరుపతి జిల్లాలో వెంకటగిరి, సత్యవేడు మినహా మిగిలిన నియోజకవర్గాల్లో తొలి అడుగు కార్యక్రమం ప్రారంభమైంది.



అన్నమయ్య జిల్లా సంబేపల్లె మండలం రౌతుకుంట దిన్నెమీద పల్లెలో దివ్యాంగ మహిళ గోడు వింటున్న మంత్రి రాంప్రసాద్



నెల్లూరులో మహిళకు ప్రచార కరపత్రం అందజేస్తున్న మంత్రి నారాయణ



శ్రీసత్యసాయి జిల్లా గోరంట్ల మండలం వానవోలులో మహిళలతో మాట్లాడుతున్న మంత్రి సవిత



నంద్యాలలో చిన్నారికి స్నానం చేయిస్తున్న మంత్రి ఫరూక్



నెల్లూరు జిల్లా ఆత్మకూరులో వృద్ధురాలికి కరపత్రం అందజేసి మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



మచిలీపట్నంలో ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి కొల్లు రవీంద్ర



నంద్యాల జిల్లా కోవెలకుంట్ల మండలంలోని గుల్లదుర్తిలో కరపత్రాలను అందజేస్తున్న మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి



అత్తిలిలో వృద్ధురాలితో మాట్లాడుతున్న తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి

తుంగభద్ర నుంచి నీటి విడుదల


తుంగభద్ర డ్యాం గేట్లు ఎత్తడంతో దిగువకు ప్రవహిస్తున్న నీరు

- ఆరు గేట్లు ఎత్తిన అధికారులు
- డ్యాంలో ప్రస్తుతం 77 టీఎంసీల నీరు
- 80 టీఎంసీలకు మించి నిల్వ చేయొద్దన్న నిపుణులు

కర్నూలు, బళ్లారి గాంధీనగర్, జూలై 2(ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయం నుంచి అధికారులు నీటిని దిగువకు విడుదల చేశారు. డ్యాం గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 77.144 టీఎంసీల నీరు డ్యాంలోకి చేరింది. డ్యాం భద్రత దృష్ట్యా ఈ ఏడాది 80 టీఎంసీలకు మించి నీటిని నిల్వ చేయవద్దని నిపుణులు సూచించడంతో అధికారులు బుధవారం ఆరు గేట్లు ఎత్తి దిగువకు 16 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 1,633 అడుగులు కాగా, ప్రస్తుతం 1625.20 అడుగుల వరకూ నీరు చేరింది. డ్యాంలోకి ఎగువ నుంచి 32,767 క్యూసెక్కుల వరద వస్తోంది. తుంగభద్ర గేట్లెత్తి నదికి నీటిని విడుదల చేయడం పదేళ్ల రికార్డని టీబీపీ ఎస్ఈ నారాయణ తెలిపారు.


శ్రీశైలం జలాశయంలో జలకళ

శ్రీశైలానికి కొనసాగుతున్న వరద

మహారాష్ట్ర, కర్ణాటకలో కురుస్తున్న వర్షాల వల్ల శ్రీశైలం జలాశయానికి వరద పోటెత్తుతోంది. బుధవారం రాత్రి ఎగువ జూరాల నుంచి 64,030 క్యూసెక్కులు వరద వచ్చి చేరుతోంది. డ్యాం గరిష్ఠ నీటి మట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 875.60 అడుగుల వరకు నీరు చేరింది. డ్యాం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 166.31 టీఎంసీల వరద చేరింది. ఎగువ నుంచి వచ్చే వరదను వచ్చినట్లుగానే విద్యుత్ ఉత్పత్తి ద్వారా దిగువనున్న నాగార్జునసాగర్‌కు వదిలేస్తున్నారు. ఏపీ ప్రభుత్వం కుడి వైపు విద్యుత్ కేంద్రం ద్వారా 27,708 క్యూసెక్కులు, తెలంగాణ ప్రభుత్వం ఎడమ వైపు విద్యుత్ ఉత్పత్తి కేంద్రం ద్వారా 35,315 క్యూసెక్కులు చొప్పున దిగువకు వదిలేస్తున్నాయి.

గోదావరికి పెరిగిన వరద

పోలవరం, జూలై 2(ఆంధ్రజ్యోతి): గోదావరిలో నీటిమట్టం బుధవారం నాటికి అనూహ్యంగా పెరిగింది. అదనంగా వస్తున్న 1,06,795 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేసినట్టు జలవనరుల శాఖ అధికారులు తెలిపారు. వారం రోజులుగా ఏలూరు జిల్లాలోని గోదావరి ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు సీలేరు, మంజీర, శబరి తదితర ఉపనదులు, కొండవాగుల నుంచి వరద పొంగి గోదావరిలో కలుస్తోంది. అదనంగా వస్తున్న జలాలను పోలవరం ప్రాజెక్టు స్పిల్వే 48 గేట్లు, స్లూయిజ్ గేట్ల నుంచి దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 27.160 మీటర్లు, దిగువన 18 మీటర్లు, ఎగువ కాపర్ డ్యాంకు ఎగువన 27.250 మీటర్లు, దిగువ కాపర్ డ్యాంకు దిగువన 16.100 మీటర్లు, ఎగువ, దిగువ కాపర్ డ్యాంల మధ్య 16 మీటర్ల నీటిమట్టం నమోదైంది.

చురుకుగా రుతుపవనాలు

- రాష్ట్రంలో అనేక చోట్ల ముసురు వాతావరణం
- నేడూ కోస్తా, రాయలసీమల్లో వర్షాలు

విశాఖపట్నం, జూలై 2(ఆంధ్రజ్యోతి): జార్ఖండ్ పరిసరాల్లో మంగళవారం నాటికి ఉన్న అల్పపీడనం బలహీనపడింది. అయితే అదే ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీనికితోడు రాజస్థాన్ నుంచి మధ్య భారతం మీదుగా పశ్చిమ బెంగాల్ వరకూ ఉపరితల ద్రోణి విస్తరించింది. వీటి ప్రభావంతో నైరుతి రుతుపవనాలు చురుగ్గా కదులుతున్నందున బుధవారం అనేకచోట్ల ముసురు వాతావరణం నెలకొంది. అనేకచోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరుగా, అక్కడక్కడ భారీగా వర్షాలు కురిశాయి. బుధవారం ఉదయం నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు ఆదోని మండలం గనేకల్‌లో 71.5, పెసలబందలో 65 మి.మీ. వర్షపాతం నమోదైంది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో పలు చోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

విశాఖలో కాగ్నిజెంట్‌కు 22.19 ఎకరాలు

- ఎకరా 99 పైసల చొప్పున కేటాయిస్తూ ఉత్తర్వులు

అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి): వైజాగ్‌లో రూ.1,582 కోట్ల పెట్టుబడితో, 8,000 మందికి ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతో ఐటీ క్యాంపస్ ఏర్పాటుకు ముందుకొచ్చిన 'కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్'కు విశాఖపట్నం జిల్లా మధురవాడలో ఎకరా 99 పైసల చొప్పున 22.19 ఎకరాలు కేటాయిస్తూ రాష్ట్ర ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ మధురవాడలో ఐటీ సొల్యూషన్స్ క్యాంపస్‌ను ఏర్పాటు చేసేందుకు చేసిన ప్రతిపాదనలకు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి, మంత్రిమండలి ఆమోదం తెలిపాయి. ఐటీ రంగం విస్తరణకు ప్రోత్సాహమివ్వడంలో భాగంగా ఎకరా 99 పైసలకే కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఏడాది జూన్ 13న కాగ్నిజెంట్ ఈ క్యాంపస్ ప్రతిపాదన చేసింది. కాగా, ఈ ప్రతిపాదనలు అందిన పక్షం రోజుల్లోనే రాష్ట్ర ప్రభుత్వం అన్ని అనుమతులూ ఇచ్చింది. ఈ సెంటర్‌ను 2028 జూన్ నాటికి ప్రారంభిస్తామని కాగ్నిజెంట్ వెల్లడించింది.

టాటా ఇన్నోవేషన్ హబ్‌లకు ప్రభుత్వ ప్రతినిధులుగా జేసీలు

- ఉత్తర్వులు జారీచేసిన ఐటీశాఖ

అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి): 'రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్'లకు రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులుగా జాయింట్ కలెక్టర్ల(జేసీ)ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేయనుంది. అలాగే.. విశాఖపట్నం, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, అనంతపురం ఏర్పాటు చేసే ప్రాంతీయ కేంద్రాలకు ప్రతినిధులుగా జేసీలను నామినేట్ చేస్తూ బుధవారం ఐటీశాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ ఉత్తర్వులు జారీచేశారు. వీరంతా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రాంతీయ కేంద్రాల యాజమాన్య నిర్వహణను పర్యవేక్షిస్తూ, సమన్వయం చేసుకుంటారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ కేంద్రాలకు మౌలిక సదుపాయాల కల్పన బాధ్యత జాయింట్ కలెక్టర్లదేనని ప్రభుత్వం పేర్కొంది.

భూచోడికి దాసోహం

వైసీపీ నేతకు కీలక అధికారి అండ.. కాకినాడలో భూచట్టాల అమలు రివర్స్

కాకినాడ భూదందాలో మరో కొత్త కోణం! కీలక వైసీపీ నేత నాడు జగన్ అధికారాన్ని అడ్డంపెట్టుకొని కాకినాడ కలెక్టరేట్‌లోని భూమి రికార్డులను మార్చేశారు. చట్టాలను అమలు చేయాల్సిన ఉన్నతాధికారులు కూడా ఆ నేత అధికార దర్పానికి భయపడి అప్పట్లో జీహుజూర్ అన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలోనూ ఆ వైసీపీ నేతకే కొందరు అధికారులు సలామ్ కొడుతున్న ఉదంతం కొత్తగా వెలుగులోకి వచ్చింది. వైసీపీ నేత కన్నుపడ్డ భూముల్లోకి హక్కుదారులను వెళ్లనివ్వకుండా ఓకీలక అధికారి అడ్డుకున్నారు. అనధికారికంగా ఆ భూములను సీజ్ చేయించేశారు. అది ఎలాగంటే..

- రికార్డు ఫోర్జరీ అని తేల్చిన జేసీ, ఆర్‌డీవో, తహసీల్దార్
- అయినా భూమ్మీదకు వెళ్లవద్దంటూ ఆ అధికారి నోటీసు
- ఏ చట్టం కింద నోటీసు ఇచ్చారో తెలపని వైనం
- పెద్దల కోసం కీలక అధికారి ప్రయత్నాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

తానేం చేసినా సామాన్యులు ఏం చేస్తారులే అని ఆ కీలక అధికారి తల ఎగరేశారు. వైసీపీ హయాంలో భూకబ్జాలకు పాల్పడిన వైసీపీ నేతకు కూటమి ప్రభుత్వంలోనూ మేలు చేయాలని ప్రయత్నించి... అడ్డంగా దొరికిపోయారు. సుమారు 400 కోట్ల విలువైన ప్రైవేటు భూములపై నాటి వైసీపీ కీలక నేత కన్నువేసిన విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చింది. 'సరి'దిద్దలేని' దందా' పేరిట బుధవారం సంచికలో కథనం ప్రచురించింది. అయితే, కాకినాడ జిల్లాలో ఓ కీలక అధికారి ఈ వ్యవహారంలో కర్త, కర్మ, క్రియగా వ్యవహరిస్తున్నారని తాజాగా వెలుగులోకి వచ్చింది. వైసీపీ నేత ఫోర్జరీ అక్రమంతో దెబ్బతిన్న ముగ్గురు బాధితులకు జిల్లా జాయింట్ కలెక్టర్ 2023 నవంబరులో ఇచ్చిన నివేదిక ఊపిరి పీల్చుకునేలా చేసింది. ఆ భూములను ఇకనైనా కాపాడుకునేందుకు చర్యలు ప్రారంభించారు. భూమి చుట్టూ కాంపౌండ్‌వాల్ ఏర్పాటు చేసుకున్నారు. అంతే .... ఆ వైసీపీ నేత తన అనుచరుడితో జిల్లా ఉన్నతాధికారికి ఓ ఫిర్యాదు పెట్టించారు. ఆ భూమి తనదని, తనకే ఇప్పించాలని ఆ తప్పుడు ఫిర్యాదులో కోరారు. ఆ ఫిర్యాదు ఆధారంగా గత ఏడాది అక్టోబరు 14న కాకినాడ ఆర్‌డీవోను విచారణ చేయాల్సిందిగా జిల్లా ఉన్నతాధికారి ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఫోర్జరీకి గురయిన ఫెయిర్ అడంగల్‌లో అక్రమంగా హక్కుదారుగా పేరునమోదు చేయించిన వ్యక్తే ఫిర్యాదు దారుగా ఉన్నారని ఆర్‌డీవో నిర్ధారించారు. ఈ మేర కు తన విచారణ నివేదికకు, 2023 నవంబరులో జాయింట్ కలెక్టర్ ఇచ్చిన విచారణ నివేదికను జతచేసి నివేదించారు. అంటే, ఫిర్యాదు తప్పుడుదని ఆర్‌డీవో తేల్చారు. ఇక ఇదే తరహాలో తహసీల్దార్ కూడా నివేదిక ఇచ్చారు. ఈ రెండు నివేదికలు వైసీపీ నేత కబ్జాకోరు ఆలోచనలను దెబ్బతీసేలా ఉన్నాయి. దీంతో మరోసారి రాజకీయ నేతలు రంగప్రవేశం చేసి కీలక అధికారిని ఆ భూమిపైకి ఉసిగొలిపారు. అంతే....ఆ అధికారి వైసీపీ నేత కోసం అడ్డదారులు తొక్కారు. ఉత్తర్వు మీరి ప్రవర్తిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అయితే, ఇక్కడ ఆ ఉత్తర్వుకు చట్టబద్ధత, హేతుబద్ధత లేదని తేలింది. ఏకపక్షంగా వైసీపీ నేత మెప్పుకోసం ఆ అధికారి తన పరిధి దాటి, చట్టవిరుద్ధంగా ఉత్తర్వులు ఇచ్చారు. తానిచ్చిన ఆదేశం ఏ చట్టప్రకారం చెల్లుబాటవుతుందో, దాన్ని ఏ సెక్షన్ ధ్రువపరుస్తుందో ఆయన పేర్కొనలేదు. సామాన్యులను చట్టాల పేరుచెప్పి భయపెట్టాలనుకున్న ఆయన, తన ఇష్టప్రకారం ఉత్తర్వులు ఇస్తానని ఆచరణలో చూపించారు. అంతేనా.. హక్కుదారుల భూములున్న ప్రాంతాన్ని రెవెన్యూ అధికారులతో సీజ్ చేయించారు. అయితే ఇదిఅనధికారికమే! ఇందులో మరో అతిపెద్ద ట్విస్ట్ ఉంది.

పోలీసులది రక్షణ.. ఈయనది భక్షణ

ప్రైవేటు భూముల విషయంలో అనవసరంగా తలదూర్చి సమస్యలను మరింత సంక్లిష్టంగా మార్చకూడదని, రికార్డుల ప్రకారం హక్కుదారుల ప్రయోజనాలను కాపాడాలని ఆర్‌డీవో స్థాయి అధికారి నివేదించారు. కానీ ఆ కీలక అధికారి ఇందుకు పూర్తి భిన్నంగా వ్యవహరించారు. ఓ ఆర్‌డీవోకు ఉన్న పాటి అవగాహన, పరిజ్ఞానం, చట్టాల పట్ల విధేయత సదరు అధికారికి లేకుండా పోయిందని ఈ ఉదంతమే నిరూపిస్తోంది. కలెక్టరేట్‌లోని భూమి రికార్డులను ఫోర్జరీ చేసిన, దాని వెనక ఉన్న దొంగలను గుర్తించి చట్టప్రకారం కఠినచర్యలు తీసుకోవాల్సిన అధికారే అక్రమార్కుల ప్రయోజనాలను కాపాడే ప్రయత్నం చేస్తుండటం ఇప్పుడు రెవెన్యూశాఖలో చర్చనీయాంశంగా మారింది. ఇందులో మరో ట్విస్ట్ కూడా ఉంది. ప్రైవేటు భూముల హక్కుదారుల ప్రయోజనాలు, రక్షణ కోసం పోలీసులు ముందుండి పనిచేస్తున్నారు. తమకు అందిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించి రక్షణ చర్యలు చేపడుతున్నారు. కానీ, జిల్లా అధికారి మాత్రం ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తుండటం రెవెన్యూ శాఖ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

రాజీనామా స్వచ్ఛందమే

- వ్యక్తిగత కారణాలతో నిర్ణయం
- తప్పుడు వార్తలు వ్యాప్తి చేయొద్దు
- ఐపీఎస్ సిద్ధార్థ్ కౌశల్ స్పష్టీకరణ
- రిలయన్స్‌లో భారీ ప్యాకేజీ ఆఫర్
- నెల క్రితం వీఆర్ఎస్‌కు దరఖాస్తు



అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి): ఉద్యోగానికి స్వచ్ఛందంగా రాజీనామా చేసినట్లు ఏపీ కేడర్‌కు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి సిద్ధార్థ్ కౌశల్ స్పష్టం చేశారు. దీర్ఘకాలిక లక్ష్యాలు, వ్యక్తిగత కారణాలతో కుటుంబ సభ్యులతో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఓ ప్రకటనలో వెల్లడించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం) పూర్వ విద్యార్థి అయిన సిద్ధార్థ్ కౌశల్‌కు ప్రైవేటు రంగంలో భారీ ఆఫర్ రావడంతో నెల రోజుల క్రితం వీఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తర్వాత ఫైలు కేంద్ర హోం శాఖకు చేరింది. త్వరలో అక్కడ కూడా ఆమోదం లభించనుంది. కాగా జగన్ రోత పత్రికలో సిద్ధార్థ్ రాజీనామాపై చెత్త రాతలు రాయడంతో ఆయన గట్టిగా స్పందించారు. వ్యక్తిగత కారణాలతో ఉద్యోగానికి రాజీనామా చేస్తే నిరాధార వార్తలు ప్రచురించడం, ప్రసారం చేయడం సరికాదని హితవు పలికారు. ఏపీలో తన సేవాకాలాన్ని అత్యంత సంతృప్తికరమైన ప్రయాణంగా పేర్కొన్నారు. ఈ రాష్ట్రం తనకు సొంతూరు లాంటిదని, ఇక్కడి ప్రజల ప్రేమాభిమానాలు జీవితాంతం గుర్తుంటాయని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు సహచరులు, రాష్ట్ర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. సమాజానికి కొత్త రీతిలో సేవ చేయబోతున్నట్లు తన సంకల్పాన్ని వెల్లడించారు. ఇదిలావుండగా ఆయన భారీ ప్యాకేజీతో రిలయన్స్‌లో ఉన్నత ఉద్యోగంలో చేరబోతున్నారని తెలిసింది. ఆయన మిత్రులైన మరో ఇద్దరు ఐపీఎస్ అధికారులు(ఏపీ కేడర్ కాదు) కూడా ఇదే బాటలో వెళుతున్నట్లు ఉన్నత స్థాయి పోలీసు వర్గాల్లో చర్చ జరుగుతోంది.

250 కోట్లు తరలించారు

అవన్నీ మద్యం ముడుపులే.. చెవిరెడ్డి ఆదేశాలతోనే నగదు రవాణా

- బాలాజీ,నవీన్ రిమాండ్ రిపోర్టులో సిట్
- కస్టడీకి ఇవ్వాలని ఏసీబీ కోర్టును కోరిన సిట్

అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి): "వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి నవీన్ కృష్ణ నమ్మకస్థుడు, వ్యక్తిగత సహాయకుడు. బాలాజీ యాదవ్ బంటు లాంటోడు. వీరిద్దరి ద్వారానే చెవిరెడ్డి రెండు రాష్ట్రాల మధ్య 250 కోట్లకు పైగా మద్యం ముడుపులను రహస్యంగా రవాణా చేయించారు." అని నవీన్, బాలాజీల రిమాండ్ రిపోర్టులో సిట్ అధికారులు పేర్కొన్నారు. తమ దర్యాప్తులో ఆధారాలు లభించడంతో నిందితుల జాబితాలో వీరిని చేర్చామని, విచారణకు పిలవగానే పారిపోయారని, ఆచూకీ పసిగట్టి అరెస్టు చేశామని ఏసీబీ కోర్టుకు తెలిపారు. "గరికపాడు చెక్‌పోస్టు వద్ద 2024లో పట్టుబడిన డబ్బును చెవిరెడ్డి ఆదేశాలతోనే నవీన్, బాలాజీ తరలించారు. సీజ్ చేసిన ఆ డబ్బుకు సంబంధించి కేసు చిల్లకల్లు పోలీసు స్టేషన్‌లో నమోదైంది. వీటన్నింటిపై నవీన్, బాలాజీలను కస్టడీకి తీసుకుని విచారించాల్సి ఉంది." అని తెలిపారు. వైసీపీ హయాంలో జరిగిన రూ.మూడున్నర వేల కోట్ల మద్యం కుంభకోణంలో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ముఖ్య అనుచరులు బాలాజీ కుమార్ యాదవ్(ఏ-35), ఎద్దల నవీన్ కృష్ణ(ఏ-36)ను సిట్ అధికారులు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో అరెస్టు చేశారు. విజయవాడకు తీసుకొచ్చి ఇక్కడి ఏసీబీ కోర్టులో బుధవారం ప్రవేశపెట్టారు. మద్యం ముడుపుల సొమ్ము తరలింపులో ఈ ఇద్దరి పాత్ర గురించి కోర్టుకు సిట్ అధికారులు వివరించారు. తిరుపతిలో చెవిరెడ్డి చెప్పడంతో తుడా కార్లు తీసుకెళ్లి హైదరాబాద్ నుంచి ఎప్పుడెప్పుడు ఎంతెంత డబ్బులు తీసుకొచ్చారు.. అక్కడ తీసుకున్న డబ్బులు ఏ మార్గంలో తీసుకొచ్చారు.. తాడేపల్లిలో ఎక్కడ నిల్వ చేశారు.. అక్కడి నుంచి ఒంగోలు, తిరుపతి ప్రాంతాల్లోని వైసీపీ అభ్యర్థులకు ఎన్నికల ఖర్చుల కోసం ఎలా అందజేశారు.. తదితర వివరాలు రిమాండ్ రిపోర్టులో సిట్ అధికారులు పొందు పరిచారు. "చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి అత్యంత నమ్మకస్థుడైన బాలాజీ ఏపీఎస్‌పీడీసీఎల్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా జీతం తీసుకొంటూ చెవిరెడ్డి దగ్గరే ఉంటూ వ్యక్తిగత పనులు చేసేవారు. అదే సమయంలో వ్యక్తిగత సహాయకుడుగా ఉన్న ఎద్దల నవీన్, గన్‌మెన్‌గా పని చేసిన గిరిధర్‌తో కలిసి ముడుపుల సొమ్ము హైదరాబాద్, తాడేపల్లి, ప్రకాశం జిల్లాల్లో పలుచోట్లకు చేర్చారు. ఒకసారి భయంతో 'నాకు ఇబ్బంది అవుతుంద'ని గన్ మెన్ గిరి చెప్పినా.. 'నీకెందుకు నేనున్నా. మనమే అధికారంలోకి వస్తాం' అని చెవిరెడ్డి భరోసా ఇచ్చారు. దీనికితోడు తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి(ఏ-39) పలుమార్లు వాహనాలు సమకూర్చారు. ఆ వాహనాల్లో డబ్బులు హైదరాబాద్ నుంచి తీసుకొచ్చి తాడేపల్లి ల్యాండ్ మార్క్ అపార్ట్‌మెంట్‌కు చేర్చారు. 2024 ఫిబ్రవరిలో అక్కడి 312 నంబర్ ఫ్లాట్‌లో డంప్ చేసి ప్రణయ్ ప్రకాశ్‌ను కాపలాగా ఉంచారు. ఇదే విషయమై అక్కడ తాము విచారించగా, కొందరు వ్యక్తులు డబ్బులు కార్లలో దించడం, ఎత్తడం చూశామని కొందరు స్థానికులు చెప్పారు. బాలాజీ యాదవ్ హైదరాబాద్‌లో సైమన్, తాడేపల్లిలో ప్రణయ్ ప్రకాశ్‌ను పలుమార్లు కలిసి భారీగా డబ్బులు తెచ్చుకున్నారు. పలు విడతల్లో సుమారు రూ. 250కోట్లు ఇలా తరలించి ఎన్నికల్లో వినియోగించారు. ముడుపుల డంప్‌లు, సీడీఆర్‌లు, సెల్ టవర్ లొకేషన్లు, టోల్‌ప్లాజాల్లో ఫుటేజీలు, డివైస్ యాక్టివిటీల విశ్లేషణలో రుజువులు లభించాయి." అని రిమాండ్ రిపోర్టులో వివరించింది.



ధనుంజయ్, కృష్ణమోహన్ బెయిల్ పిటిషన్లు డిస్మిస్

- విజయవాడ ఏసీబీ కోర్టు తీర్పు

విజయవాడ, జూలై 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణం కేసులో విజయవాడ జిల్లా జైల్లో ఉన్న మాజీ ఐఏఎస్ అధికారి కె. ధనుంజయరెడ్డి, మాజీ సీఎం జగన్ ఓఎస్డీ పి. కృష్ణమోహన్‌రెడ్డికి ఏసీబీ కోర్టు షాక్ ఇచ్చింది. వారు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను డిస్మిస్ చేసింది. రిమాండ్ ఖైదీలుగా ఉన్న తమకు బెయిల్ ఇవ్వాలని ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి బెయిల్ పిటిన్లను దాఖలు చేశారు. వాదనలు ముగియడంతో న్యాయాధికారి పి. భాస్కరరావు తీర్పును వెలువరించారు.

జైలు నుంచి వంశీ విడుదల


జైలు నుంచి బయటకు వస్తున్న వంశీ

విజయవాడ, జూలై 2(ఆంధ్రజ్యోతి): పలు కేసుల్లో అరెస్టయిన గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ బెయిల్‌పై జైలు నుంచి బయటికి వచ్చారు. నకిలీ ఇళ్ల పట్టాల కేసులో నూజివీడు కోర్టు మంగళవారం ఆయనకు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. ఆ పత్రాలను ఆయన తరఫు న్యాయవాదులు బుధవారం జైలు అధికారులకు అందజేయడంతో ఆయనను విడుదల చేశారు. తొలుత ఈ ఏడాది ఫిబ్రవరి 13న ముదునూరి సత్యవర్ధన్ కేసులో పటమట పోలీసులు వంశీని అరెస్టు చేశారు. ఆ తర్వాత వంశీ నిందితుడిగా ఉన్న పాత కేసులకు సంబంధించి ఆయా స్టేషన్ల పోలీసులు వరుసగా పీటీ వారెంట్లు దాఖలు చేశారు. అప్పటి నుంచి వివిధ కేసుల్లో వంశీకి న్యాయస్థానాలు రిమాండ్ విధించి, పొడిగించాయి. మొత్తం 137 రోజులపాటు వంశీ కారాగారంలో గడిపారు.

అక్రమ మైనింగ్‌లో వంశీనే సూత్రధారి

- సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాది లూథ్రా వాదనలు

న్యూఢిల్లీ, జూలై 2(ఆంధ్రజ్యోతి): రూ.195 కోట్ల విలువైన అక్రమ మైనింగ్ వ్యవహారంలో వైసీపీ నేత వల్లభనేని వంశీనే సూత్రధారి అని సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా సుప్రీంకోర్టుకు వివరించారు. వంశీ బెయిల్‌ను రద్దు చేయాలని కోరారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం గత నెల 12న సుప్రీంకోర్టులో వేసిన పిటిషన్‌పై బుధవారం జస్టిస్ ఎం.ఎం సుందరేశ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ముందు వర్చువల్‌గా వాదనలు వినిపించారు. మైనింగ్ సహా అనేక కేసుల్లో వంశీ నిందితుడిగా ఉన్నారని, కింది కోర్టు తమ వాదనలు వినకుండానే బెయిల్ మంజూరు చేసిందని చెప్పారు. ఈ సందర్భంగా.. 'ఇప్పటికే అనేక కేసుల్లో వంశీని అరెస్టు చేశారు కదా?' అని ధర్మాసనం ప్రశ్నించింది. మైనింగ్ వ్యవహారంపై సీల్డ్ కవర్‌లో నివేదిక ఇవ్వాలని ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. మైనింగ్ వాల్యూయేషన్‌పై నివేదిక ఇచ్చిన తర్వాత నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 17కు వాయిదా వేసింది.

భూ వివాదంలో..

గన్నవరంలోని భూ వివాదం కేసులోనూ వంశీకి ఇచ్చిన బెయిల్ రద్దు చేయాలని కోరుతూ సుంకర సీతామహాలక్ష్మి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌పై జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ ఎన్. కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా ధర్మాసనం జోక్యం చేసుకుని.. "రెండేళ్ల క్రితం జరిగిన ఘటనపై ఈ ఏడాదిలో ఎఫ్ఐఆర్ నమోదు చేశారేంటి? ఇది, సివిల్ కేసు కదా?. క్రిమినల్ కేసుగా ఎలా మార్చారు?." అని ప్రశ్నించింది. బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల్లో కలగజేసుకోవడానికి తమకు ఎలాంటి కారణాలు కనిపించడం లేదని పేర్కొంది. అనంతరం పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.

గ్రూప్1 కేసులో మధు రిమాండ్ పొడిగింపు

విజయవాడ, జూలై 2(ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూప్1 మూల్యాంకనం, నిధుల దుర్వినియోగం కేసులో నిందితుడిగా ఉన్న పమిడికాలవ మధుసూదన్‌కు కోర్టు రిమాండ్‌ను పొడిగించింది. రిమాండ్ గడువు ముగియడంతో పోలీసులు ఆయనను విజయవాడ జిల్లా జైలు నుంచి బుధవారం కోర్టుకు తీసుకొచ్చారు. మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరుపరచగా ఈ నెల 16 వరకు మధుకు రిమాండ్‌ను పొడిగిస్తూ న్యాయాధికారి దేవిక ఉత్తర్వులు ఇచ్చారు.

వైసీపీ నేతలకు నోటీసులిచ్చి వివరణ తీసుకోండి

- రెంటపాళ్ల పర్యటనలో ఆదేశాల ఉల్లంఘనపై హైకోర్టు ఆదేశం

అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా, సత్తెనపల్లి మండలం, రెంటపాళ్లలో వైసీపీ అధినేత జగన్ పర్యటించిన సందర్భంగా ఆ పార్టీ నేతలు అధికారుల ఆదేశాలను ఉల్లంఘించారని వీఆర్వో బూసిరాజు లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వైసీపీ నేతలు రోడ్లపై రాకపోకలను స్థంభింపజేసి ప్రజలకు అసౌకర్యం కలిగించారని పేర్కొన్నారు. దీంతో పోలీసులు వైసీపీ నేతలు విడదల రజని, దేవినేని అవినాశ్ సహా పలువురిపై కేసు నమోదు చేశారు. అయితే, తమపై నమోదైన కేసును కొట్టివేయాలని కోరుతూ విడదల రజని, దేవినేని అవినాశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై బుధవారం విచారణ జరిగింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది దుష్యంత్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ఇదే ఘటనలో మరికొందరు నిందితులకు బీఎన్ఎస్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం నోటీసులు ఇచ్చి వివరణ తీసుకోవాలని కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ఈ వివరాలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి ప్రస్తుత పిటిషనర్ల విషయంలో అవే ఉత్తర్వులు వర్తిస్తాయని స్పష్టం చేశారు.

అరెస్టు చేయకుండా ఆపలేం!

- వైసీపీ మద్యం కుంభకోణం కేసులో మోహిత్‌రెడ్డికి హైకోర్టు స్పష్టీకరణ
- 'బెయిల్' పిటిషన్ వేయాలని సూచన

అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం కేసులో ఆ పార్టీ నేత చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడు మోహిత్ రెడ్డికి అరెస్ట్ నుంచి రక్షణ కల్పించలేమని హైకోర్టు తేల్చి చెప్పింది. ఈ కేసులో చాలా తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయని, రక్షణ కల్పించలేమని స్పష్టం చేసింది. పోలీసులు అరెస్టు చేస్తారన్న ఆందోళన ఉంటే ముందస్తు బెయిల్ దాఖలు చేసుకోవాలని సూచించింది. విచారణను ఈ నెల 9కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. శ్రీనివాసరెడ్డి ఉత్తర్వులు ఇచ్చారు. మద్యం కుంభకోణంలో మంగళగిరి సీఐడీ పోలీసులు తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ మోహిత్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించాడు. నిందితుల జాబితా నుంచి తన పేరును తొలగించేలా పోలీసులను ఆదేశించాలని కోరారు. బుధవారం వ్యాజ్యం విచారణకు రాగా.. మోహిత్‌రెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది నాగేశ్వరరావు వాదనలు వినిపించారు. పిటిషనర్‌ను కేసులో నిందితుడిగా చేర్చారని, సాక్షిగా తమ ముందు విచారణకు హాజరుకావాలని నోటీసులు ఇచ్చారన్నారు. ఇలా చేయడం సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధమని తెలిపారు. ఈ దశలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ.. కేసు దర్యాప్తులో భాగంగా వివరాలు తెలుసుకొనేందుకు సాక్షిగా మోహిత్‌రెడ్డికి నోటీసులు ఇచ్చే అధికారం దర్యాప్తు అధికారికి ఉందన్నారు.

'జెడ్ ప్లస్' కేటగిరీలోఎలాంటి రక్షణ కల్పిస్తారు?

- కేంద్ర హోంశాఖ గైడ్‌లైన్స్ కోర్టు ముందు ఉంచండి
- పిటిషనర్లకు హైకోర్టు ఆదేశం.. విచారణ నేటికి వాయిదా

అమరావతి, జూలై 2(ఆంధ్రజ్యోతి): 'జెడ్ ప్లస్' కేటగిరీ భద్రత ఉన్న వ్యక్తులకు రక్షణ కల్పించే విషయంలో కేంద్ర హోంశాఖ జారీ చేసిన మార్గదర్శకాలను(గైడ్ లైన్స్) తమ ముందు ఉంచాలని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు పిటిషనర్లు లేళ్ల అప్పిరెడ్డి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డిని ఆదేశించిన న్యాయమూర్తి జస్టిస్ ఎన్. హరినాథ్ విచారణను గురువారానికి వాయిదా వేశారు. మాజీ సీఎం జగన్ నెల్లూరు పర్యటన సందర్భంగా పట్టణంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో తాత్కాలిక హెలీప్యాడ్ ఏర్పాటు చేసుకునేందుకు అనుమతించేలా కలెక్టర్‌ను ఆదేశించాలని కోరుతూ పిటిషనర్లు కోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై మంగళవారం హైకోర్టు అత్యవసరంగా విచారణ జరిపింది. జగన్‌కు కల్పిస్తున్న భద్రతపై వివరాలు తెప్పించుకొని, కోర్టు ముందు ఉంచేందుకు ఎస్‌జీపీ సమయం కోరడంతో న్యాయమూర్తి విచారణను వాయిదా వేశారు. బుధవారం వ్యాజ్యం మరోసారి విచారణకు రాగా అడిషనల్ పీపీ పాణిని సోమయాజి, సహాయ ప్రభుత్వ న్యాయవాది బాలాజీ వాదనలు వినిపిస్తూ.. జగన్ తన నెల్లూరు పర్యటనను వాయిదా వేసుకున్నారన్నారు. పర్యటనకు వెళ్లాలని భావిస్తే అనుమతి కోసం అధికారులకు వినతిపత్రం సమర్పించుకోవాలన్నారు. ప్రస్తుత వ్యాజ్యం నిరర్థకమయిందని తెలిపారు.

సింగయ్య మృతిపై వైసీపీ మరో డ్రామా!

- కేసులో ఏ-2 జగన్ ఇంటికి మృతుడి భార్య
- అంబులెన్స్‌లో ఏదో జరిగిందంటూ అనుమానాలు

గుంటూరు, జూలై 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర సంచలనం సృష్టించిన సింగయ్య మృతి కేసును తప్పుదారి పట్టించేందుకు వైసీపీ నేతలు సరికొత్త డ్రామాకు తెర తీశారు. మృతుడి భార్య లూర్థు మేరీని ఏకంగా ఈ కేసులో ఏ-2 నిందితుడైన జగన్ నివాసానికి పిలిపించారు. అంతకు ముందే మాజీ మంత్రి అంబటి రాంబాబు సహా పలువురు వైసీపీ నాయకులు వెంగళాయపాలెంలోని మృతుడి ఇంటికి వెళ్లి అతడి భార్యకు రూ.10 లక్షలు అందజేశారు. బుధవారం లూర్థు మేరిని జగన్ నివాసానికి పిలిపించిన వైసీపీ నాయకులు వారి అనుకూల మీడియా ముందు ఆమెతో మాట్లాడించారు. పోలీసులు ఒత్తిడి చేయడంతోనే తాను ఫిర్యాదు చేశానని, ప్రమాదం జరిగిన తర్వాత చాలాసేపు సింగయ్య బాగానే ఉన్నాడని, 108 అంబులెన్స్‌లో జీజీహెచ్‌కు తీసుకువెళ్లే సమయంలోనే అందులో ఏదో జరిగిందంటూ కొత్త అనుమానాలను లేవనెత్తించారు. ఆమె వ్యాఖ్యలను బట్టి అంబులెన్స్‌లో సింగయ్యను ఉద్దేశపూర్వకంగా చంపారంటూ పరోక్షంగా సింగయ్య మృతిని హత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. అయితే సింగయ్య మృతికి రోడ్డు ప్రమాదమే కారణమని పోస్టుమార్టం నివేదికలో స్పష్టంగా వెల్లడైంది. ఈ కేసుకు సంబంధించి పోలీసులు వద్ద అన్ని ఆధారాలు ఉన్నాయి.నిందితుడి ఇంటికి ఫిర్యాదిని పిలిపించుకోవడమే కాకుండా కేసును తప్పుదారి పట్టించేలా ఆమెతో మాట్లాడించడం చట్టరీత్యా నేరమని చెబుతున్నారు.

పక్కా ఆధారాలున్నాయి: ఎస్పీ

జగన్ కారు ఢీకొని సింగయ్య మృతి చెందిన కేసుకు సంబంధించి తమ వద్ద పక్కా ఆధారాలు ఉన్నాయని గుంటూరు జిల్లా ఎస్పీ సతీశ్ కుమార్ స్పష్టం చేశారు. సింగయ్య భార్య లూర్థు మేరీ ఇచ్చిన ఫిర్యాదు మేరకే కేసు నమోదు చేశామని, ఆమెపై పోలీసులు ఒత్తిడి చేయలేదని పేర్కొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.